ప్రేమతో మాట్లాడు
ఆలోచించి మాట్లాడు
అర్థం చేసుకొని మాట్లాడు
మంచి మాట్లాడు
తెలివిగా మాట్లాడు
నవ్వుతూ మాట్లాడు
మనస్సు విప్పి మాట్లాడు
పూర్తిగా విన్న తరువాత మాట్లాడు
మనస్సు నొప్పించకుండా మాట్లాడు
తక్కువ మాట్లాడు



TGTEL/25/A1132

మానవాళికి

# జనం వార్త

ప్రతి అక్షరం.. జనం కోసం..

Q6 NEWS తెలుగు

మేడ్చల్ | శనివారం | 05.09.2026 | సంపుటి : 2 | సంచిక : 64 | పేజీలు : 8 | వెల : 5/- | ఎడిటర్ : గడ్డమీది నాగరాజు పటేల్




## ట్రంప్ దృష్టిలో అగ్రస్థానంలో మోదీ

### అమెరికా రాయబారి ఆసక్తికర వ్యాఖ్యలు!

జీ20 సదస్సు కోసం భారత ప్రధాని నరేంద్ర మోదీ అమెరికా వెళ్లనున్న నేపథ్యంలో ఇరు దేశాల మధ్య కీలక పరిణామాలు చోటుచేసుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. మోదీని కలవాలని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఎంతగానో కోరుకుంటున్నారని అమెరికా రాయబారి సెర్గియో గోర్ తెలిపారు. డిసెంబర్‌లో ఫ్లోరిడాలో జరిగే జీ20 సదస్సు కేవలం బహుపాక్షిక సమావేశాలకే పరిమితం కాకపోవచ్చని ఆయన వ్యాఖ్యానించారు. ట్రంప్ దృష్టిలో మోదీ స్నేహితుడని, 35 మంది నేతలు వస్తే ఎవరిని కలవాలనుకుంటారని అడిగితే.. మోదీ ఆయన జాబితాలో అగ్రస్థానంలో ఉంటారని గోర్ చెప్పారు. 2020లో భారత పర్యటనను ట్రంప్ ఇప్పటికీ ఎంతో ఇష్టంగా గుర్తుచేసుకుంటున్నారని, వచ్చే ఏడాది ఆయన భారత్‌కు వచ్చే అవకాశం కూడా ఉందని సంకేతాలు ఇచ్చారు.

04

# నీటిని పొదుపుగా వాడుకోండి

### జలాశయాల్లో తగినంత నీళ్లు లేవు

విద్యుత్ ఉత్పత్తి కోసమే నీటిని వాడొద్దు

పోతిరెడ్డిపాడు నుంచి నీటి నియంత్రించాలి

తెలుగు రాష్ట్రాలకు కేఆర్ఎంబీ సూచన

నీటి పంపకాల్లో కుదరని ఏకాభిప్రాయం..

వాడీవేడిగా కేఆర్ఎంబీ సమావేశం

మరోసారి వాయిదా పడ్డ కృష్ణాబోర్డు భేటీ

తెలుగు రాష్ట్రాలకు కేఆర్ఎంబీ కీలక సూచనలు చేసింది. విద్యుత్ ఉత్పత్తి కోసమే నీటిని ప్రాజెక్టుల నుంచి దిగువకు విడుదల చేయొద్దని పేర్కొంది. పోతిరెడ్డిపాడు నుంచి నీటి విడుదలను నియంత్రించాలంది. రెండు రాష్ట్రాల(ఏపీ, తెలంగాణ) నీటి అవసరాలను పరిగణనలోకి తీసుకోవాలని, ఉమ్మడి జలాశయాల్లో నీరు తక్కువగా ఉన్నందువల్ల పొదుపుగా వాడుకోవాలని సూచన చేసింది. కష్టకాలంలో తాగునీటికే ప్రాధాన్యం ఇవ్వాలని విభజన చట్టం నిర్దేశిస్తోందని కేఆర్?ఎంబీ స్పష్టం చేసింది. కృష్ణా జలాల అంశంపై ప్రతిష్టంభన వీడలేదు. కృష్ణా నదీ యాజమాన్య బోర్డు త్రిసభ్య కమిటీ సమావేశంలో ఏకాభిప్రాయం కుదరకపోవడంతో పూర్తి స్థాయి బోర్డు సమావేశంలో తేల్చాలని నిర్ణయించారు.




న్యూఢిల్లీ, సెప్టెంబర్ 4 : రెండు రాష్ట్రాల తాగునీటి అవసరాలు, శ్రీశైలం, నాగార్జునసాగర్ జలాశయాల్లోని నీటి నిల్వలపై చర్చించేందుకు హైదరాబాద్ జలసౌధలో జరిగిన కృష్ణా నదీ యాజమాన్య బోర్డు త్రిసభ్య కమిటీ సమావేశంలో ఎలాంటి నిర్ణయం తీసుకోలేకపోయారు. కేఆర్ఎంబీ సభ్య కార్యదర్శి సతీశ్ కాంబోజు అధ్యక్షతన జరిగిన సమావేశానికి తెలంగాణ ఇంజినీర్ ఇన్ చీఫ్ రమేశ్ బాబు, ఆంధ్రప్రదేశ్ ఈఎన్సీ నరసింహమూర్తితో పాటు రెండు రాష్ట్రాలకు చెందిన ఇంజినీర్లు హాజరయ్యారు. ప్రస్తుత నీటి లభ్యత, తాగునీటి అవసరాలు, శ్రీశైలం--నాగార్జునసాగర్ జలాశయాల పరిస్థితి, నీటి విడుదలపై సమావేశంలో చర్చ జరిగింది. కృష్ణా జలాల పంపిణీపై తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల

-మిగతా 2 లో..



# దేశానికే ఆదర్శం కావాలి

### రూ.5 వేల కోట్లతో నిర్మిస్తున్నఎడ్యుకేషన్ హబ్‌పై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

తమ ప్రభుత్వం పేదలను అమ్మలా ఆదుకుంటుందని వెల్లడి

కొడంగల్ పర్యటనలో భాగంగా పలు మండలాల్లో పర్యటన

కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు అండగా ఉంటుందని.. అమ్మలా ఆదుకుంటుందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. శుక్రవారం తన సొంత నియోజకవర్గమైన కొడంగల్‌కు రెండు రోజుల పర్యటన కోసం వచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి.. వికారాబాద్ జిల్లాలోని మద్దూరు, దౌల్తాబాద్, దుద్యాల మండలాల్లో పర్యటించారు. ఆయా ప్రాంతాల్లో జరుగుతున్న ప్రభుత్వ అభివృద్ధి పనులను స్వయంగా పర్యవేక్షించారు.

హైదరాబాద్, సెప్టెంబర్ 4 : దుద్యాల మండలం హకీంపేట, లగచర్ల, పోలేపల్లి శివారుకు చేరుకున్న సీఎం రేవంత్‌రెడ్డి.. రూ. 5 వేల కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న ఎడ్యుకేషన్ హబ్ (విద్యా ప్రాంగణం) నిర్మాణ పనుల్లో పురోగతిని పరిశీలించారు. ఈ విద్యా ప్రాంగణం దేశానికి ఆదర్శం కావాలని ఆకాంక్షించారు. పనుల్లో వేగం పెంచాలని.. పనుల పురోగతిపై ఎప్పటికప్పుడు నివేదికలు సమర్పించాలని అధికారులను ఆదేశించారు. నాణ్యతకు పెద్దపీట వేస్తూనే 2027 మార్చిలోగా నిర్మాణాలు పూర్తి చేయాలని గడువు

-మిగతా 2 లో..

# కొండా సురేఖను తొలగించారు.. పొంగులేటి సంగతేంటి?

### బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు

తనను వ్యక్తిగతంగా విమర్శించారనే కారణంతోనే కొండా సురేఖను సీఎం రేవంత్ రెడ్డి మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేశారని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు ఆరోపించారు. సురేఖపై చర్యలు తీసుకున్న రేవంత్... 22ఏ నిషేధిత భూముల పేరిట రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది మంది ప్రజలను, రైతులను పట్టి పీడిస్తున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని నిలదీశారు. రేవంత్ రెడ్డికి, పొంగులేటికి మధ్య ఉన్న రహస్య ఒప్పందం ఏమిటో ప్రజలకు వెల్లడించాలని డిమాండ్ చేశారు. పేదల పట్టా భూములను ఆదరాబాదరాగా నిషేధిత జాబితాలో చేర్చి తీవ్ర ఇబ్బందులకు గురిచేసిన పొంగులేటిని అసెంబ్లీకి రాకుండా నిషేధించాలని డిమాండ్ చేశారు.



హైదరాబాద్, సెప్టెంబర్ 3 : సూర్యుడి చుట్టూ భూమి తిరిగితే... కాంగ్రెస్ పాలనలో భూముల చుట్టూనే రేవంత్ రెడ్డి తిరుగుతున్నారని హరీశ్ రావు ధ్వజమెత్తారు. సీఎం రేవంత్ రెడ్డి ఇల్లు కూడా 22ఏ పరిధిలోనే ఉందని, తన ఇల్లు జాబితాలో పడగానే రాత్రికి రాత్రే ఆంక్షలు తొలగించుకున్న రేవంత్ రెడ్డి... పేద ప్రజల భూములకు వచ్చేసరికి ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారని ప్రశ్నించారు. ఒక్క కాగజ్‌నగర్ నియోజకవర్గంలోనే

-మిగతా 2 లో..



# కొండా సురేఖను తెలంగాణ భవన్ గేటు కూడా తాకనివ్వం

### రాజగోపాల్‌రెడ్డిని కూడా బీఆర్ఎస్‌లోకి తీసుకోం

### మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి కీలక వ్యాఖ్యలు

**హైదరాబాద్, సెప్టెంబర్ 4 :** మంత్రివర్గం నుంచి కొండా సురేఖను బర్తరఫ్ చేయడంతో తెలంగాణ రాజకీయాలు ఆసక్తికరంగా మారాయి. ఆమె బీఆర్ఎస్ లో చేరుతారని ఓవైపు, బీజేపీలో చేరుతారని మరోవైపు పెద్ద ఎత్తున ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. సురేఖ కాంగ్రెస్‌ను వీడి బీఆర్ఎస్‌లో చేరవచ్చనే ప్రచారాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. కొండా సురేఖను బీఆర్ఎస్‌లోకి రానిచ్చే ప్రసక్తే లేదని, ఆమెను ఆఖరికి తెలంగాణ భవన్ గేటును కూడా తాకనివ్వబోమని తేల్చిచెప్పారు. పార్టీని వీడి అధికార కాంగ్రెస్‌లోకి వెళ్లిన

# కేసీఆర్ చాలా మంచోడు

### హుందాగా రిసీవ్ చేసుకునేవారు

### కొండా సురేఖ కీలక వ్యాఖ్యలు



హైదరాబాద్, సెప్టెంబర్ 3 : మంత్రివర్గం నుంచి బర్తరఫ్‌కు గురైన కొండా సురేఖ వరుస ఇంటర్వ్యూలతో కాంగ్రెస్ సర్కార్‌పై, పార్టీ అంతర్గత పరిణామాలపై సంచలన వ్యాఖ్యలు చేస్తున్నారు. ఈ క్రమంలో ఓ ప్రముఖ మీడియా ఛానల్‌కు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌పై ఆమె ప్రశంసల వర్షం కురిపించడం... ఇప్పుడు తెలంగాణ రాజకీయ వర్గాల్లో తీవ్ర ఆసక్తిని రేకెత్తిస్తోంది. గతంలో బీఆర్ఎస్‌లో ఉన్న సమయంలో కేసీఆర్ వ్యవహారశైలి ఎలా ఉండేదన్న ప్రశ్నకు సురేఖ స్పందిస్తూ... "కేసీఆర్ గారు చాలా మంచి వ్యక్తి. తమను ఎప్పుడు కలిసినా ఎంతో గౌరవంగా, హుందాగా రిసీవ్ చేసుకునేవారు" అని కొనియాడారు. బీఆర్ఎస్ పార్టీలో పనిచేసినన్ని రోజులు కేసీఆర్‌తో తమకు ఎలాంటి విభేదాలు

-మిగతా 2 లో..



## నేటి చికెన్ ధరలు

| | |
|---|---|
| ఫారం ధర లైవ్ బర్డ్ | 135 (కిలో) |
| రిటైల్ లైవ్ బర్డ్ | 162 (కిలో) |
| డ్రెస్డ్ స్కిన్‌తో | 235 (కిలో) |
| స్కిన్ లెస్ | 267 (కిలో) |

12 గుడ్ల రిటైల్ ధర ₹74

# కేబినెట్‌లోకి రాములమ్మ..!?

### మంత్రి పదవి కోసం హైకమాండ్‌తో చర్చలు

సుముఖంగా ఉన్న కాంగ్రెస్ అధిష్ఠానం!

తెలంగాణ రాజకీయాల్లో కేబినెట్ పునర్వ్యవస్థీకరణ అంశం మరోసారి హాట్‌టాపిక్‌గా మారింది. కొండా సురేఖను మంత్రివర్గం నుంచి తొలగించిన నేపథ్యంలో ఆమె స్థానంలో మరో మహిళా నేతను కేబినెట్‌లోకి తీసుకునే అవకాశంపై కాంగ్రెస్ హైకమాండ్ కసరత్తు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలోనే కాంగ్రెస్ ఎమ్మెల్సీ, సినీ నటి విజయశాంతి పేరు తెరపైకి వచ్చింది.

03





# హద్దులు దాటితే చర్యలు తప్పవు

### టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్

హైదరాబాద్, సెప్టెంబర్ 3 : తెలంగాణ మంత్రివర్గం నుంచి కొండా సురేఖను తొలగించడంపై టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ స్పందించారు. ఈ నిర్ణయం బాధ కలిగించేదే అయినా, పార్టీ

-మిగతా 2 లో..

# చేయూత పింఛన్లకు దరఖాస్తులు

### ఈ నెల 15 వరకు స్వీకరణ

హైదరాబాద్, సెప్టెంబర్ 4 : తెలంగాణ ప్రభుత్వం చేయూత పింఛన్ల దరఖాస్తులకు సంబంధించి మరో కీలక నిర్ణయం తీసుకుంది. దరఖాస్తు సమయంలో అవసరమైన ధ్రువీకరణ పత్రాలు అందుబాటులో లేకపోయినా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని అధికారులు క్లారిటీ ఇచ్చారు. ధ్రువీకరణ పత్రాలను దరఖాస్తుల పరిశీలన సమయంలో మాత్రం కచ్చితంగా సమర్పించాలని సూచించారు. గీత కార్మికులకు ఆబ్కారీ శాఖ సర్కిల్ ఇన్‌స్పెక్టర్

-మిగతా 2 లో..



# నీటిని పొదుపుగా వాడుకోండి

(మొదటిపేజీ తరువాయి)

మధ్య మరోసారి భిన్నా భిప్రాయాలు వ్యక్తమయ్యాయి. రెండు రాష్ట్రాలు తమ వాదనలు బలంగా వినిపించడంతో సమావేశాలు వాడివేడిగా సాగింది. పోతిరెడ్డిపాడు, వెలిగొండ సహా ఇతర మార్గాల ద్వారా ఎక్కువ నీటిని తరలించుకుంటున్నారని తెలంగాణ అభ్యంతరం వ్యక్తం చేసింది. శ్రీశైలం వద్ద తెలంగాణ జలవిద్యుత్ ఉత్పత్తి చేసి దిగువకు నీటిని వాడుకుంటున్నారని ఏపీ అభ్యంతరం వ్యక్తం చేసింది. నీటి వాటా విషయంలో ఇరు రాష్ట్రాలు తమ తమ వాదనలకే కట్టుబడటంతో ఏకాభిప్రాయం కుదరలేదు. దీంతో ఈ అంశాలను సెప్టెంబర్ నాలుగో వారంలో నిర్వహించే బోర్డు పూర్తి స్థాయి సమావేశంలో విస్తృతంగా చర్చించి నిర్ణయం తీసుకోవాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా తెలంగాణ తరుపున పాల్గొన్న ఈఎన్సీ సభ్యుడు రమేష్ బాబు మాట్లాడుతూ తాగునీటిపై త్రిసభ్య కమిటీ సమావేశంలో చర్చ జరిగిందని వివరించారు. ఎల్ నినో ఉన్నందున తాగునీటి కోసం చెరో 50శాతం వాటా తీసుకోవాలని తెలంగాణ కోరగా ఏపీ పాత పద్ధతిన 66:34 వాటా లెక్కన పంపిణి చేయాలని డిమాండ్ చేసిందని వెల్లడించారు. 66:34 నిష్పత్తి డిమాండ్ ను మూడేళ్లుగా తాము అంగీకరించడం లేదని తెలిపారు. ఇప్పటికే పోతిరెడ్డిపాడు నుంచి ఏపీ నిబంధనలకు విరుద్ధంగా నీళ్లను తీసుకపోతోందని, ఇప్పుడు వెలిగొండ నుంచి కూడా నీరు తీసుకుంటున్నారని వివరించారు. మొత్తం తెలంగాణ 200 టీఎంసీలు, ఏపీ 100 టీఎంసీలను అడిగిందని అన్నారు. సెప్టెంబర్ నాలుగో వారంలో జరిగే బోర్డు సమావేశంలో పూర్తి స్థాయిలో చర్చిస్తామని పేర్కొన్నారు. ఏపీ ఈఎన్సీ సభ్యుడు నరసింహామూర్తి మాట్లాడుతూ త్రిసభ్య కమిటీ సమావేశంలో ఏకాభిప్రాయం కుదరలేదన్నారు. 66:34 నిష్పత్తిలో ఏపీ, తెలంగాణకు నీటి విడుదల ఉత్తర్వులు ఇవ్వాలని కోరామని తెలిపారు. ఎల్ నినో ఉన్నందున తాగునీటి కోసం 50:50 నిష్పత్తిలో ఇవ్వాలని తెలంగాణ కోరిందని, వచ్చే ఆగస్టు వరకు 104 టీఎంసీలు కావాలని కోరామని వివరించారు. తెలంగాణ 200 టీఎంసీలు కావాలని కోరిందని, ఆ ప్రతిపాదన సహేతుకం కాదని చెప్పామని వెల్లడించారు.

తెలంగాణ అవసరం లేకున్నా శ్రీశైలం వద్ద విద్యుత్ ఉత్పత్తి చేస్తోందని సమావేశంలో ఆరోపించామన్నారు. తమ వాటా నుంచే పోతిరెడ్డి పాడు, వెలిగొండ ద్వారా నీరు తీసుకుంటు న్నామని, ఎవరి వాటా అడగడం లేదని తెలిపారు. రాయలసీమతో పాటు మార్కాపురం, పల్నాడు, ఇతర జిల్లాలకు తాగునీటి అవసరాల కోసం నీరు ఇవ్వాల్సి ఉందని ఆయన అన్నారు.




## దేశానికే ఆదర్శం కావాలి

(మొదటిపేజీ తరువాయి)

విధించారు. విద్యా ప్రాంగణం చుట్టూ నీరు నిలవకుండా ఏర్పాట్లు చేయాలని.. ఇందుకోసం టెక్నాలజీ వినియోగించుకోవాలని సూచించారు. అలసత్వం వహించే అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ విద్యా ప్రాంగణంలో ప్రభుత్వ మెడికల్ కళాశాల, నర్సింగ్ కళాశాల, ఫిజియోథెరపీ కళాశాల, పారామెడికల్ కళాశాల, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్సియల్ స్కూల్స్, ఏటీసీ, సైనిక్ స్కూల్, వెటర్నరీ కళాశాల, 430 పడకల ఆసుపత్రి, ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాల, ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల నిర్మాణ పనులు జరుగుతున్నాయి. మక్తల్–నారాయణపేట–కొడంగల్ ఎత్తిపోతల పథకాన్ని యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని అధికారులను సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. హకీంపేటలో రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించిన సీఎం.. తన నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి పనులపై అధికారులతో చర్చించారు. కొడంగల్ ఎత్తిపోతల భూసేకరణ పూర్తి చేయాలని.. ఫేజ్-- 2 పనులకు త్వరలో టెండర్లు పిలవాలని సూచించారు. ఔటర్ రింగ్ రోడ్ల నిర్మాణంలో శాఖల అధికారులు సమన్వయంగా చర్చించి డిజైన్లు రూపొందించాలన్నారు. అలాగే ఇండ్రస్టియల్ పార్క్ భూసేకరణ, శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి కొడంగల్ వరకు నిర్మించనున్న రేడియల్ రోడ్డుపైనా దృష్టి పెట్టాలన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి అంతకుముందు మద్దూరు మండల కేంద్రంలో నిర్మాణంలో ఉన్న నూతన ప్రభుత్వ డిగ్రీ కళాశాల భవన నిర్మాణ పనులతోపాటు సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల, కళాశాల నిర్మాణ పనులను పరిశీలించారు. నిర్మాణ పనులను నాణ్యత ప్రమాణాలతో గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. పదేళ్ల క్రితం ప్రజల అవసరాల కోసం కొనుగోలు చేసిన భూమి.. నేడు పేద పిల్లల భవిష్యత్తుకు పునాదిగా మారిందన్నారు. నాడు ప్రజల కోసం భూములు ఇచ్చిన రైతుల త్యాగాన్ని గుర్తించి నేడు ప్రతి కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని కలెక్టర్ సీహెచ్ ప్రియాంకను ఆదేశించారు. నాడు ప్రజల కోసం వేసిన అడుగు.. నేడు పేద పిల్లల భవిష్యత్తుకు బాటగా మారడం ఎంతో సంతృప్తినిస్తోందని పేర్కొన్నారు. ఆయా కార్యక్రమాల్లో స్థానిక ఎమ్మెల్యేలు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



## హద్దులు దాటితే చర్యలు తప్పవు

(మొదటిపేజీ తరువాయి)

క్రమశిక్షణే అత్యంత ముఖ్యమని ఆయన స్పష్టం చేశారు. క్రమశిక్షణను ఉల్లంఘిస్తే ఎంతటివారైనా ఉపేక్షించేది లేదని, అధిష్ఠానం కఠిన చర్యలు తీసుకుంటుందని తేల్చిచెప్పారు. శుక్రవారం ఢిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. కొండా సురేఖ కుమార్తె సుస్మిత పార్టీపై చేసిన తీవ్ర వ్యాఖ్యలను సురేఖ వెంటనే ఖండించకపోవడాన్ని ఏఐసీసీ చాలా తీవ్రంగా పరిగణించిందని మహేశ్ గౌడ్ తెలిపారు. ఆమె వైఖరి అభ్యంతరకరంగా ఉందని, అందుకే క్రమశిక్షణ కమిటీ ఇచ్చిన నివేదిక ఆధారంగా అధిష్ఠానం ఈ చర్యలు తీసుకుందని వివరించారు. పార్టీలో ఏవైనా సమస్యలు ఉంటే చర్చించడానికి పీసీసీ అధ్యక్షుడు, ఏఐసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్, ప్రధాన కార్యదర్శి వంటి అనేక అంతర్గత వేదికలు ఉన్నాయని గుర్తుచేశారు. వాటిని కాదని బహిరంగంగా మీడియాతో మాట్లాడటాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేది లేదని హెచ్చరించారు. "కాంగ్రెస్ పార్టీలో ఏ నాయకుడైనా మాట్లాడేటప్పుడు హద్దులు దాటితే చర్యలు తప్పవు" అని ఆయన అన్నారు. అయితే, కొండా సురేఖ కాంగ్రెస్ పార్టీలోనే కొనసాగాలని ఆశిస్తున్నట్లు తెలిపారు. ఆమె పార్టీలో ఉంటే భవిష్యత్తులో తప్పకుండా అవకాశాలు లభిస్తాయని సూచనప్రాయంగా చెప్పారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఎవరినీ రాజకీయంగా బ్లాక్‌మెయిల్ చేయాల్సిన అవసరం లేదని మహేశ్ గౌడ్ స్పష్టం చేశారు. భవిష్యత్తులో కూడా పార్టీ బీసీలకు ప్రాధాన్యత ఇస్తుందని ఆయన హామీ ఇచ్చారు. వరంగల్ తూర్పు ఎమ్మెల్యేగా ఉన్న కొండా సురేఖను మంత్రి పదవి నుంచి తొలగించడం తెలంగాణ రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారిన విషయం తెలిసిందే.

## కొండా సురేఖను తొలగించారు.. పొంగులేటి సంగతి ఏమిటి?

(మొదటిపేజీ తరువాయి)

ఏకంగా 42,867 ఎకరాల రైతుల పట్టా భూములను 22ఏ జాబితాలో బందీ చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి నిషేధిత జాబితాలోని పేదల భూములను విడుదల చేయాలని, లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న రైతులతో కలిసి అసెంబ్లీని ముట్టడిస్తామని హెచ్చరించారు. భూ సమస్యలపై ప్రశ్నిస్తున్న రైతులను కబ్జాదారులు అని సంబోధిస్తూ అవమానించిన రేవంత్ రెడ్డి తక్షణమే బేషరతుగా క్షమాపణ చెప్పాలని హరీశ్ రావు డిమాండ్ చేశారు. భూములు 22ఏ జాబితాలోకి వెళ్లడంతో బ్యాంకులు రుణాలు ఇవ్వకుండా రైతులను ఇబ్బందులు పెడుతున్నాయని మండిపడ్డారు. ఇది ఇందిరమ్మ రాజ్యమా లేక కబ్జాల రాజ్యమా అని నిలదీశారు.

## చేయూత పింఛన్లకు దరఖాస్తులు

(మొదటిపేజీ తరువాయి)



ధ్రువీకరణ పత్రం లేకున్నా ఆధార్, రేషన్‌కార్డులతో దరఖాస్తు చేసుకోవచ్చు. ఒంటరి మహిళలకు తహసీల్దారు ధ్రువీకరణ పత్రం కావాలి.. దివ్యాంగులకు సదరం, యూడీఐడీ, చేనేత కార్మికులకు సంబంధిత శాఖ ఏడీ ధ్రువీకరణ పత్రం ఉండాలి. దరఖాస్తు సమయంలో ఈ ధ్రువీకరణ పత్రం లేకపోయినా పర్లేదని.. పరిశీలన సమయంలో మాత్రం సమర్పించాలని సూచించారు. గతంలో పింఛన్లు వచ్చి, ఆ తర్వాత ఆయా కారణాలతో ఆగిపోయిన వారు కూడా కొత్తగా దరఖాస్తు చేసుకోవచ్చని క్లారిటీ ఇచ్చారు. పరిశీలన సమయంలో మాత్రం ధ్రువీకరణ పత్రాలను సమర్పించాలన్నారు. తెలంగాణ ప్రభుత్వం చేయూత పింఛన్ల దరఖాస్తుల గడువును కూడా పొడిగించిన సంగతి తెలిసిందే. వాస్తవానికి జులై 31తోనే గడువు ముగిసింది.. కానీ సెప్టెంబర్ 15 వరకు గడువు పొడిగిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దరఖాస్తు చేయని చాలామంది ఉన్నారు.. వారి అభ్యర్థన మేరకు గడువు పొడిగించారు. తెలంగాణ ప్రభుత్వం రాష్ట్రంలో కొత్తగా 2.50 లక్షల మందికి కొత్త పింఛన్లు ఇవ్వాలని నిర్ణయించింది. చేయూత పథకం కింద కొత్త సామాజిక పింఛన్ల కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. ఆగస్టు 9వ తేదీ నుంచి 5 కేటగిరిల్లో దరఖాస్తులు తీసుకుంటున్నారు. గ్రామాల్లో క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టి ఎంపిక ప్రక్రియను పంచాయతీ కార్యదర్శులు, పట్టణాలు, నగరాల్లో బిల్ కలెక్టర్లు నిర్వహిస్తారు. రాష్ట్రంలో చేయూత పథకం కింద కొత్త పింఛన్ల కోసం దరఖాస్తులు వెల్లువెత్తాయి. ఆగస్టు 30 వరకు మొత్తం 4.34 లక్షల మంది తమ పేర్లను నమోదు చేసుకున్నారు. వీరిలో అత్యధికంగా 2.64 లక్షల మంది వితంతువుల నుంచి దరఖాస్తులు వచ్చాయి. అయితే ప్రభుత్వం గడువు పెంచడంతో మరో 50వేలకుపైగా దరఖాస్తులు వస్తాయని అచనా వేస్తున్నారు,

## సురేఖను తెలంగాణ భవన్ గేటు కూడా తాకనివ్వం

(మొదటిపేజీ తరువాయి)



నేతలను తిరిగి చేర్చుకోబోమని.. వారిలో ఒకరిద్దరికి తప్ప మిగతా ఎవరికీ గులాబీ తలుపులు తెరిచేది లేదని స్పష్టం చేశారు. అదే సమయంలో, కాంగ్రెస్ నుంచి ఇప్పటికే ఇద్దరు ఎమ్మెల్యేలు బీఆర్ఎస్‌లోకి రావడానికి సిద్ధంగా ఉన్నారంటూ ఆయన సరికొత్త బాంబు పేల్చారు. ఇదే క్రమంలో కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డిపై కూడా జగదీశ్ రెడ్డి తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. రాజగోపాల్ రెడ్డి దరఖాస్తు చేసుకున్నా ఆయనను బీఆర్ఎస్‌లోకి తీసుకోమని చెప్పారు. ఒకవేళ రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఆయనకు మంత్రి పదవి కట్టబెడితే అది పూర్తిగా డబ్బులకు అమ్ముడుపోయి నట్లేనని సంచలన ఆరోపణలు చేశారు. కొండా సురేఖ, ఆమె కుమార్తె సుస్మిత చేసిన తీవ్ర ఆరోపణలపై విచారణ జరపాలని డిమాండ్ చేసిన ఆయన... రాబోయే శాసనసభ సమావేశాల్లో కాంగ్రెస్ వైఫల్యాలను, ముఖ్యంగా 22ఏ భూముల స్కామ్‌ను ఎండగట్టేందుకు బీఆర్ఎస్ పక్కా వ్యూహాలతో సిద్ధంగా ఉందని వెల్లడించారు. కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి బీఆర్ఎస్‌లో చేరేందుకు దరఖాస్తు చేసుకున్నా.. ఆయనను తమ పార్టీలోకి తీసుకోబోమని జగదీశ్‌రెడ్డి వెల్లడించారు. ఎన్నికలకు ముందు కోమటిరెడ్డి సోదరులు బీఆర్ఎస్‌లోకి రావాలని ప్రయత్నాలు చేశారని పేర్కొన్న మాజీ మంత్రి.. అయినప్పటికీ ఆ ప్రయత్నాలను తమ పార్టీ తిరస్కరించిందని గుర్తుచేశారు. రాజగోపాల్‌రెడ్డికి మంత్రి పదవి ఇస్తే డబ్బులకు అమ్ముడుపోయినట్లేనని జగదీశ్‌రెడ్డి తీవ్ర వ్యాఖ్యలు చేశారు. గతంలో పలువురు నేతలు బీఆర్ఎస్‌పై, పార్టీ నాయకత్వంపై నేరుగా విమర్శలు చేశారని.. అలాంటి వారిని తిరిగి పార్టీలోకి తీసుకునే విషయంలో జాగ్రత్తగా వ్యవహరిస్తామని తెలిపారు. కొండా సురేఖ, ఆమె కుమార్తె సుస్మిత చేసిన వ్యాఖ్యలను ప్రస్తావించిన జగదీశ్‌రెడ్డి.. సంచలన వ్యాఖ్యలు చేశారు. బర్తరఫ్ చేయాల్సింది కొండా సురేఖను కాదని.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని సీఎం పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రభుత్వంపై కొండా కుటుంబం అవినీతి ఆరోపణలు చేసిందని.. వాటిపై చర్యలు తీసుకోకుండా కొండా సురేఖపై చర్యలు తీసుకున్నారని జగదీశ్ రెడ్డి ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అవినీతి, కుంభకోణాలకు పాల్పడుతోందని తాము ఇప్పటికే కేంద్ర దర్యాప్తు సంస్థలకు ఆధారాలు పంపించామని పేర్కొన్నారు. అయితే ఇవన్నీ బీఆర్ఎస్ నేత చేసిన ఆరోపణలేనని, వాటిపై సంబంధిత సంస్థల అధికారిక నిర్ధారణ వెలువడలేదని గమనించాలి. కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజులుగా ప్రజలను మోసం చేస్తోందని జగదీశ్‌రెడ్డి ఆరోపించారు. ఆ పార్టీ తీవ్ర అంతర్గత సంక్షోభంలో ఉందని విమర్శించారు. తెలంగాణలో ప్రస్తుతం గోదావరి, కృష్ణా నదుల్లో నీటి లభ్యత ఉన్నందున కృష్ణా జలాల్లో తెలంగాణ హక్కులను కాపాడుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఇంట్లో జరిగిన ఈడీ సోదాలపై కూడా ఆయన ప్రశ్నలు సంధించారు. ఆ దాడులపై ఈడీ ఎందుకు స్పష్టమైన ప్రకటన చేయలేదని నిలదీశారు. సీఎం రేవంత్‌రెడ్డి, తెలంగాణ మంత్రులకు ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు మద్దతు ఉందని ఆరోపించారు. శాసనసభ ఎథిక్స్ కమిటీ నిజాయితీగా వ్యవహరించాలని జగదీశ్‌రెడ్డి కోరారు. పార్టీలు మారిన ఎమ్మెల్యేలు, కాంగ్రెస్ ఎమ్మెల్యేలు చేసిన వ్యాఖ్యలపై సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు. వచ్చే ఎన్నికల నాటికి పార్లమెంట్ నియోజకవర్గాల పునర్విభజ న జరగకపోయినా.. రెండు తెలుగు రాష్ట్రాల్లో డీలిమిటేషన్ జరిగే అవకాశం ఉందని జగదీశ్‌రెడ్డి అభిప్రాయపడ్డారు. ఏపీలో చంద్రబాబు ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత మొదలైందని, డీలిమిటేషన్ ద్వారా ఆ రాజకీయ పరిస్థితి నుంచి బయటపడవచ్చని చంద్రబాబు భావిస్తున్నారని ఆయన వ్యాఖ్యానించారు.

## కేసీఆర్ చాలా మంచోడు

(మొదటిపేజీ తరువాయి)

రాలేదని స్పష్టం చేశారు. తమ కుటుంబం అడిగిన వెంటనే కేసీఆర్ ఎమ్మెల్సీ పదవి ఇచ్చారని గుర్తుచేసుకున్నారు. నాడు కొండా మురళికి ఎమ్మెల్సీ పీఠం దక్కకుండా పార్టీలోని కడియం శ్రీహరి వంటి కొందరు సీనియర్ నేతలు అడ్డుకునేందుకు తీవ్రంగా ప్రయత్నించారని, కానీ కేసీఆర్ స్వయంగా జోక్యం చేసుకుని మిగిలిన వారి నామినేషన్లను ఉపసంహరింపజేసి మురళి ఏకగ్రీవంగా ఎన్నికయ్యేలా చూశారని వెల్లడించారు. కాంగ్రెస్ ప్రభుత్వం నుంచి తీవ్ర అసంతృప్తితో, బర్తరఫ్ వేటుతో బయటకు వచ్చిన కొండా సురేఖ.. కేసీఆర్ పాలనను, ఆయన వ్యక్తిత్వాన్ని పొగడ్తలతో ముంచెత్తడం వెనుక రాజకీయ ప్రాధాన్యత ఉందనే విశ్లేషణలు మొదలయ్యాయి. కేసీఆర్‌పై సురేఖ చేసిన సానుకూల వ్యాఖ్యల నేపథ్యంలో కొండా దంపతులు కాంగ్రెస్‌కు గుడ్‌బై చెప్పి... బీఆర్ఎస్‌లో చేరే అవకాశం ఉందా? అనే ప్రచారం జోరందుకుంది.

## కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలనపై నిరసనలు

- కేటీఆర్ పిలుపుతో కదంతొక్కిన బీఆర్ఎస్ నేతలు
- ప్రజా పాలన కాదు.. కాంగ్రెస్ దోపిడీ పాలన
- మాజీ మంత్రి తలసాని సంచలన ఆరోపణలు

**హైదరాబాద్, సెప్టెంబర్4 :** మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ.. వెయ్యి రోజుల పాలనలో సబ్బండ వర్గాలకు కన్నీళ్లే మిగిలాయని బీఆర్ఎస్ శ్రేణులు ధ్వజమెత్తాయి. పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ పిలుపు మేరకు రాష్ట్రవ్యాప్తంగా నిరసనలతో రేవంత్ రెడ్డి సర్కార్ వైఫల్యాలను ఎండగడుతున్నారు నేతలు. వికారాబాద్ జిల్లా నవాబ్‌పేట్‌లో మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, సికింద్రాబాద్‌లో ఎమ్మెల్యే పద్మారావు, సిరిసిల్లలో, దేవరకద్రలో గులాబీ సైన్యం ఆందోళనలు చేపట్టింది. వికారాబాద్ జిల్లా నవాబ్‌పేటలో కాంగ్రెస్ ప్రభుత్వ వెయ్యి రోజుల పాలనపై నిరసన కార్యక్రమం నిర్వహించారు. కేటీఆర్ పిలుపు మేరకు జరిగిన ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ పాల్గొన్నారు. కాంగ్రెస్ ఎన్నికల్లో ఇచ్చిన 420 హామీలను అమలు చేయడంలో విఫలమైందని సబితా ఇంద్రారెడ్డి విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ వెయ్యి రోజుల పరిపాలనలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిన తీరును సికింద్రాబాద్‌లో బీఆర్ఎస్ నేతలు వివరించారు. బీఆర్ఎస్ పార్టీ నిర్వహించిన ఈ కార్యక్రమంలో తల్లా మాధవి అనే దివ్యాంగురాలు తన గోడును వెళ్లబోసుకుంది. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత దివ్యాంగుల సమస్యలు ఒక్కటి కూడా పట్టించుకోవడం లేదని ఆమె కన్నీటిపర్యంతమైంది. దివ్యాంగుల కోసం ఏం చేసిందో ఈ ప్రభుత్వం చెప్పాలని ఆమె ఎమ్మెల్యే పద్మారావు ముందు తన బాధను పంచుకుంది. స్థానిక ఎమ్మెల్యేగా మా దివ్యాంగుల సమస్యలను మీరైనా తీర్చాలని పద్మారావు గౌడ్‌ను కోరింది మాధవి. వెయ్యి రోజుల కాంగ్రెస్ పాలన లోని వైఫల్యాలను ఎండగడుతూ.. సికింద్రాబాద్ అడ్డగుట్ట డివిజన్‌లో మాజీ కార్పొరేటర్లు రోడ్డుపైనే వంట చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఎన్నికల్లో ప్రజలకిచ్చిన హామీలను అమలు చేయడంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు ఆరోపించారు. గద్వాల నియోజకవర్గం మల్దకల్ మండల కేంద్రంలో శుక్రవారం కాంగ్రెస్ 1000 రోజుల విఫల పాలనను నిరసిస్తూ మహిళలు, దివ్యాంగుల ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం వృద్ధులు,వికలాంగులు, మహిళలకు రూ. 2500, కేసిఆర్ కిట్టు, కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ (తులం బంగారం), విద్యార్థులకు స్కూటీ హామీలు మరిచిపోయిందని విమర్శించారు. బీఆర్ఎస్ నాయకుడు బాసు హనుమంతు నాయుడు వంటవార్పు నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ ప్రజలకు మాట ఇచ్చిన 6 గ్యారెంటీలు, 420 హామీలు నెరవేర్చడం లేదని ఆరోపించారు. మరోవైపు మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూర్ మండల కేంద్రంలో కాంగ్రెస్ 1000 రోజుల విఫల పాలనకు వ్యతిరేకంగా మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులునిరసన కార్యక్రమాలు చేపట్టారు. ఈ నిరసన కార్యక్రమంలో ఆల వెంకటేశ్వర్ రెడ్డికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఫోన్ చేసి, ప్రజలకు మద్దతుగా పోరాడుతున్న బీఆర్ఎస్ శ్రేణులకు అభినందనలు తెలిపారు. మీ పోరాటాన్ని ఇలాగే కొనసాగించాలని సూచించారు. కాగా, జిల్లాలోని చిన్నచింతకుంట మండల కేంద్రంలో 1000 రోజుల కాంగ్రెస్ విఫల పాలనకు వ్యతిరేకంగా మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి చేపట్టిన నిరసన కార్యక్రమాన్ని అడ్డుకునేందుకు కాంగ్రెస్ కార్యకర్తలు ప్రయత్నించారు. దీంతో కాంగ్రెస్ కార్యకర్తలకు ఆల వెంకటేశ్వర్ రెడ్డి దీటుగా సమాధానమి చ్చారు. అలాగే అడ్డుకునేందుకు వచ్చిన కాంగ్రెస్ కార్యకర్తలను బీఆర్ఎస్ కార్యకర్తలు అక్కడి నుంచి తరిమికొట్టారు. ఇప్పుడు ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఈ క్రమంలో కేటీఆర్ ఫోన్ చేసి ప్రజల తరఫున ఉద్యమిస్తున్న బీఆర్ఎస్ శ్రేణులకు అభినందనలు తెలిపారు.

ప్రజా పాలన పేరిట రాష్ట్రాన్ని దొంగల మాదిరిగా దోపిడీ చేస్తుందని కాంగ్రెస్ ప్రభుత్వంపై మాజీమంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ తలసాని శ్రీనివాస్ యాదవ్ విమర్శించారు. శుక్రవారం ఆయన జనగాం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో స్థానిక ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి , బీఆర్ఎస్ పార్టీ నాయకులతో కలిసి మీడియా సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ ఆచరణ సాధ్యం కాని అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులు అయినా అమలు చేయకుండా ప్రజలను మోసం చేశారని మండిపడ్డారు. ఇచ్చిన హామీలు అమలు చేయకుండా ప్రజా పాలన అని ఎలా చెప్పుకుంటారని ప్రశ్నించారు.

## జీఎస్ఎల్‌వీ-ఎఫ్17 రాకెట్ ప్రయోగం విజయవంతం

### జియోసింక్రోనస్ కక్ష్యలోకి దేశ మొట్టమొదటి ఇమేజింగ్ శాటిలైట్

**న్యూఢిల్లీ, సెప్టెంబర్4 :** భారత అంతరిక్ష పరిశోధన సంస్థ-ఇస్రో అద్భుత విజయాన్ని నమోదు చేసింది. శ్రీహరికోట అంతరిక్ష కేంద్రం నుంచి ఇస్రో ప్రయోగించిన జీఎస్ఎల్‌వీ-ఎఫ్17 రాకెట్ ప్రయోగం విజయవంతమైంది. దేశంలోనే తొలిసారి జియో-ఆర్బిట్ కోసం ఉద్దేశించిన అత్యాధునిక ఎర్త్ అబ్జర్వేషన్ ఉపగ్రహం జూరా-05ను కక్ష్యలోకి ప్రవేశపెట్టింది. వ్యవసాయం, విపత్తు నిర్వహణ వంటి రంగాల్లో రియల్ టైమ్ ఇమేజరీ అందించడంలో ఈ ఉపగ్రహం ఎంతో కీలకం కానుంది. రెండో లాంచ్ ప్యాడ్ నుంచి వేకువజామున 2గంటల 55నిమిషాలకు జీఎస్ఎల్‌వీ-ఎఫ్17 రాకెట్ అత్యాధునిక భూ పరిశీలన ఉపగ్రహం జూరా-05ను నింగిలోకి మోసుకెళ్లింది. సబ్-జియోసింక్రనస్ ట్రాన్స్‌ఫర్ ఆర్బిట్‌లోకి ప్రవేశపెట్టింది. సుమారు 8నెలల విరామం తర్వాత ఇస్రో ఈ మిషన్‌ను చేపట్టింది. జీఎస్ఎల్‌వీ సిరీస్‌లో ఇది 19వ రాకెట్ ప్రయోగం. 2,268 కిలోల బరువు ఉన్న -05 ఉపగ్రహం సరిహద్దు ప్రాంతాలను వేగంగా, స్పష్టంగా కెమెరాలతో పరిశీలించనుంది. తుపానులు వరదలు, భూకంపాలను నిమిషాల వ్యవధిలోనే గుర్తించనుంది. ప్రకృతి విపత్తులపై ముందస్తు హెచ్చరికలను జారీ చేయనుంది. పంటల ఆరోగ్యం, భూ వినియోగంలో మార్పులను పరిశీలించనుంది. దేశ రక్షణరంగంలో ఈ ఉపగ్రహం కీలకం కానుంది. సరిహద్దుల సమాచారాన్ని రియల్ టైమ్‌లో సేకరించనుంది. వరుసగా ఎదురైన వైఫల్యాల తర్వాత ఇస్రో సాధించిన ఈ విజయం అత్యంత ప్రాధాన్యం సంతరించుకుంది. ఇప్పటివరకు చేపట్టిన 18 ప్రయోగాల్లో ఈ రాకెట్ 6సార్లు పూర్తిస్థాయి విజయాన్ని నమోదుచేయలేకపోయింది. 2021లో మిషన్ ప్రయోగం 307సెకన్ల తర్వాత క్రయోజెనిక్ అప్పర్ స్టేజ్‌లో తలెత్తిన సాంకేతిక లోపంతో విఫలమైంది. దానికి ప్రత్యామ్నాయంగా ఈ మిషన్‌ను విజయవంతంగా చేపట్టారు. అంతకుముందు ఈ ఏడాది జనవరి 12న 16ఉపగ్రహాలతో ప్రయోగించిన రాకెట్ కీలకమైన మూడోదశలో తలెత్తిన లోపం కారణంగా నిర్దేశిత కక్ష్యలోకి చేరలేకపోయింది. 2025 మే నెలలో చేసినస్రూాఎ-జ 61 ప్రయోగం కూడా మోటార్ కేస్‌లో ప్రెజర్ సమస్యల వల్ల సక్సెస్ కాలేదు. ఈ నేపథ్యంలో ఇస్రో సుదీర్ఘ విరామం తర్వాత జీఎస్ఎల్‌వీ-ఎఫ్17 రాకెట్ ప్రయోగం విజయవంతం చేసింది. మరోవైపు ప్రతిష్ఠాత్మక గగన్‌యాన్ ప్రాజెక్టులో భాగంగా తొలి మానవరహిత మిషన్‌ను ఈ ఆర్థిక సంవత్సరంలోనే ప్రయోగించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు ఇస్రో ఛైర్మన్ ఎ.నారాయణన్ వెల్లడించారు. దీనికోసం వివిధ పరిశ్రమలు, ఇతర సంస్థలతో కలిసి ఇస్రో బృందం అత్యంత ప్రణాళికాబద్ధంగా, ముమ్మరంగా పనిచేస్తోందని తెలిపారు. ఈఓఎస్-05 ఉపగ్రహాన్ని విజయవంతంగా కక్ష్యలోకి ప్రవేశపెట్టాక ఇస్రో ఛైర్మన్ శాస్త్రవేత్తలను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ ఆర్థిక సంవత్సరంలో ఈఓఎస్-05 ప్రయోగం ద్వారా ఇస్రో తొలి విజయాన్ని నమోదు చేసిందని పేర్కొన్న ఆయన, కష్టానికి దక్కే ప్రతిఫలం మరింత కష్టపడటమేనని ఉద్ఘాటించారు. దేశ బహుళ అవసరాల నిమిత్తం భూమిని నిశితంగా పరిశీలించేందుకు 36,000 కి.మీ.లు జియో సింక్రనస్ ప్లాట్‌ఫారమ్‌లో ఉంచుతున్న మొట్టమొదటి ఉపగ్రహం ఇదే కావడం విశేషమని అన్నారు. జీఎస్ఎల్‌వీ-ఎఫ్17 రాకెట్ ద్వారా ఈఓఎస్-05 ఉపగ్రహాన్ని విజయవంతంగా ప్రయోగించడంపై కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ 'ఎక్స్' వేదికగా ఇస్రో బృందానికి అభినందనలు తెలిపారు. 'అంతరిక్ష రంగంలో భారత్ సాధించిన మరో అతిపెద్ద పేలోడ్ ఇది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దార్శనిక నాయకత్వంలో భారతదేశ అంతరిక్ష సామర్థ్యాలు సరికొత్త శిఖరాలకు చేరుకుంటున్నాయి. ప్రపంచ అంతరిక్ష శక్తిగా మన దేశం బలపడుతోంది' అని ఎక్స్‌లో రాసుకొచ్చారు.

# రాహుల్ గాంధీపై పెట్టిన అక్రమ కేసులు వెంటనే ఎత్తివేయాలి

- మల్లికార్జున్ ఖర్గే ని అవమానించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి
- కుల వివక్షకు వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీ మొదటి నుంచీ పోరాడుతోంది
- ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్



**కామారెడ్డి, సెప్టెంబర్ 4 :** కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షులు మల్లికార్జున్ ఖర్గేరిపై కుల వివక్షకు పాల్పడిన ఘటనను ప్రశ్నించిన లోక్‌సభ ప్రతిపక్ష నాయకులు, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ పై కేంద్ర ప్రభుత్వం అక్రమ కేసులు నమోదు చేయడాన్ని నిరసిస్తూ కామారెడ్డి జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు. నిజాంసాగర్ చౌరస్తా నుంచి మున్సిపల్ కార్యాలయం వరకు కాంగ్రెస్ శ్రేణులు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ ముఖ్య అతిథిగా హాజరుకాగా, జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు మాజీ డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డి , డీసీసీ అధ్యక్షులు ఏలే మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ మాట్లాడుతూ. దేశంలో కుల వివక్షకు, అంటరానితనానికి, మనిషిని మనిషిగా తక్కువ చేసి చూసే విధానాలకు స్థానం లేదన్నారు.కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షులు మల్లికార్జున్ ఖర్గే పాల్గొన్న సభా ప్రాంగణాన్ని గంగా జలాలతో శుద్ధి చేశారంటూ వచ్చిన ఘటన తీవ్రంగా ఖండించదగినదని అన్నారు. ఖర్గే ఒక దళిత నాయకుడు కావడం వల్ల ఆయన పాల్గొన్న ప్రదేశాన్ని శుద్ధి చేయాల్సిన పరిస్థితి వచ్చిందని భావించడం అత్యంత దురదృష్టకరం. ఇది కేవలం ఖర్గే ని అవమానించడం కాదు.. రాజ్యాంగాన్ని, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఆశయాలను అవమానించడమే అని షబ్బీర్ అలీ అన్నారు. కులం మనిషి పుట్టుకను నిర్ణయించవచ్చు కానీ అతని గౌరవాన్ని నిర్ణయించదు. ప్రతి భారతీ–యుడికి ఆత్మగౌరవంతో జీవించే హక్కు ఉంది. రాజ్యాంగం ఇచ్చిన సమానత్వాన్ని ఎవరూ కాలరాయలేరుఅని అన్నారు. ప్రజా సమస్యలను ప్రశ్నిస్తున్న రాహుల్ గాంధీ గొంతును అక్రమ కేసులతో అణచివేయాలని కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోందని షబ్బీర్ అలీ ఆరోపించారు. ప్రజల తరఫున ప్రశ్నించడం రాహుల్ గాంధీ హక్కు. ప్రశ్నించే గొంతును కేసులతో భయపెట్టాలని చూస్తే కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు మరింత బలంగా ప్రజల మధ్య నిలబడతారు. రాహుల్ గాంధీపై పెట్టిన అక్రమ కేసులను వెంటనే ఎత్తివేయాలి" అని డిమాండ్ చేశారు. ఖర్గే ని అవమానించిన ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు.

### కేసీఆర్ ప్రతిపక్ష నేత పదవికి రాజీనామా చేయాలి

బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌పై షబ్బీర్ అలీ తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు.పదేళ్లు అధికారంలో ఉన్న కేసీఆర్ ఇప్పుడు ప్రతిపక్ష నాయకుడిగా కూడా ప్రజలకు అందుబాటులో లేకుండా పోయారు. ప్రజల కోసం పనిచేయని నాయకుడికి ప్రతిపక్ష నాయకుడి పదవి ఎందుకు ప్రజల సమస్యలను పట్టించుకోని కేసీఆర్ వెంటనే ప్రతిపక్ష నాయకుడి పదవికి రాజీనామా చేయాలి" అని షబ్బీర్ అలీ డిమాండ్ చేశారు. కామారెడ్డి ప్రజలను కేసీఆర్ క్షమాపణ కోరాలని అన్నారు. కామారెడ్డి నుంచి పోటీ చేసిన కేసీఆర్.. ఈ ప్రాంత ప్రజలకు ఏం చేశారు వారి సమస్యల గురించి అసెంబ్లీలో ఏం మాట్లాడారు ప్రజలకు చెప్పాలి. వరదలు, భారీ వర్షాలతో ప్రజలు తీవ్రంగా నష్టపోయిన సమయంలో బాధితులను పరామర్శించడానికి కూడా కేసీఆర్ రాలేదు. కేటీఆర్ రాలేదు. బీఆర్ఎస్ నాయకత్వం ప్రజల పక్కన నిలబడలేదు" అని విమర్శించారు. "బీఆర్ఎస్ ఖాతాలో వందల కోట్ల రూపాయల నిధులు ఉన్నాయని చెబుతున్నారు. కామారెడ్డిలో పోటీ చేసిన కేసీఆర్ ఆ నిధుల నుంచి ఈ ప్రాంత ప్రజలకు ఎంత సహాయం చేశారు ఒక్క రూపాయి అయినా ఇచ్చారా. ప్రజలు దీనిపై సమాధానం కోరుతున్నారు" అని షబ్బీర్ అలీ ప్రశ్నించారు.

### వెయ్యి రోజుల కాంగ్రెస్ పాలనపై చర్చకు సిద్ధం

తెలంగాణలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు ప్రజల మన్ననలు పొందుతున్నాయని షబ్బీర్ అలీ అన్నారు.బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో ఏమి చేసింది కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల్లో ఏమి చేసింది ప్రజల ముందే చర్చకు మేము సిద్ధంగా ఉన్నాం. పదేళ్ల బీఆర్ఎస్ పాలనను, కాంగ్రెస్ ప్రభుత్వ వెయ్యి రోజుల పాలనను అభివృద్ధి, సంక్షేమం, విద్య, వైద్యం, రైతులు, మహిళలు, యువత, పేదల సంక్షేమం వంటి అన్ని అంశాల్లో పోల్చుకుందాం" అని సవాల్ విసిరారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేస్తూ ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తోందన్నారు. రైతులకు మద్దతు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఉచిత విద్యుత్, సంక్షేమ పథకాలు, ఇందిరమ్మ ఇళ్లు, స్మార్ట్ రేషన్ కార్డులు, విద్యా సంస్థల అభివృద్ధి, ఆరోగ్య రంగంలో మౌలిక వసతుల బలోపేతం వంటి కార్యక్రమాలను ప్రభుత్వం ముందుకు తీసుకెళ్తోందని వివరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం మాటల ప్రభుత్వం కాదు.. చేతల ప్రభుత్వం. ప్రజల జీవితాల్లో మార్పు తీసుకురావడమే మా లక్ష్యం" అని షబ్బీర్ అలీ అన్నారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షులు ఏలే మల్లికార్జున్, గ్రంథాలయ చైర్మన్ చంద్రకాంత్ రెడ్డి, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు ఐరేని సందీప్, పీసీసీ జనరల్ సెక్రటరీ ఇంద్రకరణ్ రెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ ఇప్ప ఉమారాణి శ్రీనివాస్, ఖంఊా చైర్మన్లు గూడెం శ్రీనివాస్ రెడ్డి, అంతంపల్లి సుధాకర్ రెడ్డి, భీమ్ రెడ్డి, నవసిలాల్ నాయక్ , అనంత రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షు నరేందర్ రెడ్డి, పాత రాజు, అంకం కృష్ణారావు, ఆశబోయిన శ్రీనివాస్ , రాజా గౌడ్ , జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు, యువజన కాంగ్రెస్ నాయకులు, నాయకులు, మహిళా కాంగ్రెస్, ప్రజాప్రతినిధులు, వివిధ అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ముగ్గురు పిల్లలతో లోయలోకి దూకి రెజ్లర్ ఆత్మహత్య

**ధారాశివ్, సెప్టెంబర్ 3 :** మహారాష్ట్రలోని ధారాశివ్ జిల్లాలో క్రీడా లోకాన్ని దిగ్భ్రాంతికి గురిచేసేలా విషాద ఘటన చోటుచేసుకుంది. 'మహారాష్ట్ర టైగ్రెస్'గా పేరొందిన జాతీయ మహిళా రెజ్లర్ అశ్విని మనోహర్ పాల్ తన ముగ్గురు పిల్లలతో కలిసి నల్‌దుర్గ్ కోటపై నుంచి 100 అడుగుల లోతైన లోయలోకి దూకింది. ఈ దారుణ ఘటనలో అశ్విని, ఆమె ఐదేళ్ల కుమారుడు అజింక్యా అక్కడికక్కడే మృతి చెందగా, కవల కుమార్తెలలో క్రాంతి ఆసుపత్రిలో కన్నుమూసింది. మరో చిన్నారి వీరా తీవ్ర గాయాలతో ఆసుపత్రిలో వెంటిలేటర్‌పై మృత్యువుతో పోరాడుతోంది. జాతీయ స్థాయిలో 5 స్వర్ణాలు, 6 రజత పతకాలు సాధించిన అశ్విని మృతిపై తీవ్ర శోకఛాయలు అలముకున్నాయి. భర్త, అత్తమామల శారీరక, మానసిక వేధింపుల వల్లే ఈ తీవ్ర నిర్ణయం తీసుకుందని అశ్విని తండ్రి ఫిర్యాదు చేయడంతో నల్‌దుర్గ్ పోలీసులు కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు.

## సీఎం సెక్యూరిటీ సమాచారం లీక్

### కేసు నమోదు చేసిన సైబర్‌క్రైమ్ పోలీసులు

**హైదరాబాద్, సెప్టెంబర్4 :** సాధారణంగా ముఖ్యమంత్రులకు భద్రత చాలా కట్టుదిట్టంగా ఉంటుంది. అయితే తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీలో పర్యటించిన సమయంలో బందోబస్తుకు సంబంధించిన అత్యంత రహస్య వివరాలను సోషల్ మీడియాలో బహిర్గతం చేసిన ఘటనలో కేసు నమోదైంది. సీఎం రేవంత్ రెడ్డి ఢిల్లీ టూర్ భద్రతా వివరాలను పోస్ట్ చేసినందుకుగానూ తెలుగు స్క్రైబ్ ఎక్స్ ఖాతా నిర్వాహకులపై హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. సీఎం రేవంత్ ప్రధాన భద్రతాధికారి (సీఎస్‌వో) కేబీ ఫ్రాంక్లిన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఈ చర్యలు చేపట్టారు. మొదట ఈ ఫిర్యాదుతో జులై 14న ఖైరతాబాద్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. హైదరాబాద్ అడిషనల్ కమిషనర్ (క్రైమ్స్) ఆదేశాల మేరకు సమగ్ర విచారణ కోసం ఈ కేసును సిటీ సైబర్ క్రైమ్ విభాగానికి బదిలీ చేసి రీ–రిజిస్టర్ చేశారని సమాచారం. సీఎం రేవంత్ ప్రధాన భద్రతాధికారి (సీఎస్‌వో) కేబీ ఫ్రాంక్లిన్ ఫిర్యాదులో పేర్కొన్న వివరాలిలా ఉన్నాయి. ఈ ఏడాది జూన్ 13న సీఎం రేవంత్ రెడ్డి దిల్లీ పర్యటనకు సంబంధించిన నిమిషాల వారీ పూర్తి షెడ్యూల్, భద్రతా ఏర్పాట్లపై ఢిల్లీ పోలీస్ జాయింట్ కమిషనర్, తెలంగాణ భవన్ రెసిడెంట్ కమిషనర్, ఆర్‌జీఐఏ, డీజీపీ వంటి ఉన్నతాధికారులకు ఒక వైర్‌లెస్ సందేశం ద్వారా సమాచారం పంపాం. జెడ్ ప్లస్ (ం) కేటగిరీ భద్రతకు అనుగుణంగా చేసిన ఈ ఏర్పాట్ల సందేశంలో సీఎం బ్లడ్ గ్రూప్, సీఎస్‌వో ఫోన్ నంబర్ వంటి అత్యంత సున్నితమైన అంశాలు కూడా ఉన్నాయని పేర్కొన్నారు. ఢిల్లీలో పర్యటన కొనసాగుతుండగానే ఈ అత్యంత రహస్య వైర్‌లెస్ సమాచారాన్ని తెలుగు స్క్రైబ్ అనే ఎక్స్ ఖాతాలో పోస్ట్ చేయడంతో సీఎం రేవంత్ రెడ్డి భద్రతాపరమైన వివరాలన్నీ బహిర్గతమయ్యాయి. నిబంధనల ప్రకారం వైర్‌లెస్ సందేశాలను బయటకు పొక్కనివ్వకూడదు. అయితే అధికారుల్లో ఎవరైనా అక్రమంగా ఈ సమాచారాన్ని ఆ సోషల్ మీడియా ఖాతాకు చేరవేసి ఉంటారని సీఎస్‌వో తన ఫిర్యాదులో అనుమానం వ్యక్తం చేశారు. ఈ విధి నిర్వహణలో తలెత్తిన లోపం, సీఎం రేవంత్ భద్రతా ఉల్లంఘనపై క్షుణ్ణంగా దర్యాప్తు జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు. జూన్ 14న ఖైరతాబాద్ పీఎస్‌లో కేసు నమోదుకాగా, సమగ్ర దర్యాప్తు కోసం సైబర్ క్రైమ్ విభాగానికి కేసు బదిలీ చేసి రీ రిజిస్టర్ చేసి దర్యాప్తు వేగవంతం చేశారు.

## సోషల్ మీడియా పోస్టులతో మాకు సంబంధం లేదు

### కొండా సురేఖ ఆగ్రహం



**హైదరాబాద్, సెప్టెంబర్4 :** తెలంగాణ కేబినెట్ నుంచి ఉద్వాసనకు గురైన కొండా సురేఖ, తన పేరుతో సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారాన్ని ఖండించారు. తన కుటుంబానికి సంబంధం లేని కొన్ని పోస్టులు వివిధ సోషల్ మీడియా వేదికలపై సర్క్యులేట్ అవుతున్నాయని, వాటితో తమకు ఎలాంటి సంబంధం లేదని శుక్రవారం ఆమె 'ఎక్స్' వేదికగా స్పష్టం చేశారు. "త్వరలో బిగ్ అప్‌డేట్", "నిరీక్షణకు తెరపడనుంది" వంటి వ్యాఖ్యలతో ఉన్న పోస్టులు తన దృష్టికి వచ్చాయని, వాటిని ఎవరూ నమ్మవద్దని కోరారు. తన అధికారిక సోషల్ మీడియా ఖాతాల వివరాలను సైతం ఆమె పంచుకున్నారు. మంత్రి పదవి నుంచి తనను తొలగించిన మరుసటి రోజే ఈ ప్రచారం జరగడం గమనార్హం. క్రమశిక్షణా రాహిత్యం ఆరోపణలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన సిఫార్సు మేరకు గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా గురువారం కొండా సురేఖను కేబినెట్ నుంచి తొలగిస్తూ నోటిఫికేషన్ జారీ చేశారు. కాంగ్రెస్ అధిష్ఠానం ఆమోదం పొందిన తర్వాతే సీఎం ఈ నిర్ణయం తీసుకున్నారు. గత రెండు, మూడు రోజులుగా ఢిల్లీలో పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్‌లతో సహా రాష్ట్ర నాయకత్వంతో అధిష్ఠానం జరిపిన సంప్రదింపుల తర్వాత ఈ చర్యలు తీసుకున్నారు. గత నెలలో వరంగల్ జిల్లాలో జరిగిన ఓ కార్యక్రమంలో కొండా సురేఖ కుమార్తె సుస్మిత, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని లక్ష్యంగా చేసుకుని వ్యాఖ్యలు చేశారు. సీఎం కుటుంబ సభ్యులపై అవినీతి ఆరోపణలు కూడా చేశారు. వచ్చే ఎన్నికల్లో పరకాల నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డికే ఓటు వేయాలని సీఎం పిలుపునివ్వడంపై ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ అభ్యర్థిగా ప్రకాశ్ రెడ్డి బరిలో ఉన్నా, తాను పరకాల నుంచి పోటీ చేస్తానని సుస్మిత ప్రకటించారు. ఈ వ్యాఖ్యల నేపథ్యంలో పార్టీ క్రమశిక్షణ సంఘం సురేఖకు షోకాజ్ నోటీసు జారీ చేసింది. తన కుమార్తె చేసిన వ్యాఖ్యలకు తనను బాధ్యురాలిని చేయలేరని సురేఖ ఇచ్చిన సమాధానంపై పార్టీ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. క్రమశిక్షణ సంఘం ఆమెపై కఠిన చర్యలకు సిఫార్సు చేసింది. కాగా, కేబినెట్ నుంచి తనను తొలగించడాన్ని కొండా సురేఖ తీవ్రంగా ఖండించారు. కాంగ్రెస్ అధిష్ఠానాన్ని సీఎం రేవంత్ రెడ్డి బ్లాక్ మెయిల్ చేసి తనను తొలగించారని ఆమె ఆరోపించారు. రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి, ఎంపీ వేం నరేందర్ రెడ్డి ఈ కుట్ర వెనుక ఉన్నారని విమర్శించారు. అయితే, తాను, తన భర్త కొండా మురళి కాంగ్రెస్ పార్టీని వీడబోమని ఆమె స్పష్టం చేశారు. బీజేపీలో చేరడం లేదా కొత్త పార్టీ పెట్టడం వంటి ప్రచారాన్ని తోసిపుచ్చుతూ "నేను ఎక్కడికీ వెళ్లడం లేదు" అని స్పష్టం చేశారు.

## ఎయిర్‌ఫోర్స్ నుంచి అభినందన్ వర్ధమాన్ రిటైర్

### రెండు దశాబ్దాలకు పైగా వర్ధమాన్ విశిష్ట సేవలు

### ప్రైవేటు విమానయాన సంస్థలో కీలక బాధ్యతలు

**న్యూఢిల్లీ, సెప్టెంబర్4 :** 2019 బాలాకోట్ వైమానిక దాడుల అనంతరం పాకిస్థాన్ ఎఫ్–16 యుద్ధ విమానాన్ని కూల్చివేసి దేశవ్యాప్తంగా హీరోగా నిలిచిన గ్రూప్ కెప్టెన్ మాజీ వింగ్ కమాండర్ అభినందన్ వర్ధమాన్, భారత వైమానిక దళం నుంచి ఘనంగా రిటైర్మెంట్ తీసుకున్నారు. దాదాపు రెండు దశాబ్దాలకు పైగా నిబద్ధతతో దేశ రక్షణ రంగంలో అందించిన విశిష్ట సేవలకు ముగింపు పలికి, ఆయన ఇప్పుడు తన కెరీర్‌లో సరికొత్త అధ్యాయాన్ని ప్రారంభించారు. వైమానిక దళం నుంచి వీడ్కోలు పొందిన అనంతరం ఆయన ఒక ప్రముఖ ప్రైవేట్ ఎయిర్‌లైన్స్ లో కీలక బాధ్యతలు స్వీకరించారు. 2019 ఫిబ్రవరి 27న జరిగిన చారిత్రాత్మక పోరాటంలో అభినందన్ చూపించిన తెగువ భారత మిలిటరీ చరిత్రలోనే సువర్ణాక్షరాలతో లిఖించబడింది. పాతతరం మిగ్–21 బైసన్ ఫైటర్ జెట్‌ను నడుపుతూనే, అత్యాధునిక అమెరికన్ మేడ్ పాకిస్థానీ ఎఫ్–16 విమానాన్ని లాక్ చేసి కూల్చివేసారు. ఆ సమయంలో తన విమానం కూడా దెబ్బతినడంతో పాక్ ఆక్రమిత కాశ్మీర్ భూభాగంలో పారాచూట్ ద్వారా దిగాల్సి వచ్చింది. పాకిస్థాన్ ఆర్మీ కస్టడీలో ఉన్నప్పటికీ, ఎలాంటి బెదిరింపులకు లొంగకుండా ఆత్మస్థైర్యంతో, ఆర్మీ సమాచారాన్ని బయటపెట్టకుండా నిలబడిన తీరు దేశ ప్రజలందరినీ ముగ్ధులను చేసింది. విశ్వవ్యాప్తంగా దౌత్యపరమైన ఒత్తిడి, భారత ప్రభుత్వ కఠిన వైఖరి కారణంగా పాకిస్థాన్ ప్రభుత్వం 60 గంటల్లోపే అభినందన్‌ను వాఘా సరిహద్దు ద్వారా సురక్షితంగా భారత్‌కు అప్పగించక తప్పలేదు. ఆయన చూపిన అసాధారణ ధైర్యసాహసాలకు గాను భారత ప్రభుత్వం ఆయనకు అత్యున్నత మిలిటరీ పురస్కారం వీరచక్ర తో గౌరవించింది. ఆ తర్వాత ఆయన సైనిక హోదా పెరుగుతూ గ్రూప్ కెప్టెన్ స్థాయికి చేరుకున్నారు. సుదీర్ఘ వైద్య పరీక్షలు, పునరావాసం అనంతరం ఆయన తిరిగి యుద్ధ విమానాలను నడిపి తనలోని అసమాన ప్రతిభను నిరూపించుకున్నారు. సైనిక సేవలకు వీడ్కోలు చెప్పిన అభినందన్, ఇప్పుడు ప్రైవేట్ విమానయాన రంగంలోకి అడుగుపెడుతున్నారు. డిఫెన్స్ విమానాలను నడపడంలో ఉన్న ఆయన సుదీర్ఘ అనుభవం, ఫైలటింగ్ నైపుణ్యాలు , క్లిష్ట సమయాల్లో నిర్ణయాలు తీసుకునే వ్యూహాత్మక సామర్థ్యాన్ని ఉపయోగించుకోవడానికి ప్రధాన ప్రైవేట్ ఎయిర్‌లైన్స్ ఆయనకు కీలక సీనియర్ కమాండ్ బాధ్యతలను అప్పగించింది. వాణిజ్య విమానయాన రంగం వేగంగా విస్తరిస్తున్న వేళ, అభినందన్ లాంటి నిపుణులు పౌర విమానయానంలో చేరడం ఆ సంస్థకు మాత్రమే కాకుండా ప్రైవేట్ విమానయాన రంగానికే సరికొత్త బలాన్ని చేకూర్చనుంది.



## కాంగ్రెస్‌లో వర్గపోరు లేదు

### మంత్రి వివేక్ వెంకటస్వామి

**హైదరాబాద్, సెప్టెంబర్4 :** కాంగ్రెస్ పార్టీలో ఎక్కడా వర్గపోరు లేదని, నాయకులంతా ఏకతాటిపై నిలిచి పార్టీ బలోపేతంతో పాటు రాష్ట్ర అభివృద్ధికి కట్టుబడి పనిచేస్తున్నారని తెలంగాణ మంత్రి వివేక్ వెంకటస్వామి స్పష్టం చేశారు. మంచిర్యాల జిల్లా పర్యటనలో భాగంగా పలు సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్న ఆయన, అనంతరం మీడియాతో మాట్లాడుతూ రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనలో ఎన్నో చారిత్రాత్మక సంక్షేమ పథకాలను అమలు చేసి ప్రజాదరణ పొందిందని వెల్లడించారు. రాష్ట్రంలో తీవ్ర చర్చనీయాంశంగా మారిన 22ఏ నిరోధిత భూముల వివాదంపై మంత్రి స్పందిస్తూ... ఈ సమస్య ముమ్మాటికీ గత బీఆర్ఎస్ ప్రభుత్వ నిర్లక్ష్యం, అనాలోచిత నిర్ణయాల వల్లే ఉత్పన్నమైందని మండిపడ్డారు. ఆనాటి జీవోను పునఃపరిశీలించి, సవరణలు చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు వేగవంతం చేసిందని, ఏ ఒక్క రైతుకూ అన్యాయం జరగకుండా నిరోధిత జాబితా చిక్కులను త్వరలోనే పూర్తిస్థాయిలో పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ప్రతికూలంగా ఉన్నప్పటికీ, ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని నిబద్ధతతో నెరవేరుస్తున్నామని పేర్కొన్నారు. కేసీఆర్ హయాంలో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు అక్రమాలు, డిజైన్ లోపాల వల్లే మేడిగడ్డ బ్యారేజ్ కుంగిపోయిందని ఆరోపించిన మంత్రి వివేక్, ఈ వైఫల్యంపై మాజీ నీటిపారుదల శాఖ మంత్రి హరీశ్ రావు ప్రజలకు బహిరంగ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ నేతలు ఉనికి కోసమే ప్రభుత్వంపై అసత్య ప్రచారాలు చేస్తున్నారని, గత పదేళ్ల స్వైర పాలనను ప్రజలు ఇంకా మరచిపోలేదని ఆయన వ్యాఖ్యానించారు.

## కేబినెట్‌లోకి రాములమ్మ..!?

- మంత్రి పదవి కోసం హైకమాండ్‌తో చర్చలు
- సుముఖంగా ఉన్న కాంగ్రెస్ అధిష్ఠానం!



**హైదరాబాద్, సెప్టెంబర్4 :** తెలంగాణ రాజకీయాల్లో కేబినెట్ పునర్వ్యవస్థీకరణ అంశం మరోసారి హాట్‌టాపిక్‌గా మారింది. కొండా సురేఖను మంత్రి వర్గం నుంచి తొలగించిన నేపథ్యంలో ఆమె స్థానంలో మరో మహిళా నేతను కేబినెట్‌లోకి తీసుకునే అవకాశంపై కాంగ్రెస్ హైకమాండ్ కసరత్తు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలోనే కాంగ్రెస్ ఎమ్మెల్సీ, సినీ నటి విజయశాంతి పేరు తెరపైకి వచ్చింది. ఆమె మంత్రి పదవి కోసం హైకమాండ్‌తో చర్చలు జరుపుతున్నట్లు పార్టీ వర్గాల్లో జోరుగా ప్రచారం జరుగుతోంది. కొండా సురేఖను మంత్రి పదవి నుంచి తొలగించడంతో ప్రస్తుతం రేవంత్ రెడ్డి కేబినెట్‌లో సీతక్క ఒక్కరే మహిళా మంత్రిగా ఉన్నారు. దీంతో సురేఖ స్థానంలో మరో మహిళా నేతకు మంత్రివర్గంలో అవకాశం ఇవ్వాలని కాంగ్రెస్ అధిష్ఠానం భావిస్తున్నట్లు సమాచారం. కాంగ్రెస్ తరఫున పలువురు మహిళా ఎమ్మెల్యేలు ఉన్నప్పటికీ.. విజయశాంతికి అవకాశంఇవ్వాలనే ఆలోచన రాష్ట్ర నాయకత్వం లో ఉన్నట్లు తెలుస్తోంది. పాలకుర్తి ఎమ్మెల్యే మమిడాల యశస్వినీ రెడ్డి, కోదాడ ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి, సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి, నారాయణపేట ఎమ్మెల్యే చిట్టెం పర్ణికా రెడ్డి పేర్లు కూడా పరిశీలనలో ఉన్నట్లు సమాచారం. తెలంగాణ రాజకీయాల్లో ఫైర్‌బ్రాండ్ నేతగా విజయశాంతి గుర్తింపు పొందారు. గతంలో బీఆర్ఎస్‌లో ఎంపీగా పనిచేసిన ఆమెకు ఆ పార్టీ రాజకీయాలు, నేతల వ్యవహారశైలిపై మంచి అవగాహన ఉందని కాంగ్రెస్ వర్గాలు భావిస్తున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం బీఆర్ఎస్‌ను రాజకీయంగా ఎదుర్కొనే విషయంలో విజయశాంతి వంటి బలమైన వాయిస్ కేబినెట్‌లో ఉంటే పార్టీకి ప్రయోజనం చేకూరుతుందని కాంగ్రెస్ నాయకత్వం భావిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. ప్రభుత్వ నిర్ణయాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లడంతో పాటు ప్రతిపక్షాల విమర్శలకు దీటుగా సమాధానం ఇవ్వగల నేతగా ఆమెను పరిగణిస్తున్నట్లు సమాచారం. మంత్రి పదవిపై చర్చల నేపథ్యంలో విజయశాంతి ఢిల్లీకి వెళ్లనున్నట్లు పార్టీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. హైకమాండ్ పెద్దలను కలిసి తన రాజకీయ భవిష్యత్తు, మంత్రి పదవిపై చర్చించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఎన్నికల తర్వాత కాంగ్రెస్ పార్టీ విజయశాంతికి ఎమ్మెల్సీ పదవి ఇచ్చింది. పార్టీపై బహిరంగంగా అసంతృప్తి వ్యక్తం చేయకుండా.. అప్పుడప్పుడు రాజకీయ అంశాలపై తనదైన శైలిలో స్పందిస్తూ వస్తున్నారు. దీంతో ఆమెకు మంత్రివర్గంలో అవకాశం ఇస్తే పార్టీకి మరింత బలమైన స్వరం లభిస్తుందని రాష్ట్ర నాయకత్వం భావిస్తున్నట్లు సమాచారం. అన్నింటికంటే ఆసక్తికరంగా.. విజయశాంతి కేబినెట్‌లో చేరితే హోంశాఖ కావాలని కోరుతున్నట్లు రాజకీయ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. అయితే దీనిపై అధికారికంగా ఎలాంటి ప్రకటన వెలువడలేదు. మరోవైపు కేబినెట్‌లోకి ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌ను తీసుకునే అంశం కూడా పరిశీలనలో ఉన్నట్లు సమాచారం. ఇప్పటికే కేబినెట్‌లో రెండు ఖాళీలు ఉండగా.. తాజాగా కొండా సురేఖ బర్తరఫ్‌తో మొత్తం ఇద్దరు లేదా ముగ్గురు కొత్త ముఖాలను మంత్రివర్గంలోకి తీసుకోవాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది. కొందరు సీనియర్ మంత్రుల శాఖలను మార్చే అవకాశాలపై కూడా కాంగ్రెస్ నాయకత్వం కసరత్తు చేస్తున్నట్లు తెలుస్తోంది. అయితే విజయశాంతికి నిజంగానే మంత్రి పదవి దక్కుతుందా.. దక్కితే ఆమె కోరుకుంటున్న హోంశాఖనే కేటాయిస్తారా.. అనే అంశాలు ఇప్పుడు తెలంగాణ రాజకీయాల్లో ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి. దీనిపై కాంగ్రెస్ అధిష్ఠానం తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.

## జేఎన్టీయూలో విద్యార్థుల మధ్య ఘర్షణలు

### కర్రలతో విద్యార్థులు పరస్పర దాడులు

**హైదరాబాద్, సెప్టెంబర్4 :** హైదరాబాద్‌లోని జవహర్ లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ క్యాంపస్‌లో విద్యార్థుల మధ్య వాగ్వాదం తీవ్ర ఉద్రిక్తతలకు దారితీసింది. గురువారం రాత్రి తీజ్ వేడుకల్లో ఓ విద్యార్థిపై దాడిచేయడంతో ఘర్షణగా మారింది. అనంతరం గౌతమి, మంజీరా హాస్టళ్లలోని విద్యార్థులు కర్రలతో పరస్పరం దాడిచేసుకున్నారు. దీంతో జేఎన్టీయూ రణరంగాన్ని తలపించింది. ఈ ఘటనతో మిగతా విద్యార్థులు భయాందోళనకు గురయ్యారు. గాయపడిన విద్యార్థులను ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. హాస్టల్ సిబ్బంది ప్రిన్సిపాల్‌కు సమాచారం ఇవ్వడంతో ఆయన అక్కడకు చేరుకుని విద్యార్థులను నిలువరించారు. విషయం తెలుకున్న కేపీహెచ్‌బీ పోలీసులు.. హుటాహుటిన అక్కడకు చేరుకుని పరిస్థితి అదుపు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు.. దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు. హాస్టల్‌లో తీజ్ కార్యక్రమం సందర్భంగా రెండు వర్గాల మధ్య వివాదం మొదలైంది. దీంతో మాటా మాటా పెరిగి.. ఘర్షణగా మారింది. ఈ ఘటనపై వర్సిటీ యాజమాన్యం విచారణకు సిద్ధమవుతున్నట్లు సమాచారం. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని యూనివర్సిటీ అధికారులను విద్యార్థులు కోరుతున్నారు. బంజారాల సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే మొలకల పండుగ తీజ్. ప్రకృతి ఆరాధన వేడుకల్లో అవివాహిత యువతులదే ప్రధాన పాత్ర. ప్రత్యేక ఉపవాసాలు పాటిస్తూ గోధుమలు, పుట్టమట్టితో వస్త్రంలో గోధుమలను విత్తుతారు. తొమ్మిది రోజుల పాటు మూడు పూటలా నీరు పోసి మొలకలు పెంచుతారు. వర్షాలు సమృద్ధిగా కురిసి, పాడిపంటలు అభివృద్ధి చెందాలని కోరుకుంటూ సంత్ సేవాలాల్ మహారాజ్, ఇతర దేవతలను ప్రార్థిస్తారు. భజనలు, ఆటపాటలతో తండాల్లో పండుగ వాతావరణం నెలకొంటుంది.

## కేటీఆర్‌కు మరో ప్రతిష్టాత్మక అంతర్జాతీయ ఆహ్వానం

### లక్సెంబర్గ్ వెంచర్ డేస్-2026లో కీలకోపన్యాసానికి పిలుపు



**హైదరాబాద్, సెప్టెంబర్4 :** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు మరో ప్రతిష్టాత్మక అంతర్జాతీయ వేదిక నుంచి ఆహ్వానం అందింది. యూరప్‌లో స్టార్టప్‌లు, వెంచర్ క్యాపిటల్, పెట్టుబడుల రంగాలకు సంబంధించిన ప్రముఖ కార్యక్రమం లక్సెంబర్గ్ వెంచర్ డేస్–2026లో కీలకోపన్యాసం చేయాలని నిర్వాహకులు కేటీఆర్‌ను ఆహ్వానించారు. లక్సెంబర్గ్‌లో అక్టోబర్ 14, 15 తేదీల్లో జరిగే ఈ కార్యక్రమానికి తరఫున ఆహ్వానం అందింది. ఆసియా, యూరప్ దేశాల్లో పెట్టుబడుల విధానాలు ఎలా భిన్నంగా ఉంటాయి? పెట్టుబడిదారుల రిస్క్ తీసుకునే ధోరణి, స్టార్టప్ వ్యవస్థాపకుల అంచనాలు, పెట్టుబడి అవకాశాలు, అంతర్జాతీయ భాగస్వామ్యం వంటి అంశాలపై ఏర్పాటు చేస్తున్న ప్రత్యేక సెషన్‌లో కేటీఆర్ మాట్లాడాలని నిర్వాహకులు కోరారు. భారత్‌ను అంతర్జాతీయ పెట్టుబడి, ఆవిష్కరణ వ్యవస్థలతో అనుసంధానించడంలో కేటీఆర్‌కు ఉన్న అనుభవం యూరప్‌లోని పెట్టుబడిదారులు, స్టార్టప్ వ్యవస్థాపకులకు ఉపయోగపడుతుందని తమ ఆహ్వానంలో నిర్వాహకులు పేర్కొన్నారు. భారత్, ఇతర అంతర్జాతీయ మార్కెట్ల మధ్య పెట్టుబడి సంబంధాలను పెంపొందించడంలో ఆయన దృక్పథం కీలకమని వారు అభిప్రాయపడ్డారు. యూరప్‌లోని ప్రముఖ పెట్టుబడిదారులు, వెంచర్ క్యాపిటల్ సంస్థలు, స్టార్టప్ వ్యవస్థాపకులు, విధాన నిర్ణేతలు పాల్గొనే ఈ కార్యక్రమం స్టార్టప్ ఫైనాన్సింగ్, వ్యాపార వృద్ధిపై ప్రధానంగా దృష్టి సారిస్తుంది. గత ఏడాది జరిగిన లక్సెంబర్గ్ వెంచర్ డేస్‌కు 28 దేశాల నుంచి 3,400 మంది ప్రతినిధులు హాజరయ్యారు. వారిలో 300 మందికిపైగా పెట్టుబడిదారులు, 110 వెంచర్ క్యాపిటల్ ఫండ్ల ప్రతినిధులు ఉన్నారు యూరప్‌కు చెందిన పలు ప్రముఖ వెంచర్ క్యాపిటల్ సంస్థలు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నాయి.

జనం వార్త

# ఏఐకి పెరిగిన ఆదరణ




**నేటి యుగంలో ఎఐకి ఆదరణ బాగా పెరిగిందని చెప్పుకోవాలి. ప్రతీ సంస్థ దాదాపు ఎఐపై ఆధారపడటం మేడలు పెట్టాయి. ఆ దిశగా భారతదేశంలో 2024-2026 మధ్య ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సంబంధిత ఉద్యోగాల జీతాలు 23 శాతం పెరిగాయని, అదే సమయంలో కొన్ని సాంప్రదాయ టెక్నాలజీ ఉద్యోగాల జీతాలు తగ్గాయని, ఇది ఉద్యోగ మార్కెట్‌లో వేతన వ్యత్యాసాన్ని పెంచుతోందని తెలిపింది. జాబ్స్ ప్లాట్‌ఫామ్ ఫౌండిట్ విడుదల చేసిన ఈ నివేదిక ప్రకారం, గత సంవత్సరం ఏఐ రంగం వార్షిక ప్రాతిపదికన 12 శాతం జీతాల వృద్ధిని నమోదు చేసింది. ఇది పరిశీలించిన విభాగాలలో అత్యధికం. దీని తర్వాతి స్థానాల్లో కంప్యూటర్ అండ్ నెట్‌వర్క్ సెక్యూరిటీ- సెమీకండక్టర్స్ చెరో 9 శాతం వృద్ధిని నమోదు చేశాయి.**

గత రెండేళ్లుగా కంప్యూటర్ హార్డ్‌వేర్ మరియు ఇ-కామర్స్ వంటి రంగాలలో జీతాలు తగ్గుముఖం పట్టగా, ఐటీ సేవల రంగంలో జీతాలు స్తంభించిపోయాయని నివేదిక పేర్కొంది. 0-3 సంవత్సరాల అనుభవం ఉన్న ఎంట్రీ-లెవల్ ఏఐ నిపుణులు సంవత్సరానికి రూ. 8.87-15.41 సంపాదిస్తుండగా, 15 సంవత్సరాల కంటే ఎక్కువ అనుభవం ఉన్నవారికి ఇది రూ. 70.99-89.24 లక్షల వరకు పెరుగుతుంది. ఏఐ వేతనాలు ప్రాంతాన్ని బట్టి గణనీయంగా మారుతూ ఉంటాయి. ఇది ప్రత్యేక నైపుణ్యం ఉన్న యజమానులు, పరిణతి చెందిన టెక్నాలజీ ఎకోసిస్టమ్‌లు ఎక్కడ కేంద్రీకృతమై ఉన్నాయో ప్రతిబింబిస్తుంది. ఉత్పత్తి సంస్థలు, ఏఐ-కేంద్రీకృత స్టార్టప్‌లు, ప్రపంచ సామర్థ్య కేంద్రాల సాంద్రత కారణంగా, బెంగళూరు భారతదేశంలో అత్యధిక వేతనాలు ఇచ్చే మార్కెట్‌గా కొనసాగుతోంది. బెంగళూరులో సీనియర్ ఏఐ నిపుణులు సంవత్సరానికి రూ. 61.70-91.25 లక్షలు సంపాదిస్తున్నారు.

ఇది ఎన్‌సిఆర్ లేదా ముంబై కంటే సుమారు 10-15 శాతం ఎక్కువ, సీనియర్ స్థాయిలో చెన్నై కంటే 40 శాతం వరకు అధికం. విస్తరిస్తున్న జిసిసి, ఉత్పత్తి ఇంజనీరింగ్ పెట్టుబడుల మద్దతుతో హైదరాబాద్ దీనికి గట్టి పోటీదారుగా ఎదుగుతోంది. సైబర్‌సెక్యూరిటీ రంగంలో గరిష్ట వేతన పరిమితి సంవత్సరానికి రూ. 97.81 లక్షలు, ఇది పరిశీలించిన అన్ని విభాగాలలోకెల్లా అత్యధికమని నివేదిక పేర్కొంది. దీనికి విరుద్ధంగా, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ-ఐటి సర్వీసెస్‌లో ప్రారంభ వేతనం సంవత్సరానికి రూ. 2.68-5.08 లక్షలతో మొదలై, 15 ఏళ్లకు పైబడిన వారికి సంవత్సరానికి రూ. 57.55--72.13 లక్షలకు చేరుకుంటుంది. గత ఏడాదితో పోలిస్తే ఈ రెండు విభాగాలలోనూ వేతనాల్లో 1 శాతం తగ్గుదల నమోదైంది. కంపెనీలు దేనికి అధిక వేతనం చెల్లించాలనే విషయంలో ఎంపిక చేసుకుంటున్నాయి. కేవలం అనుభవం మాత్రమే ఇకపై అత్యధిక జీతాల పెంపును అందించడం లేదు. ఒక నైపుణ్యం వ్యాపారానికి అవసరమైన సామర్థ్య లోపాన్ని పూరిస్తుందా లేదా అన్నదే ముఖ్యం. అది ఏఐ వ్యవస్థలను నిర్మించడం, మౌలిక సదుపాయాలను భద్రపరచడం, ఫ్యాక్టరీలను ఆటోమేట్ చేయడం లేదా ప్రత్యేకమైన ఆరోగ్య సంరక్షణను అందించడం వంటివి కావచ్చునని ఫౌండిట్ సీఈఓ తరుణ్ సిన్హా అన్నారు. వ్యాపార అవసరాలు మారుతున్న కొద్దీ, తమ నైపుణ్యాలను నిరంతరం మెరుగుపరుచుకుంటూ, నవీకరించుకునే వారి జీతాలు కూడా క్రమంగా పెరుగుతాయని నిపుణులు అర్థం చేసుకోవాలని సిన్హా అన్నారు.

టెక్నాలజీ రంగం వెలుపల జీతాల పెరుగుదల, కొత్త సామర్థ్యాలను పెంపొందించుకునే రంగాలలో కేంద్రీకృతమై ఉంది. గత రెండేళ్లలో, సెమీకండక్టర్ల రంగంలో 17 శాతం (మొదట 7 శాతం, ఆ తర్వాత 9 శాతం), ఇండస్ట్రియల్ ఆటోమేషన్ రంగంలో 13 శాతం (మొదట 5 శాతం, ఆ తర్వాత 8 శాతం) జీతాలు పెరిగాయి. ఈ రెండూ గత రెండేళ్లలో మరింత వేగవంతమయ్యాయి. ఇండస్ట్రియల్ ఆటోమేషన్‌లో సీనియర్ జీతాలు రూ. 58.90 లక్షల వార్షిక ప్యాకేజీకి, సెమీకండక్టర్లలో రూ. 48.49 లక్షల వార్షిక ప్యాకేజీకి చేరుకున్నాయి. గత ఏడాది ఆటోమోటివ్ రంగం 6 శాతం వృద్ధిని నమోదు చేసింది. మెడికల్ ప్రాక్టీస్ రంగంలో 8 శాతం జీతాల పెరుగుదల, సీనియర్ జీతాలు రూ. 56.70 లక్షల వార్షిక ప్యాకేజీకి చేరాయి. దీని తర్వాత మెడికల్ డివైసెస్ రంగంలో 6 శాతం, ఫార్మాస్యూటికల్స్ రంగంలో 4 శాతం వృద్ధి నమోదైంది. ఇక ఇదే కోణంలో ఎఐ కి ఆదరణ పెరిగితే ఆ రంగంలో రాణించే నిపుణులకు తిరుగుండదనేది నిపుణుల వాదన.

# ట్రంప్ దృష్టిలో అగ్రస్థానంలో మోదీ

## అమెరికా రాయబారి ఆసక్తికర వ్యాఖ్యలు!



**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 4 :** జీ20 సదస్సు కోసం భారత ప్రధాని నరేంద్ర మోదీ అమెరికా వెళ్లనున్న నేపథ్యంలో ఇరు దేశాల మధ్య కీలక పరిణామాలు చోటుచేసుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. మోదీని కలవాలని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఎంతగానో కోరుకుంటున్నారని అమెరికా రాయబారి సెర్గియో గోర్ తెలిపారు. డిసెంబర్‌లో ఫ్లోరిడాలో జరిగే జీ20 సదస్సు కేవలం బహుపాక్షిక సమావేశాలకే పరిమితం కాకపోవచ్చని ఆయన వ్యాఖ్యానించారు. ట్రంప్ దృష్టిలో మోదీ స్నేహితుడని, 35 మంది నేతలు వస్తే ఎవరిని కలవాలనుకుం టారని అడిగితే.. మోదీ ఆయన జాబితాలో అగ్రస్థానంలో ఉంటారని గోర్ చెప్పారు. 2020లో భారత పర్యటనను ట్రంప్ ఇప్పటికీ ఎంతో ఇష్టంగా గుర్తుచేసుకుంటున్నారని, వచ్చే ఏడాది ఆయన భారత్‌కు వచ్చే అవకాశం కూడా ఉందని సంకేతాలు ఇచ్చారు. అమెరికా-భారత్ సంబంధాలు ఇతర దేశాలు అసూయపడే రీతిలో ఉన్నాయని వ్యాఖ్యానించారు. భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందంపై కూడా గోర్ కీలక వ్యాఖ్యలు చేశారు. అమెరికా సుప్రీంకోర్టు తీర్పు తర్వాత చర్చలను మళ్లీ కొనసాగిస్తున్నామని, ఒప్పందం "చాలా దగ్గర్లోనే ఉంది" అని తెలిపారు. రాబోయే కొన్ని నెలల్లో ఒప్పందం ఖరారవుతుందని ఆశిస్తున్నట్లు చెప్పారు. ప్రస్తుతం ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక వాణిజ్యం సుమారు 240 బిలియన్ డాలర్లు ఉండగా.. దీన్ని 500 బిలియన్ డాలర్లకు పెంచాలని మోదీ, ట్రంప్ లక్ష్యంగా పెట్టుకున్నారు. భారత్ ఆర్థికంగా బలపడటం అమెరికాకు కూడా ప్రయోజనకరమని గోర్ అన్నారు. మోదీ దేశానికి స్థిరత్వాన్ని అందిస్తున్నారని ప్రశంసించారు. అమెరికా కంపెనీలు భారత్‌లో పెట్టుబడులు పెంచుతున్నాయని, మైక్రోసాఫ్ట్, గూగుల్ వంటి సంస్థలు డేటా సెంటర్లు, ఏఐ కేంద్రాలు, ఔషధ రంగాల్లో విస్తరిస్తున్నాయని చెప్పారు. అమెరికాలోకి కొత్తగా 24 బిలియన్ డాలర్ల పెట్టుబడులను ఆకర్షించడంలోనూ రాయబార కార్యాల యం సహకరించిందన్నారు. భారత్ తమకు విశ్వసనీయ-ౖమైన రక్షణ భాగస్వామి అని గోర్ పేర్కొన్నారు. రక్షణ సంబంధాలు కేవలం ఆయుధాల కొనుగోళ్లకే పరిమితం కావని, పరస్పర విశ్వాసం కూడా కీలకమని చెప్పారు. జావెలిన్ క్షిపణి ప్రాజెక్టు, అపాచీ హెలికాప్టర్ల సరఫరా, మరిన్ని రక్షణ పరికరాలపై చర్చలను ఇందుకు ఉదాహరణగా పేర్కొన్నారు. అమెరికాతో భారత్ ఇతర దేశాల కంటే ఎక్కువగా సైనిక విన్యాసాలు నిర్వహిస్తోందన్నారు. అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో అక్టోబర్‌లో మరోసారి భారత్‌కు రానున్నారు. తక్కువ వ్యవధిలో విదేశాంగ మంత్రి రెండుసార్లు భారత్‌కు రావడం అరుదని గోర్ అన్నారు. మరికొందరు అమెరికా కేబినెట్ మంత్రులు, మూడు రాష్ట్రాల గవర్నర్లు కూడా ఈ ఏడాది భారత్‌లో పర్యటించే అవకాశం ఉందన్నారు. విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ కూడా వచ్చే నాలుగు నెలల్లో మూడుసార్లు అమెరికా వెళ్లే అవకాశం ఉందని తెలిపారు. భారత్, అమెరికా, జపాన్, ఆస్ట్రేలియాతో కూడిన క్వాడ్ కూడా ఇరు దేశాల భాగస్వామ్యంలో కీలకమని గోర్ అన్నారు. మానవతా సాయం, విపత్తుల నిర్వహణ, సైనిక సహకారం, కృత్రిమ మేధ, డేటా సెంటర్లు, కీలక ఖనిజాల రంగాల్లో నాలుగు దేశాలు కలిసి పనిచేస్తున్నాయని చెప్పారు. త్వరలో నాలుగు దేశాల నేతల శిఖరాగ్ర సమావేశం నిర్వహించేందుకు అమెరికా ఆసక్తిగా ఉందన్నారు.

## నేపాల్ బాధితులకు అండగా నిలిచిన సోనూసూద్



**న్యూఢిల్లీ, సెప్టెంబర్4 :** ఇటీవల సంభవించిన తీవ్ర వరదలతో అల్లా డుతున్న నేపాల్ ప్రజలను ఆదుకు నేందుకు ప్రముఖ నటుడు, రియల్ హీరో సోనూసూద్ రంగంలోకి దిగిన సంగతి తెలిసిందే. బాధితు లకు అవసర మైన దుప్పట్లు, ఆహార పదార్థాలు, ఇతర నిత్యావ సర సరుకులను భారత్ నుంచి తరలించి, క్షేత్రస్థాయిలో సహా యక చర్యలను పర్యవేక్షి స్తున్నారు. అయితే, సోనూసూద్ నేపాల్ పర్యటనపై ప్రముఖ జర్నలిస్ట్ అజిత్ అంజుమ్ సోషల్ మీడియా వేదికగా విమర్శలు గుప్పించారు. పనులు ఇంకా ప్రారంభం కాకముందే ఆయనను దేవుడి గా చిత్రీకరిస్తూ ప్రచారం చేసుకోవడం కేవలం 'సెల్ఫ్ మార్కెటింగ్' అని ఎక్స్‌లో పోస్ట్ పెట్టడం కలకలం రేపింది. అయితే ఈ ప్రతికూల విమర్శలపై సోనూసూద్ ఎంతో హుందాగా, సానుకూలంగా స్పందించారు. "సోద రా.. మీ మనసు చాలా మంచిది. మీరు నేపాల్‌కు రండి, మనమిద్దరం కలిసి ప్రజలకు అండగా నిలబడి సాయం చేద్దాం" అంటూ రీట్వీట్ చేశారు. ఎలాంటి వివాదాలకు చోటు ఇవ్వకుండా, తనను విమర్శించిన వ్యక్తినే నేరుగా సేవా కార్యక్రమంలో భాగస్వామి కావాలని ఆహ్వానించిన ఆయన తీరు నెటిజన్లను విపరీతంగా ఆకట్టుకుంటోంది. సోనూసూద్ చూపించిన ఈ సంస్కారం, పరిణతిపై సోషల్ మీడియాలో ప్రశంసల వర్షం కురుస్తోంది. కాగా, త్రిశూలి నది పరివాహక ప్రాంతాల్లో వరద విధ్వంసం తీవ్రంగా ఉందని, బాధితుల ఇళ్లను పునర్నిర్మించి వారు సాధారణ జీవితం గడిపే వరకు కొన్ని నెలల పాటు తమ 'సూద్ ఫౌండేషన్' తరఫున సహాయక చర్యలు కొనసాగుతాయని సోనూసూద్ స్పష్టం చేశారు. పరాయి దేశంలోనూ మానవత్వాన్ని చాటుకుంటూ ఆయన అందిస్తున్న సేవలకు గానూ అంతటా అభినందనలు వ్యక్తమవుతున్నాయి.

## రేపు ఛలో నాగిరెడ్డిపేట్

### కాంగ్రెస్ 1000 రోజుల పాలనలో 1000 అబద్దాలు అంటూ నిరసన

**ఎల్లారెడ్డి, సెప్టెంబర్ 4 :** కాంగ్రెస్ 1000 రోజుల విఫల పాలనపై బీఆర్ఎస్ నిరసన కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఛలో నాగిరెడ్డిపేట్ కార్యక్రమం జరగనుంది. ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ ఆరు గ్యారంటీల వైఫల్యాలపై శుక్రవారం ఈ నిరసన కార్యక్రమం చేపట్టనుంది. ఉ 11 గంటలకు నాగిరెడ్డిపేట్ పట్టణ కేంద్రంలో జరిగే ఈ నిరసన కార్యక్రమంలో భాగంగా ఫీజు రీయింబర్స్‌మెంట్, జాబ్ క్యాలెండర్, యూత్ డిక్లరేషన్ కొరకు విద్యార్థులు, యువతతో నాగిరెడ్డిపేట్ మండల కేంద్రంలో భారీ ర్యాలీ చేపట్టనున్నారు. ఈ కార్యక్రమానికి బి.ఆర్.ఎస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, యువత పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేఅఘ్రీతీ బి.ఆర్.ఎస్ పార్టీ, ఎల్లారెడ్డి నియోజకవర్గం నేతలు పిలుపునిచ్చారు.

## జుక్కల్ చౌరస్తా వద్ద బస్సు ప్రమాదం

**జుక్కల్, సెప్టెంబర్ 4 :** జుక్కల్ చౌరస్తాలో వద్ద బస్సు ప్రమాదానికి గురైతంది. ఈ ప్రమాదంలో బస్సు డ్రైవర్ మృతి చెందగా, మరో 12 మంది గాయపడ్డారు. ప్రమాద సమాచారం అందుకున్న వెంటనే జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు బిచ్కుంద ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకుని క్షతగాత్రులను పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. గాయపడిన వారిలో ఒకరికి తలకు తీవ్ర గాయం కావడంతో మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రికి తరలించారు. మిగిలిన క్షతగాత్రులకు బిచ్కుంద ఆసుపత్రిలో వైద్యులు చికిత్స అందిస్తున్నారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని వైద్యాధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. అవసరమైన అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తామని బాధిత కుటుంబాలకు భరోసా ఇచ్చారు.

# ఫుకెట్-ఢిల్లీ విమానంలో ప్రమాదం

## డ్రగ్స్ తీసుకున్న పైలట్‌పై ఎయిరిండియా వేటు

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 4 :** విమాన ప్రయాణికుల భద్రతను ప్రమాదంలోకి నెట్టిన ఓ పైలట్‌పై ఎయిర్ ఇండియా కఠిన చర్యలు తీసుకుంది. మాదకద్రవ్యాల (సైకోయాక్టివ్ సబ్‌స్టాన్స్) పరీక్షలో పాజిటివ్‌గా తేలడంతో పైలట్-ఇన్-కమాండ్ (పీఐసీ)ని తక్షణమే ఉద్యోగం నుంచి తొలగించినట్లు శుక్రవారం ప్రకటించింది. ఫుకెట్ నుంచి ఢిల్లీ వస్తున్న విమానంలో తీవ్రమైన ఘటన చోటుచేసుకున్న అనంతరం నిర్వహించిన పరీక్షల్లో ఈ విషయం బయటపడింది. భద్రతా నిబంధనల ఉల్లంఘన విషయంలో తమది "జీరో-టాలరెన్స్" విధానమని ఎయిర్ ఇండియా ప్రతినిధి స్పష్టం చేశారు. "ఫుకెట్-ఢిల్లీ విమాన పైలట్ మాదకద్రవ్యాల పరీక్షలో పాజిటివ్‌గా తేలారు. భద్రత, ఫిట్‌నెస్ లేదా ఇతర నియంత్రణ నిబంధనల ఉల్లంఘనను ఏమాత్రం సహించబోము. ఈ కారణంగా ఆ పైలట్ సేవలను తక్షణమే రద్దు చేశాం" అని ఆయన తెలిపారు. ఈ ఘటనపై ఎయిర్‌క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో (ఏఏఐబీ) ప్రాథమిక దర్యాప్తు నివేదికను విడుదల చేయడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. పైలట్ డ్రగ్స్ టెస్టులో పాజిటివ్‌గా తేలడం తీవ్రమైన ఆందోళన కలిగించే అంశమని, దీనిపై డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ) తక్షణమే చర్యలు తీసుకోవాలని ఏఏఐబీ తన నివేదికలో సిఫారసు చేసింది. వివరాల ప్రకారం, ఆగస్టు 4న 137 మంది ప్రయాణికులు, ఆరుగురు క్యాబిన్ సిబ్బంది, ఇద్దరు పైలట్లతో కలిపి మొత్తం 145 మందితో ఎయిర్ ఇండియాకు చెందిన ఎయిర్‌బస్ ఏ320 విమానం (ఏఐ-2379) ఫుకెట్ నుంచి ఢిల్లీకి బయలుదేరింది. విమానం ఒడిశా గగనతలంలో 36,000 అడుగుల ఎత్తులో ప్రయాణిస్తుండగా, దానిలోని మూడు హైడ్రాలిక్ వ్యవస్థలు ఒకేసారి విఫలమయ్యాయి. దీంతో విమానం అదుపుతప్పి ఒక్కసారిగా 372 అడుగులు పైకి వెళ్లి, ఆ తర్వాత 292 అడుగులు కిందికి వచ్చేసింది. ఈ ఘటనలో 20 మంది ప్రయాణికులు, నలుగురు సిబ్బంది గాయపడ్డారు. ఘటన అనంతరం ఢిల్లీలో ఇద్దరు పైలట్లకు వైద్య పరీక్షలు నిర్వహించారు. బ్రీత్ ఎనలైజర్ పరీక్షలో ఇద్దరికీ నెగెటివ్ రాగా, మాదకద్రవ్యాల పరీక్షలో పీఐసీకి "నాన్-నెగెటివ్" ఫలితం వచ్చింది. అనంతరం నిర్ధారణ కోసం ఇద్దరి రక్త నమూనాలను ల్యాబొరేటరీకి పంపగా, పీఐసీ డ్రగ్స్ తీసుకున్నట్లు మరోసారి నిర్ధారణ అయింది. కో-పైలట్ ఫలితాలు మాత్రం నెగెటివ్‌గా వచ్చాయి. ఈ ఘటనపై సాంకేతిక, ఇతర అంశాలపై ఏఏఐబీ పూర్తిస్థాయి దర్యాప్తు కొనసాగిస్తోంది. విమానం బయలుదేరే ముందు నిర్వహించిన తనిఖీల్లో ఎలాంటి సమస్యలు లేవని నివేదిక పేర్కొంది.

## జీవనకాల గరిష్ఠానికి స్మాల్ క్యాప్స్

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 4 :** అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్ల పెంపుపై ఆందోళనలు తగ్గడంతో దేశీయ స్టాక్ మార్కెట్లు శుక్రవారం లాభాల్లో ముగిశాయి. అయితే కీలక స్థాయిల వద్ద మదుపర్ల లాభాల స్వీకరణకు దిగడం, మధ్యప్రాచ్యంలో కొనసాగుతున్న ఉద్రిక్తతలు మార్కెట్ జోరును కొంత అడ్డుకున్నాయి. విస్తృత మార్కెట్‌లో కొనుగోళ్ల మద్దతుతో స్మాల్‌క్యాప్ సూచీలు కొత్త జీవనకాల గరిష్ఠాలను తాకాయి. బీఎస్ఈ సెన్సెక్స్ 362.57 పాయింట్లు (0.48 శాతం) లాభపడి 76,515.43 వద్ద ముగిసింది. ఓ దశలో 730 పాయింట్ల వరకు ఎగబాకి 76,883.14ను తాకింది. నిఫ్టీ 24.25 పాయింట్లు (0.10 శాతం) పెరిగి 23,897.70 వద్ద స్థిరపడింది. ఇంట్రాడేలో 24,005.75 వరకు వెళ్లింది. రంగాల వారీగా చూస్తే నిఫ్టీ మెటల్ సూచీ 1 శాతానికి పైగా పెరిగి అగ్రస్థానంలో నిలిచింది. బ్యాంకింగ్ మినహా ఆర్థిక సేవల షేర్లలోనూ కొనుగోళ్లు కనిపించాయి. మరోవైపు నిఫ్టీ ఐటీ 0.47 శాతం, ఫార్మా 0.68 శాతం, హెల్త్‌కేర్ 0.87 శాతం చొప్పున నష్టపోయాయి. మార్కెట్‌లో ఒడుదొడుకులను సూచించే ఇండియా వీఐఎక్స్ 6.24 శాతం తగ్గి 10.63కి చేరింది. ఆగస్టులో కోర్ ద్రవ్యోల్బణం స్వల్పంగా తగ్గే అవకాశాలు ఫెడ్ వడ్డీ రేట్ల విషయంలో విరామం ఉంటుందనే అంచనాలను బలపరచొచ్చని నిపుణులు చెబుతున్నారు. మరోవైపు బలమైన కంపెనీల ఆర్థిక ఫలితాలు, స్థిరమైన ఆర్థిక వృద్ధి, దేశీయ డిమాండ్ మార్కెట్‌పై మదుపర్ల నమ్మకాన్ని కొనసాగిస్తున్నాయని పేర్కొన్నారు. రూపాయి 0.09 శాతం బలపడి డాలర్‌కు రూ.94.48 వద్ద ట్రేడైంది. ఎఫ్‌సీఎన్ఆర్ డిపాజిట్లలోకి కొత్తగా నిధులు రావడం డాలర్ లిక్విడిటీకి మద్దతిచ్చింది.

## బెంగాల్ ప్రభుత్వ సలహాదారుగా మిథున్ చక్రవర్తి

**పశ్చిమ బెంగాల్, సెప్టెంబర్ 4 :** పశ్చిమ బెంగాల్ ప్రభుత్వానికి సాంస్కృతిక సలహాదారు (కల్చరల్ అడ్వైజర్)గా బాలీవుడ్ ప్రముఖ నటుడు మిథున్ చక్రవర్తి నియమితుడయ్యారు. ఈ మేరకు ముఖ్యమంత్రి సువేందు అధికారి శుక్రవారం అధికారికంగా ప్రకటించారు. కోల్‌కతా శివారులోని న్యూ టౌన్‌లో 'ఉత్తమ్ కుమార్ ఫిలిం సెంటర్' నిర్మాణానికి శంకుస్థాపన చేసిన సందర్భంగా ఆయన ఈ కీలక ప్రకటన చేశారు. ఈ కార్యక్రమంలో సీఎం సువేందు అధికారి మాట్లాడుతూ.. రూ.25 కోట్ల వ్యయంతో ఈ ఫిలిం సెంటర్‌ను నిర్మిస్తున్నామని, ఇందుకు అవసరమైన నిధులను రాష్ట్ర సమాచార, సాంస్కృతిక శాఖ ఇప్పటికే మంజూరు చేసిందని తెలిపారు. ఫిలిం సెంటర్ డిజైన్‌ను ఖరారు చేసే బాధ్యతను పూర్తిగా బెంగాలీ సినీ రంగ నిపుణులకే అప్పగిస్తామని, ప్రభుత్వం ఇందులో ఎలాంటి జోక్యం చేసుకోదని ఆయన స్పష్టం చేశారు. "ఈ రంగంతో సంబంధం ఉన్నవారికే ఆ పనిలో పూర్తి స్వేచ్ఛ ఇవ్వాలి. మా పని కేవలం మద్దతు ఇవ్వడమే. ప్రతి విషయంలో జోక్యం చేసుకోవడం సరికాదు" అని సీఎం అన్నారు. కోల్‌కతాలోని ప్రఖ్యాత నందన్ కల్చరల్ సెంటర్ మాదిరిగా ఈ కొత్త ఫిలిం సెంటర్‌ను నిర్మించనున్నారు. ఈ ప్రాజెక్టులో మొత్తం మూడు విభాగాలు ఉంటాయి. మొదటి విభాగంలో 750 సీట్ల సామర్థ్యంతో రెండు సినిమా హాళ్లు, ఒక ప్రివ్యూ థియేటర్, ఫుడ్ కోర్ట్, పార్కింగ్ సదుపాయాలు ఏర్పాటు చేస్తారు. రెండో విభాగంలో 1,000 సీట్ల ఆడిటోరియం, సాంస్కృతిక కార్యక్రమాల కోసం ఓపెన్-ఎయిర్ థియేటర్ ఉంటాయి. మూడో విభాగంలో యానిమేషన్, విజువల్ ఎఫెక్ట్స్, గేమింగ్, పోస్ట్-ప్రొడక్షన్ కోసం అత్యాధునిక ల్యాబొరేటరీలు, స్టూడియోలు నిర్మిస్తారు. ఇప్పటికే సాయిల్ టెస్టింగ్, స్థల ఎంపిక పూర్తయ్యాయని, డీటెయిల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్ (డీపీఆర్) ప్రక్రియ కొనసాగుతోందని సీఎం వివరించారు. వర్షాకాలం ముగిసిన వెంటనే పశ్చిమ బెంగాల్ హౌసింగ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్మాణ పనులు మొదలవుతాయని తెలిపారు. సెప్టెంబర్ 6 వరకు టాలీవుడ్ (బెంగాలీ చిత్ర పరిశ్రమ)కు చెందిన పలువురు ప్రముఖులను సన్మానించనున్నట్లు, ఈ సన్మాన గ్రహీతల ఎంపికలో కూడా ప్రభుత్వం జోక్యం చేసుకోదని, సినీ పరిశ్రమ కమిటీయే ఆ బాధ్యత తీసుకుంటుందని ఆయన స్పష్టం చేశారు.

## రికార్డు సృష్టించిన ఇటలీ ప్రధాని

**న్యూఢిల్లీ, సెప్టెంబర్4 :** ఇటలీ ప్రధాని జార్జియా మెలోనీ ఆ దేశ రాజకీయ చరిత్రలో ఒక అరుదైన రికార్డును సొంతం చేసుకున్నారు. యుద్ధానంతర ఇటలీ చరిత్రలో అత్యధిక కాలం నిరంతరాయంగా ప్రధానిగా పనిచేసిన వ్యక్తిగా ఆమె నిలిచారు. ఈ సందర్భంగా భారత ప్రధాని నరేంద్ర మోదీ ఆమెకు శుభాకాంక్షలు తెలియజేశారు. మెలోనీని 'నా స్నేహితురాలు' అని సంబోధిస్తూ, ఆమె నాయకత్వంపై ఇటలీ ప్రజలకు ఉన్న విశ్వాసానికి ఈ మైలురాయే నిదర్శనమని ప్రశంసించారు. ఈ మేరకు సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్' వేదికగా మోదీ స్పందిస్తూ.. "ఇటలీ యుద్ధానంతర చరిత్రలో సుదీర్ఘకాలం ప్రధానిగా కొనసాగుతున్న నా స్నేహితురాలు జార్జియా మెలోనీకి అభినందనలు. ఈ విజయం ఆమె నాయకత్వంపై ఇటలీ ప్రజలు ఉంచిన నమ్మకానికి, విశ్వాసానికి ప్రతీక" అని పేర్కొన్నారు. భారత్-ఇటలీ మధ్య 'ప్రత్యేక వ్యూహాత్మక భాగస్వామ్యం' బలోపేతం కావడంలో మెలోనీ స్నేహం కీలక పాత్ర పోషించిందని మోదీ అన్నారు. భవిష్యత్తులో కూడా ఇరు దేశాల ప్రజల శ్రేయస్సు కోసం కలిసి పనిచేయడానికి ఎదురుచూస్తున్నట్లు తెలిపారు. 2022 అక్టోబర్ 22న ఇటలీ తొలి మహిళా ప్రధానిగా బాధ్యతలు స్వీకరించిన జార్జియా మెలోనీ, ఇవాళ్టికి 1,413 రోజులు పదవిలో పూర్తి చేసుకున్నారు. తద్వారా మాజీ ప్రధాని సిల్వియో బెర్లుస్కోనీ రికార్డును ఆమె అధిగమించారు. గత జులైలో ప్రధాని మోదీ భారత చరిత్రలో అత్యధిక కాలం ఎన్నికైన ప్రధానిగా నిలిచినప్పుడు మెలోనీ కూడా ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఇరు దేశాల ప్రజలకు కొత్త అవకాశాలు సృష్టించేందుకు కలిసి పనిచేస్తామని ఆమె పేర్కొన్నారు. గత మే నెలలో మోదీ ఇటలీలో పర్యటించినప్పుడు ఇరు దేశాల సంబంధాలను 'ప్రత్యేక వ్యూహాత్మక భాగస్వామ్యం' స్థాయికి పెంచుతూ ఇరు నేతలు నిర్ణయం తీసుకున్నారు.



## తిరుమలలో భక్తుల రద్దీ

**శ్రీవారి దర్శనానికి 22 గంటల సమయం**

**తిరుమల తిరుపతి, సెప్టెంబర్ 5 (జనం వార్త) :** తిరుమల శ్రీవారి దర్శనం కోసం భక్తులు పెద్ద ఎత్తున తరలిరావడంతో తిరుమలలో భారీ రద్దీ నెలకొంది. శ్రీవారి దర్శనానికి దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో వైకుంఠం క్యూ కాంప్లెక్స్, క్యూ లైన్లు కిక్కిరిసిపోయాయి. భక్తుల రద్దీ పెరగడంతో సర్వదర్శనానికి సుమారు 22 గంటల సమయం పడుతున్నట్లు అధికారులు తెలిపారు. గంటల తరబడి భక్తులు క్యూ లైన్లలో వేచి ఉండాల్సి రావడంతో చిన్నారులు, వృద్ధులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అయినప్పటికీ స్వామివారి దర్శనం కోసం భక్తులు ఓపికగా క్యూలైన్లలో వేచి ఉన్నారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) అధికారులు క్యూ లైన్ల వద్ద భద్రత, తాగునీరు, అన్నప్రసాదం తదితర సౌకర్యాలను అందించేందుకు చర్యలు చేపట్టారు. క్యూ లైన్లలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సిబ్బంది ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. సెప్టెంబర్ నెలలో సెలవులు, పర్వదినాల నేపథ్యంలో తిరుమలకు భక్తుల రాక మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. భక్తులు సహనంతో వ్యవహరించి టీటీడీ సిబ్బందికి సహకరించాలని కోరుతున్నారు.

## బీజినపల్లి మండలంలో బీసీ నేతల సమావేశం

**కొండా సురేఖను మంత్రి పదవిలోకి వెంటనే తీసుకోవాలి : అబ్బ కరుణాకర్ బీసీ నాయకుల డిమాండ్**



**బిజినపల్లి సెప్టెంబర్ 04( జనం వార్త) :** బీసీ మహిళా నేత, మాజీ మంత్రి కొండా సురేఖను తిరిగి మంత్రి పదవిలోకి వెంటనే తీసుకోవాలని నాగర్ కర్నూల్ బీసీ నాయకులు డిమాండ్ చేశారు. మంత్రి పదవి నుంచి ఆమెను తొలగించడాన్ని తీవ్రంగా ఖండిస్తూ బీజినపల్లి మండలంలో బీసీ నాయకుల సమావేశం నిర్వహించారు. ఐదుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన సీనియర్ బీసీ మహిళా నేత కొండా సురేఖను సరైన వివరణ తీసుకోకుండా ఏకపక్షంగా మంత్రి పదవి నుంచి తొలగించడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని అన్నారు. తన శాఖకు సంబంధించిన నిర్ణయాలు తనకు తెలియకుండా సీఎంఓ నుంచి జరుగుతున్నాయని, తనను నామమాత్రపు మంత్రిగా మార్చారని సురేఖ స్వయంగా హైకమాండ్‌కు లేఖ ద్వారా ఆవేదన వ్యక్తం చేసిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. కూతురు చేసిన వ్యాఖ్యలకు తల్లిని శిక్షించడం ఏ న్యాయమని ప్రశ్నించారు. 42 శాతం బీసీ రిజర్వేషన్ల గురించి మాట్లాడుతూనే బీసీ మహిళా మంత్రిని తొలగించడం బీసీ సమాజాన్ని అవమానించడమేనని బీసీ నాయకులు పేర్కొన్నారు. కొండా సురేఖకు బీసీ సంఘాలు పూర్తి మద్దతుగా నిలుస్తాయని స్పష్టం చేశారు. రాబోయే ఎన్నికల్లో బీసీల రాజకీయ బలాన్ని చూపిస్తామని, బీసీలకు తగిన రాజకీయ ప్రాధాన్యత కల్పించే దిశగా ఐక్యంగా ముందుకు సాగుతామని నాయకులు తెలిపారు.



## బిఆర్ఎస్ వంటా-వార్పు నిరసన

- ప్రజలను వంచించిన కాంగ్రెస్‌కు గుణపాఠం తప్పదు
- అబద్ధాల పునాదులపై అధికారంలోకి వచ్చిన ప్రజా వ్యతిరేక సర్కారు
- రైతులు, వృద్ధులు, మహిళలను నిలువునా ముంచారు
- హాజరైన మాజీ ఎమ్మెల్యే,పార్టీ ఇంచార్జ్ మెచ్చా నాగేశ్వరరావు, నియోజకవర్గ సభ్యత్వ నమోదు ప్రక్రియ ఇన్‌ఛార్జి ఉప్పల వెంకటరమణ

**దమ్మపేట, సెప్టెంబర్ 4:** ఆరు గ్యారెంటీల పేరుతో అడ్డగోలు హామీలిచ్చి గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను నిలువునా వంచిస్తోందని లిఅశ్వారావుపేట నియోజకవర్గ మాజీ మీూా , దీ=ూ పార్టీ ఇంచార్జ్ మెచ్చా నాగేశ్వరరావు గారు మరియు నియోజకవర్గ సభ్యత్వ నమోదు కార్యక్రమ ఇంచార్జ్ ఉప్పల వెంకటరమణ గారు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. కాంగ్రెస్ విఫల పాలనకు నిరసనగా అశ్వారావుపేట(నియోజకవర్గం), దమ్మపేట మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై మండల పార్టీ మాజీ అధ్యక్షులు దొడ్డ రమేశ్ గారి ఆధ్వర్యంలో 'వంట-వార్పు'నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. రోడ్డుపైనే పొయ్యిలు పెట్టి వంటలు చేస్తూ ప్రభుత్వ వైఖరిపై నిరసన గళం విప్పారు.

### సంక్షేమాన్ని గాలికొదిలేశారు : మెచ్చా నాగేశ్వరరావు

కేసీఆర్ హయాంలో పార్టీలకతీతంగా అర్హులందరికీ రైతుబంధు, రైతుబీమా, కల్యాణలక్ష్మి పథకాలను విజయవంతంగా అందించారని మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు పేర్కొన్నారు. గిరిజనుల దశాబ్దాల కల అయిన పోడు భూములకు పట్టాలు ఇచ్చిన ఘనత కేసీఆర్‌దేనని గుర్తుచేశారు. కాంగ్రెస్ పాలనలో శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయని, మహిళలపై అఘాయిత్యాలు పెరిగిపోయాయని ఆందోళన వ్యక్తం చేశారు. పొట్టకూటి కోసం హైదరాబాద్ వెళ్లిన మన నియోజకవర్గానికి చెందిన అమ్మాయి పరిస్థితే ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమన్నారు. కేసీఆర్ ప్రభుత్వం ప్రారంభించిన పనులను కూడా ఈ ప్రభుత్వం పూర్తి చేయలేకపోతోందని విమర్శించారు. ముఖ్యమంత్రి మాటను సొంత పార్టీ నేతలే వినే పరిస్థితి లేదని,వాళ్ళు వాళ్ళు కొట్టుకొని ఏ క్షణమైనా ప్రభుత్వం కూలిపోవచ్చని.వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ విజయం సాధించి కేసీఆర్ మళ్లీ సీఎం కావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.

### హామీలన్నీ మోసపూరితమే : ఉప్పల వెంకటరమణ

వంద రోజుల్లో అమలు చేస్తామన్న హామీలను ప్రభుత్వం పూర్తిగా తుంగలో తొక్కిందని ఉప్పల వెంకటరమణ మండిపడ్డారు. వృద్ధులకు రూ.4,000 పింఛన్ ఇస్తామని చెప్పి ఇప్పటివరకు అమలు చేయలేదన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న అశ్వారావుపేట వృద్ధాశ్రమానికి చెందిన కోటేశ్వరరావుతో ఆయన మాట్లాడి, పెన్షన్ రాకపోవడంపై ఆవేదనను తెలుసుకున్నారు. ఒక్కో వృద్ధుడికి రూ.82,500, దివ్యాంగులకు రూ.66,000 చొప్పున ప్రభుత్వం బాకీ పడిందని లెక్కలతో సహా వివరించారు. కల్యాణలక్ష్మితో పాటు తులం బంగారం ఇస్తామని చెప్పి, చివరకు కేసీఆర్ ఇచ్చిన పథకాన్ని కూడా సక్రమంగా అమలు చేయడం లేదని దుయ్యబట్టారు. రైతుబంధు కింద రైతులకు రూ.2,936 కోట్ల బకాయిలు చెల్లించకుండా ప్రభుత్వం దగా చేసిందన్నారు. నిరుద్యోగ భృతిని ఎగ్గొట్టారని, విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ నిలిపివేశారని ఆరోపించారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాకు చెందిన ముగ్గురు మంత్రులు ప్రజా సమస్యలను గాలికొదిలేసి కమీషన్ల సంస్కృతికి తెరలేపారని ఆరోపించారు. స్థానిక సమస్యలను ప్రస్తావిస్తూ.. 1/70 చట్టం నిబంధనలకు విరుద్ధంగా భూ వ్యవహారాలు సాగుతున్నాయని, పామాయిల్ ఫ్యాక్టరీల విషయంలో ఇచ్చిన మాటను నిలబెట్టుకోలేకపోయారని విమర్శించారు.

# వెయ్యి రోజుల్లో కాంగ్రెస్ సుపరిపాలన

- ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం : వజ్రేష్ యాదవ్
- ద్వితీయ చక్రాలపై విజయోత్సవ ర్యాలీ.



**నాగారం,సెప్టెంబర్ 4(జనం వార్త) :** వెయ్యి రోజులలో కాంగ్రెస్ ప్రభుత్వం సుపరిపాలన అందించిందని కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ జిల్లా ఇంచార్జ్ తోటకూర వజ్రేష్ యాదవ్ అన్నారు. మల్కాజిగిరి కార్పొరేషన్ పరిధిలోని నాగారం, దమ్మాయిగూడ,కీసర, చంద్రపురి కాలనీ, జవహర్ నగర్ డివిజన్లలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో తెలంగాణ కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం సుపరిపాలన వెయ్యి రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా బైక్ ర్యాలీని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. రాంపల్లి చౌరస్తా నుంచి జవహర్ నగర్ అంబేద్కర్ విగ్రహం వరకు సాగిన ఈ ర్యాలీలో కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.ఈ కార్యక్రమానికి మేడ్చల్- మల్కాజ్‌గిరి జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు,మేడ్చల్ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ తోటకూర వజ్రేష్ యాదవ్ ముఖ్యఅతిథిగా హాజరై అంబేద్కర్ విగ్రహానికి ఘన నివాళులు అర్పించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రజా సంక్షేమం,అభివృద్ధికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు.వెయ్యి రోజుల ప్రజా పాలనలో తెలంగాణలో సంక్షేమం, అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేసిందన్నారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తుందన్నారు. ఆరు గ్యారంటీల ద్వారా పేద,మధ్యతరగతి కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలిచిందన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, గృహజ్యోతి వంటి పథకాలతో ప్రజలకు ప్రత్యక్షంగా ప్రయోజనం కలుగుతోంది.అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇళ్ల ద్వారా సొంతింటి కలను సాకారం చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం అన్నారు.గత ప్రభుత్వ నిర్లక్ష్యంతో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులకు ప్రాధాన్యతనిస్తూ మౌలిక వసతులను మెరుగుపరుస్తు,ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కారానికి కృషి చేస్తున్నామన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాగార,దమ్మైగూడ డివిజన్ ల అధ్యక్షులు భూమయ్య యాదవ్, ముప్ప రామారావు,మాజీ అధ్యక్షులు ముప్పు శ్రీనివాస్ రెడ్డి,మాజీ వైస్ చైర్మన్ మల్లేష్ యాదవ్, మాజీ కౌన్సిలర్ పంగ హరిబాబు,యువ నాయకులు కౌకుట్ల జీవన్ రెడ్డి,సతీష్ గౌడ్, దాసోహం నర్సింగ్, దాసరి రాంరెడ్డి,అనిల్ యాదవ్,పంగ సంతోష్, షేక్ గౌస్,సతీష్,చిట్యాల శ్రీనివాస్ రెడ్డి,బద్రు నాయక్,వెంకట్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి,కొండల్ రెడ్డి నాయకులు,కార్యకర్తలు పార్టీ అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.





## బీజినపల్లి మండలంలో బీసీ నేతల సమావేశం

**కొండా సురేఖను మంత్రి పదవిలోకి వెంటనే తీసుకోవాలి : బీసీ నాయకుల డిమాండ్**

**బిజినపల్లి సెప్టెంబర్ 04( జనం వార్త) :** బీసీ మహిళా నేత, మాజీ మంత్రి కొండా సురేఖను తిరిగి మంత్రి పదవిలోకి వెంటనే తీసుకోవాలని బిజినపల్లి మండల బీసీ నాయకులు డిమాండ్ చేశారు. మంత్రి పదవి నుంచి ఆమెను తొలగించడాన్ని తీవ్రంగా ఖండిస్తూ బీజినపల్లి మండలంలో బీసీ నాయకుల సమావేశం నిర్వహించారు. ఐదుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన సీనియర్ బీసీ మహిళా నేత కొండా సురేఖను సరైన వివరణ తీసుకోకుండా ఏకపక్షంగా మంత్రి పదవి నుంచి తొలగించడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని అన్నారు. తన శాఖకు సంబంధించిన నిర్ణయాలు తనకు తెలియకుండా సీఎంఓ నుంచి జరుగుతున్నాయని, తనను నామమాత్రపు మంత్రిగా మార్చారని సురేఖ స్వయంగా హైకమాండ్‌కు లేఖ ద్వారా ఆవేదన వ్యక్తం చేసిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. కూతురు చేసిన వ్యాఖ్యలకు తల్లిని శిక్షించడం ఏ న్యాయమని ప్రశ్నించారు. 42 శాతం బీసీ రిజర్వేషన్ల గురించి మాట్లాడుతూనే బీసీ మహిళా మంత్రిని తొలగించడం బీసీ సమాజాన్ని అవమానించడమేనని బీసీ నాయకులు పేర్కొన్నారు. కొండా సురేఖకు బీసీ సంఘాలు పూర్తి మద్దతుగా



నిలుస్తాయని స్పష్టం చేశారు. రాబోయే ఎన్నికల్లో బీసీల రాజకీయ బలాన్ని చూపిస్తామని, బీసీలకు తగిన రాజకీయ ప్రాధాన్యత కల్పించే దిశగా ఐక్యంగా ముందుకు సాగుతామని నాయకులు తెలిపారు. ఈ సమావేశంలో మండల చైర్మన్ అంతటి రాజేందర్ గౌడ్, గౌరవ అధ్యక్షులు దాసర్ల వెంకటస్వామి, జిల్లా నాయకులు దన్నోజ్ అరవింద్ చారి, పిట్టల తిరుపతయ్య, నక్క పర్వతాలు యాదవ్, కాటామోని శ్రీనివాస్ యాదవ్, మందడి యాదయ్య, పాపని నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్లపై కాంగ్రెస్ బైక్ ర్యాలీ

**ములుగు, సెప్టెంబర్ 4 :** కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన వెయ్యి రోజుల ప్రజా పాలన, అభివృద్ధి కార్యక్రమాల ప్రచారంలో భాగంగా ములుగు జిల్లా కమలాపురంలో శుక్రవారం భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం గ్రామంలో మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి నిర్మాణ పనులను పరిశీలించారు. కమలాపురం గ్రామంలో 29 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసినట్లు రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ డైరెక్టర్ గుమ్మడి సోమయ్య తెలిపారు. రానున్న రోజుల్లో అర్హులైన మరికొంతమంది లబ్ధిదారులకు ఇళ్లు మంజూరు చేసే ప్రక్రియ కొనసాగుతుందని చెప్పారు.



### 'తప్పుడు ప్రచారం చేస్తే సహించేది లేదు'

ఈ సందర్భంగా సోమయ్య మాట్లాడుతూ పదేళ్ల బీఆర్ఎస్ పాలనతో పోలిస్తే కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల ప్రజాపాలనలోనే అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను చేపట్టిందన్నారు. రాహుల్ గాంధీ మార్గదర్శకత్వంలో ముఖ్యమంత్రి ఏ. రేవంత్‌రెడ్డి, మంత్రి సీతక్క నాయకత్వంలో ప్రభుత్వం ప్రజల సంక్షేమానికి కృషి చేస్తోందని తెలిపారు. కమలాపురం గ్రామంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 29 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసిందని, గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో గ్రామానికి ఒక్క ఇల్లు కూడా మంజూరు కాలేదని విమర్శించారు. మంత్రి సీతక్కపై, కాంగ్రెస్ పార్టీపై తప్పుడు ప్రచారం చేస్తే ఎంతమాత్రం సహించేది లేదని సోమయ్య హెచ్చరించారు.



## కేటీఆర్‌కు ఎమ్మెల్సీ శంకర్‌నాయక్ సవాల్

**'బహిరంగ చర్చకు రండి.. అభివృద్ధిపై గణాంకాలతో సమాధానం చెబుతాం'**

**మిర్యాలగూడ ప్రతినిధి, సెప్టెంబర్ 4:** బీఆర్ఎస్ నేతలు కేటీఆర్, కేసీఆర్, హరీశ్‌రావు నిరాధార ఆరోపణలతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని ఎమ్మెల్సీ కేతావత్ శంకర్‌నాయక్ విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై బహిరంగ చర్చకు తాను సిద్ధమని ప్రకటించారు. మిర్యాలగూడ రాజీవ్‌గాంధీ సెంటర్ లేదా నల్గొండ క్లాక్‌టవర్ వద్ద కేటీఆర్ బహిరంగ చర్చకు రావాలని ఎమ్మెల్సీ శంకర్‌నాయక్ సవాల్ విసిరారు. శుక్రవారం మిర్యాలగూడలోని తన కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలపై గణాంకాలు, ఆధారాలతో ప్రజల ముందే వాస్తవాలను వివరిస్తామని తెలిపారు. మిర్యాలగూడ నియోజకవర్గంలో 25,703 మంది రైతులకు రూ.197 కోట్ల రుణమాఫీ జరిగిందని పేర్కొన్నారు. ఉమ్మడి నల్గొండ జిల్లాలో రూ.2,005 కోట్ల మేర రైతుల రుణాలు మాఫీ చేసినట్లు వెల్లడించారు.

### అనుచిత వ్యాఖ్యలు చేస్తే ఊరుకునేది లేదు

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిపై కేటీఆర్ చేసిన వ్యాఖ్యలను ఎమ్మెల్సీ శంకర్‌నాయక్ తీవ్రంగా ఖండించారు. రాజకీయ విమర్శలకు పరిమితులు ఉండాలని, వ్యక్తిగతంగా అనుచిత వ్యాఖ్యలు చేస్తే రాజకీయంగానే గట్టిగా సమాధానం చెబుతామని హెచ్చరించారు. మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్ చేసిన విమర్శలపైనా ఆయన స్పందించారు. "బహిరంగ చర్చకు వస్తే ఎవరు ఏం చేశారు.. ఎవరి పాలనలో ఏ మేరకు అభివృద్ధి జరిగింది అనే వాస్తవాలను గణాంకాలతో ప్రజల ముందుంచుతాం" అని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ నేతలు చేస్తున్న ఆరోపణలకు ప్రజలే సరైన తీర్పు ఇస్తారని, కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తూ ముందుకు సాగుతోందని ఎమ్మెల్సీ శంకర్‌నాయక్ పేర్కొన్నారు.

# ఇథనాల్ శానిటైజర్ల దుర్వినియోగంపై ఆందోళన

- లైసెన్స్ మినహాయింపు ఎత్తివేయాలి
- కేంద్రానికి రాష్ట్ర డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ లేఖ

**విజయవాడ, సెప్టెంబర్ 4 :** ఇథనాల్ ఆధారిత హ్యాండ్ శానిటైజర్లను కొందరు మద్యం ప్రత్యామ్నాయంగా వినియోగిస్తున్న నేపథ్యంలో.. వాటి విక్రయాలపై నియంత్రణ అవసరమని రాష్ట్ర డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ జనరల్ పీ. అరుణ్‌బాబు పేర్కొన్నారు. కొవిడ్ సమయంలో శానిటైజర్ల నిల్వ, విక్రయాలకు ఇచ్చిన లైసెన్స్ మినహాయింపును ఇథనాల్ ఆధారిత శానిటైజర్లకు వర్తించకుండా ఉపసంహరించాలని కోరుతూ డ్రగ్స్ కంట్రోలర్ జనరల్ (ఇండియా)కు లేఖ రాశారు. కొవిడ్ సమయంలో శానిటైజర్ల సులభ లభ్యత కోసం కేంద్ర ప్రభుత్వం 27-07-2020న ఎస్.ఓ.245(ఈ) నోటిఫికేషన్ ద్వారా వాటి నిల్వ, విక్రయాలకు సేల్ లైసెన్స్ నుంచి మినహాయింపు ఇచ్చిందని అరుణ్‌బాబు తెలిపారు. ప్రస్తుతం ఈ మినహాయింపును కొందరు దుర్వినియోగం చేస్తున్నారని పేర్కొన్నారు. విజయవాడ నగరంలో మద్యానికి బదులుగా ఇథనాల్ ఆధారిత హ్యాండ్ శానిటైజర్లను కొందరు వినియోగిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. ఈ నేపథ్యంలో తనిఖీలు, దాడులు జరిపి కొన్ని రిటైల్ మెడికల్ షాపులు ఇథనాల్ ఆధారిత శానిటైజర్లను పెద్ద మొత్తంలో విక్రయించినట్లు గుర్తించామన్నారు. విజయవాడ పటమటలోని సాయి వెంకటేశ్వర ఫార్మసీ అండ్ సర్జికల్‌కు సంబంధించిన బిల్లులను స్వాధీనం చేసుకున్నామని, వాటి ప్రకారం ఏడాదిన్నర కాలంలో సుమారు 33,586 ఇథనాల్ 70 శాతం వీవీ (100 ఎంఎల్) సీసాలను కొనుగోలు చేసి విక్రయించినట్లు వెల్లడైందని పేర్కొన్నారు. ఈ వ్యవహారంలో మూడు రిటైల్ విక్రయ కేంద్రాలపై లైసెన్స్ రద్దు చర్యలు ప్రారంభించినట్లు తెలిపారు. కొవిడ్ సమయంలో ఇచ్చిన మినహాయింపు నాలుగేళ్ల తర్వాత కూడా కొనసాగుతుండటం వల్ల ఇథనాల్ ఆధారిత శానిటైజర్ల దుర్వినియోగానికి అవకాశం ఏర్పడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. మార్కెట్‌లో ఇథనాల్ లేని ప్రత్యామ్నాయ హ్యాండ్ శానిటైజర్లు అందుబాటులో ఉన్నందున.. ఇథనాల్ ఆధారిత శానిటైజర్ల నిల్వ, విక్రయాలకు సేల్ లైసెన్స్ నుంచి ఇచ్చిన మినహాయింపును ఉపసంహరించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కేంద్రాన్ని పీ. అరుణ్‌బాబు కోరారు. ప్రజా ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ఎస్.ఓ.245(ఈ) నోటిఫికేషన్‌ను సమీక్షించి తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.



# ఘనంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు

**ఏలూరు, సెప్టెంబరు 04 :** ఏలూరు జిల్లాలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు ఘనంగా జరిగాయి. శ్రీ కృష్ణజన్మాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకుని చిన్నారులు చేసిన సందడితో ఆయా పాఠశాలల ప్రాంగణంలో కోలాహలం నెలకొంది. శ్రీకృష్ణుడు గోపిక వేషధారులై అందరినీ అలరించారు. పూజా కార్యక్రమం ముగిసిన అనంతరం చిన్నారులు నృత్యాలు చేస్తూ శ్రీకృష్ణుని నామాన్ని, గొప్పదనాన్ని స్మరించారు. ఈ కార్యక్రమంలో భాగంగా చిన్నారులు. ఉత్సాహంగా ఉట్టికొట్టే కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ శ్రీకృష్ణుడు చిలిపి చేష్టలను, అందులో ఉన్న అంతర్యాలను వివరించారు. ధర్మాన్ని కాపాడి, లోకానికి కర్మయోగాన్ని బోధించిన శ్రీకృష్ణ పరమాత్ముని ఆశీస్సులతో ప్రతి ఒక్కరి జీవితాల్లో కొత్త వెలుగులు నిండాలని, ప్రజలందరికీ శ్రీ కృష్ణాష్టమి శుభాకాంక్షలు తెలిపారు. భగవాన్ శ్రీకృష్ణుని ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని ఆకాంక్షించారు.



# ఢిల్లీలో కుండపోత వర్షం

## జలమయమైన విమానాశ్రయం

### విమాన సేవలకు తీవ్ర అంతరాయం

**న్యూఢిల్లీ, సెప్టెంబర్4 :** దేశ రాజధాని ఢిల్లీని శుక్రవారం భారీ వర్షం ముంచెత్తింది. ఈ కుండపోత వర్షం కారణంగా ఇందిరా గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం జలమయమైంది. దీంతో విమాన సర్వీసులకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. వందలాది విమానాలు ఆలస్యంగా నడుస్తుండగా, పలు విమానాలను ఇతర నగరాలకు దారి మళ్లించారు. వివరాల్లోకి వెళితే, శుక్రవారం మధ్యాహ్నం నుంచి ఢిల్లీలో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. దీంతో ఎయిర్‌పోర్ట్ ప్రాంగణంలోని పలు ప్రాంతాలు నీటితో నిండిపోయాయి. ఈ ప్రభావంతో మధ్యాహ్నం 3:30 నుంచి 4:30 గంటల మధ్యలో దాదాపు తొమ్మిది విమానాలను దారి మళ్లించారు. వీటిలో నాలుగు విమానాలను జైపూర్‌కు, మరో నాలుగు లక్నోకు, ఒకటి అహ్మదాబాద్‌కు మళ్లించినట్లు అధికారులు తెలిపారు. ఫ్లైట్‌రాడార్24 డేటా ప్రకారం, 400కు పైగా విమానాలు ఆలస్యంగా నడుస్తున్నాయి. దేశంలోనే అత్యంత రద్దీగా ఉండే ఈ విమానాశ్రయంలో రోజుకు 1,300కు పైగా విమానాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ప్రతికూల వాతావరణం కారణంగా ఢిల్లీ విమాన సర్వీసులపై ప్రభావం పడిందని ఇండిగో, ఎయిర్ ఇండియా సంస్థలు వేర్వేరుగా ప్రకటించాయి. ప్రయాణికులు ఎయిర్‌పోర్ట్‌కు బయలుదేరే ముందు తమ ఫ్లైట్ స్టేటస్‌ను తప్పనిసరిగా చెక్ చేసుకోవాలని సూచించాయి. రోడ్లపై నెమ్మదిగా ప్రయాణం సాగుతున్నందున, ప్రయాణానికి అదనపు సమయం కేటాయించుకోవాలని ఇండిగో కోరింది. ఎయిర్‌పోర్ట్‌లో కార్యకలాపాలపై ప్రభావం పడిందని, తాజా సమాచారం కోసం ప్రయాణికులు సంబంధిత విమానయాన సంస్థలను సంప్రదించాలని ఢిల్లీ ఎయిర్‌పోర్ట్ యాజమాన్యం విజ్ఞప్తి (జీఎంఆర్) చేసింది. నీటిని తొలగించడానికి తమ సిబ్బంది పనిచేస్తున్నారని తెలిపింది. మరోవైపు, భారత వాతావరణ శాఖ (ఐఎండీ) ఢిల్లీకి 'రెడ్ అలర్ట్' జారీ చేసింది. సాయంత్రం వరకు ఉరుములు, మెరుపులతో కూడిన తీవ్ర వర్షపాతం నమోదవుతుందని హెచ్చరించింది. ఈ ఆకస్మిక పరిణామంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

# సరికొత్తగా హస్త కళలు

- ఆధునిక డిజైన్లతో సంస్కృతీ సంప్రదాయల కళారూపాలు
- కళారూపాల తయారీలో 770 మంది కళారులకు శిక్షణ
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో నిర్వహణ
- రూ.1.35 కోట్లు విడుదల చేసిన కేంద్రం
- క్లస్టర్ల వారీగా శిక్షణ కార్యక్రమాలు
- 200 మందికి శిక్షణతో పాటు టూల్ కిట్ల అందజేస్తాం
- రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి సవిత



**అమరావతి, సెప్టెంబర్ 4 :** మారుతున్న అభిరుచులు, హస్త కళలకు పెరుగుతున్న ఆదరణను దృష్టిలో పెట్టుకుని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు హస్త కళాకారులకు మెరుగైన జీవనం, ఆర్థిక భరోసా కలిగించేలా చర్యలు చేపట్టాయి. హస్త కళారూపాల తయారీలో మరింత ప్రావీణ్యం పెంపొందించడంతో పాటు ఆధునిక డిజైన్ల తయారీలో శిక్షణా కార్యక్రమాలకు శ్రీకారం చుడుతున్నాయి. ఇందుకోసం కేంద్ర ప్రభుత్వం రూ.1.35 కోట్లను వెచ్చించనుంది. రాష్ట్ర వ్యాప్తంగా వివిధ కళారూపాలను తయారు చేస్తున్న 770 మంది హస్త కళాకారులకు శిక్షణా కార్యక్రమాలు చేపట్టనుంది. ఇందుకోసం శిక్షణా కార్యక్రమాలు ఆయా కళారూపాలను బట్టి నెల, రెండు నెలల పాటు ఇవ్వనున్నారని రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆమె ఒక ప్రకటన జారీ చేసింది. రాష్ట్రంలో చేతివృత్తులకు అండగా నిలవాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్ణయించాయన్నారు. ఇప్పటికే సీఎం చంద్రబాబునాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం చేనేతలకు ఆర్థిక మేలు కలిగించడంతో పాటు చేనేత ఉత్పత్తుల అమ్మకాలు పెంచేలా ఎన్నో కార్యక్రమాలు చేపడుతోందన్నారు. ఇప్పుడు హస్త కళాకారులకు కూడా ఆర్థిక భరోసా కలిగేలా ఆయా కళారూపాల తయారీలో మెరుగైన శిక్షణ ఇవ్వాలని నిర్ణయించిందన్నారు. ఇందుకు కేంద్ర ప్రభుత్వ సహకారం కూడా తీసుకుంటోందన్నారు. దీనిలో భాగంగా రాష్ట్రంలో వివిధ జిల్లాల్లో ప్రఖ్యాతిగాంచిన హస్త కళారూపాలను తయారీ చేస్తున్న కళాకారులను గుర్తించి మారుతున్న అభిరుచులకు అనుగుణంగా శిక్షణ ఇవ్వాలని రెండు ప్రభుత్వాలు నిర్ణయించాయన్నారు. ఈ శిక్షణల నిమిత్తం కేంద్ర ప్రభుత్వం రూ.1,35,16,314లను మంజూరు చేసిందని మంత్రి తెలిపారు. ఇందులో భాగంగా మొదటి విడతగా రూ.1.01 కోటి నిధులు మంజూరయ్యాయన్నారు. రాష్ట్రంలో ఆయా క్లస్టర్లలో ఉన్న హస్త కళాకారులకు రెండు విధాలుగా శిక్షణివ్వనున్నట్లు వెల్లడించారు. గురు-శిష్యహస్త శిల్ప్ ప్రశిక్షణ్(జీహెచ్పీపీ), డిజైన్ డెవలప్‌మెంట్ వర్క్‌షాప్స్ (డీడీడబ్ల్యూ) ద్వారా నెల, రెండు నెలల శిక్షణ ఇవ్వనున్నామన్నారు. గురు-శిష్య హస్త శిల్ప్ ప్రశిక్షణ్ (జీహెచ్పీపీ) రెండు నెలలు, డిజైన్ డెవలప్‌మెంట్ వర్క్‌షాప్స్ (డీడీడబ్ల్యూ) నెల రోజుల పాటు శిక్షణ అందజేయనున్నట్లు తెలిపారు. డిజైన్ డెవలప్‌మెంట్ వర్క్‌షాప్స్ (డీడీడబ్ల్యూ)లోని కొయ్యబొమ్మల తయారీకి కూడా రెండు నెలల పాటు ఇవ్వనున్నామన్నారు.

# పల్లె చెరువులకు కొత్త కళ

- రాష్ట్రవ్యాప్తంగా దాదాపు రూ. 50 కోట్లతో 105 చెరువుల ఆధునీకరణ
- ఇప్పటికే 26 చెరువులకు పునరుజ్జీవం
- భూగర్భ జలాల పెంపు.. సమగ్ర అభివృద్ధే ధ్యేయం
- వాకింగ్ ట్రాక్‌లు, ఓపెన్ ఎయిర్ జిమ్‌లు, చిల్డ్రన్ పార్కులతో కొత్త రూపు
- సెప్టెంబర్ నెలాఖరుకల్లా పనులు పూర్తి చేసేందుకు అధికార యంత్రాంగానికి దిశానిర్దేశం



**మంగళగిరి, సెప్టెంబర్ 4 :** సాగు నీటి వనరుల సంరక్షణ నుంచి పర్యావరణ పరిరక్షణ వరకు, గ్రామీణ మౌలిక సదుపాయాల అభివృద్ధి నుంచి ప్రజల జీవన ప్రమాణాల మెరుగుదల వరకు సమగ్ర అభివృద్ధే ధ్యేయంగా ఉప ముఖ్యమంత్రి శ్రీ పవన్ కళ్యాణ్ గారు ప్రత్యేక కృషి చేస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల సర్వతోముఖాభివృద్ధిపై లక్ష్యంగా ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. ఉప ముఖ్యమంత్రివర్యుల చొరవకు 'ప్రధాన మంత్రి కృషి సించాయీ యోజన' పథకం తోడవడంతో రాష్ట్రవ్యాప్తంగా మంచినీటి చెరువులు, సరస్సుల పునరుజ్జీవనానికి కొత్త ఊపు వచ్చింది. శ్రీ పవన్ కళ్యాణ్ గారి దార్శనికత, అభివృద్ధి పట్ల ఆయనకు ఉన్న నిబద్ధతతో చెరువులకు కొత్త జీవం పోయడమే కాకుండా, వాటిని మరింత సమర్థవంతమైన సాగునీటి వనరులుగా తీర్చిదిద్దే దిశగా విస్తృత స్థాయిలో అభివృద్ధి పనులు చేపడుతున్నారు. చెరువుల ఆధునీకరణ ద్వారా భూగర్భ జలాలను పెంపొందించడం, పర్యావరణ సమతౌల్యా న్ని కాపాడటం, సాగునీటి సామర్థ్యాన్ని బలోపేతం చేయడంతో పాటు గ్రామీణ ప్రజలకు మరింత మెరుగైన, ఆహ్లాదకరమైన జీవన వాతావరణాన్ని అందించాలన్న సమగ్ర లక్ష్యంతో ఈ అభివృద్ధి కార్యక్రమాలు ముందుకు సాగుతున్నాయి.

### రూ. 50 కోట్ల అంచనా వ్యయంతో పనులు

రాష్ట్రవ్యాప్తంగా ఈ పథకం కోసం మొత్తం అనుగుణంగా పనులను చేపడుతున్నారు. ఈ కార్యక్రమం పూర్తయితే చెరువుల నీటి నిల్వ సామర్థ్యం పెరగడంతోపాటు సాగు నీటి వనరులు మరింత బలోపేతం కానున్నాయి. అలాగే భూగర్భ జలాల వృద్ధికి తోడ్పడనున్నాయి.× చెరువులకు కొత్త రూపు.. ప్రజలకు కొత్త సౌకర్యాలుచెరువుల ఆధునీకరణ ప్రక్రియలో భాగంగా చెరువు గట్ల బలోపేతం, వాకింగ్ ట్రాక్‌ల ఏర్పాటు, ప్రవేశ ద్వారాల నిర్మాణం, సోలార్ లైట్ల ఏర్పాటు, సిట్టింగ్ బెంచ్‌ల ఏర్పాటు వంటి పనులు చేపడుతున్నారు. పిల్లలకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించేలా పార్కుల ఏర్పాటు చేయడంతో పాటు ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఓపెన్ ఎయిర్ జిమ్ పరికరాలను కూడా ఏర్పాటు చేస్తున్నారు. దీంతో పాటు చెరువుల సుందరీకరణ పనులకు ప్రాధాన్యం ఇస్తూ, వాటిని ప్రజల విశ్రాంతి, ఆరోగ్యం, వినోదానికి అనువైన కేంద్రాలుగా తీర్చిదిద్దుతున్నారు. ఇప్పటికే చిత్తూరు జిల్లా, కుప్పం నియోజకవర్గం పరిధిలోని వెదుళ్ల చెరువు, కాకినాడ రూరల్ నియోజకవర్గం పరిధిలోని పండూరు చెరువు, గుంటూరు జిల్లా వెంగళాయపాలెం చెరువు, అనంతపురం జిల్లాలో గుడిశెలపల్లి చెరువు, నెల్లూరు జిల్లాలోని వింజమూరు, శ్రీ సత్యసాయి జిల్లా పాలసముద్రం తదితర చెరువులు పూర్తి స్థాయి అభివృద్ధి పనులు పూర్తి చేసుకుని ప్రజలకు అందుబాటులోకి వచ్చాయి.. కేంద్ర ప్రాయోజిత కార్యక్రమాల ద్వారా రాష్ట్ర అభివృద్ధికి నిరంతరం సహాయ సహకారాలు అందిస్తున్న ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ కి, రాష్ట్రంలో అమలుకు సహకరిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ధన్యవాదాలు తెలియజేశారు.

# కాంట్రాక్ట్ ఉద్యోగులకు భారీ ఊరట

- మంత్రి సత్యకుమార్ ఆదేశాలతో కీలక ఉత్తర్వులు జారీ
- రేడియోగ్రాఫర్లు, నర్సులు, పీహెచ్‌సీ సిబ్బంది సమస్యలకు పరిష్కారం
- ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్ట్ ద్వారా ప్రోత్సాహకాలు

**అమరావతి, సెప్టెంబర్ 4 :** దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న కాంట్రాక్ట్ ఉద్యోగుల సర్వీసు సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. కాంట్రాక్ట్ ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) విజ్ఞప్తులపై వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ సానుకూలంగా స్పందించి సమస్యల పరిష్కారానికి ఆదేశాలు ఇచ్చారు. మంత్రి ఆదేశాల మేరకు వైద్య, ఆరోగ్యశాఖ కార్యదర్శి వీరపాండియన్, ఆరోగ్య కుటుంబ సంక్షేమశాఖ కమిషనర్ చక్రధర్‌బాబు సమీక్షలు నిర్వహించారు. అనంతరం సంబంధిత అధికారులు కాంట్రాక్టు ఉద్యోగులకు ఊరట నిచ్చేలా కీలక ఉత్తర్వులు జారీ చేశారు. రేడియేషన్ ముప్పును ఎదుర్కొంటున్న కాంట్రాక్ట్ రేడియోగ్రాఫర్లు, రేడియోగ్రాఫిక్ టెక్నీషియన్లకు ప్రభుత్వం ప్రత్యేక వెసులుబాటు కల్పించింది. బోధనాస్పత్రుల్లో ఎక్స్‌రే, రేడియాలజీ విభాగాల్లో విధులు నిర్వహించే అర్హులైన సిబ్బందికి ప్రతి 11 నెలల విధి పూర్తయిన తర్వాత 30 రోజుల తప్పనిసరి ప్రత్యేక సెలవు మంజూరు చేయాలని ఆదేశించింది. ఈ సెలవును సాధారణ లీవ్ ఖాతా నుంచి మినహాయించరాదని స్పష్టం చేసింది. పీహెచ్‌సీల్లో సిబ్బంది కొరత, విధుల సర్దుబాటుపైనా ప్రభుత్వం దృష్టి సారించింది. స్థానిక అవసరాలకు అనుగుణంగా అందుబాటులో ఉన్న సిబ్బంది సేవలను వినియోగించుకోవాలని ఆదేశించింది. పగటి సమయంలో ఎంఎన్‌ఓలు, ఎఫ్ఎన్‌ఓల సేవలను, రాత్రి సమయంలో అవసరానికి అనుగుణంగా ఎస్ఏడబ్ల్యూల సేవలను వినియోగించాలని సూచించింది. ముఖ్యంగా రాత్రి విధులు నిర్వహించే సిబ్బందికి సహాయకంగా వీరి సేవలను ఉపయోగించుకోవాలని పేర్కొంది. నర్సులపై ఉన్న 12 గంటల నిరంతర విధి భారం తగ్గించేలా కూడా చర్యలు తీసుకున్నారు. పీహెచ్‌సీలో ముగ్గురు నర్సులు పనిచేస్తున్న సందర్భంలో ఒకరు సెలవులో ఉన్నా, మిగిలిన సిబ్బందితో రొటేషన్ పద్ధతిలో విధులు సర్దుబాటు చేయాలని ఆదేశించారు. పగటి సమయంలో ఒక నర్సుపై 12 గంటల నిరంతర విధి భారం పడకుండా చూడాలని స్పష్టం చేశారు. స్థానికంగా అందుబాటులో ఉన్న సేవలను సమర్థంగా వినియోగించుకుని విధులు సర్దుబాటు చేయాలని సూచించారు. డీఎంఎల్‌టీ, బీఎస్సీ (ఎంఎల్‌టీ) విద్యార్థులకు కూడా పీహెచ్‌సీల్లో క్లినికల్ శిక్షణకు అవకాశం కల్పించారు. 6 లేదా 12 నెలల క్లినికల్ శిక్షణలో భాగంగా నెలరోజుల పాటు పీహెచ్‌సీలు, యూపీహెచ్‌సీల్లో శిక్షణ పొందేలా మార్గదర్శకాలు జారీ చేశారు. విద్యార్థులకు జిల్లా వైద్య, ఆరోగ్య అధికారులు శిక్షణ కేంద్రాలను కేటాయించనున్నారు. శస్త్రచికిత్సలు, ప్రొసీజర్లకు ఎన్టీఆర్ వైద్య సేవా ట్రస్ట్ ద్వారా అందే ప్రోత్సాహకాల్లో డాక్టర్లతో పాటు వాటిలో పాల్గొనే కాంట్రాక్ట్ పారామెడికల్ సిబ్బందికీ వారి క్యాడర్‌కు అనుగుణంగా నిర్ణయించిన వాటా ఇవ్వాలని ఆదేశించారు. స్టాఫ్ నర్సులు, ఓటీ టెక్నీషియన్లు, అనస్థీషియా టెక్నీషియన్లు, ల్యాబ్ టెక్నీషియన్లు, ఫార్మసిస్టులు, ఇతర సంబంధిత సిబ్బందిని కూడా అర్హత మేరకు చేర్చాలని స్పష్టం చేశారు. ప్రతి నెల శస్త్రచికిత్సలు, పాల్గొన్న సిబ్బంది, వారికి అందే ప్రోత్సాహక మొత్తాల వివరాలను నోటీస్ బోర్డులో ప్రదర్శించాలని ఆరోగ్య కుటుంబ సంక్షేమశాఖ కమిషనర్ చక్రధర్‌బాబు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

# ఆంధ్రా పేపర్ మిల్స్‌పై ఇక ఉపేక్షించం

## మిల్స్ యాజమాన్యంపై ఏపీ ఉప ముఖ్యమంత్రి ఆగ్రహం

**అమరావతి, సెప్టెంబర్ 3 :** ఆంధ్రా పేపర్ మిల్స్ యాజమాన్యంపై ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజమండ్రి వద్ద గోదావరి నది కాలుష్యం కావడానికి ఆంధ్రా పేపర్ మిల్సే ప్రధాన కారణమని ఆయన ఆరోపించారు. నదిలోకి కాలుష్యాన్ని విడిచిపెడుతూ పన్నులు మాత్రం ఎగ్గొడుతున్నారంటూ మండిపడ్డారు. 'ఆంధ్రా పేపర్ మిల్స్.. పన్నులు చెల్లించి పుష్కరకాలం దాటింది. పన్నులు చెల్లించమంటే కోర్టులకెళ్లి కాలయాపన చేస్తున్నారు. పన్నులు చెల్లించేందుకు ఇంతటి బాధ్యతారాహిత్యం ఎందుకు? తప్పు సరిదిద్దుకునే అవకాశం ఇచ్చినా స్పందించడం లేదు. నోటీసు పంపి 3 నెలల సమయం ఇచ్చినా కనీస స్పందన లేదు. ఆంధ్రా పేపర్ మిల్స్‌పై ఇక ఉపేక్షించం.. కఠిన చర్యలు తీసుకుంటాం' అని పవన్ పేర్కొన్నారు. కాగా, రాష్ట్ర పర్యావరణ శాఖామంత్రిగా పవన్ కళ్యాణ్ బాధ్యతలు స్వీకరించిన తర్వాత గోదావరి నది జలాల కాలుష్యంపై ప్రత్యేక దృష్టి సారించిన విషయం తెల్సిందే. దీంతో ఆయన గోదావరి నది ఒడ్డున ఉన్న పరిశ్రమల నుంచి విడుదలయ్యే వ్యర్థజలాలను స్వయంగా పరిశీలించి, ఈ వ్యవర్థాలో గోదావరి జల్లాల్లో విడుదలకాకుండా తగిన చర్యలు తీసుకునేలా ఆయా కంపెనీల యాజమాన్యానికి సమయం ఇచ్చారు. అయినప్పటికీ ఆంధ్రా పేపర్ మిల్స్ వంటి పలు యాజమాన్యాలు ప్రభుత్వ ఆదేశాలను ధిక్కరించి కోర్టులను ఆశ్రయించి కాలయాపన చేస్తున్నాయి.

# తీవ్ర కలకలం రేపిన గుంటూరు బాలిక కిడ్నాప్ కేసు

**అమరావతి, సెప్టెంబర్ 3 :** గుంటూరు బాలిక కిడ్నాప్ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో ప్రధాన నిందితుడైన షేక్ జాన్ సైదాను పోలీసులు హర్యానాలో అరెస్ట్ చేశారు. మూడు నెలలుగా బాలిక ఆచూకీ లభించకపోవడంపై హైకోర్టు తీవ్రంగా స్పందించిన నేపథ్యంలో, పోలీసులు ఈ కేసును ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని నిందితుడిని పట్టుకున్నారు. వివరాల్లోకి వెళితే, గుంటూరులోని ఓ ప్రైవేట్ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న 15 ఏళ్ల బాలికను షేక్ జాన్ సైదా (రబ్బానీ) ఇన్‌స్టాగ్రామ్ ద్వారా పరిచయం పెంచుకుని, మాయమాటలు చెప్పి తీసుకెళ్లాడు. తన కుమార్తె అపహరణకు గురైందని, ఆమెను తమకు అప్పగించేలా పోలీసులను ఆదేశించాలని కోరుతూ బాలిక తండ్రి హైకోర్టులో హెబియస్ కార్పస్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ బట్టు దేవానంద్, జస్టిస్ తుహిన్ కుమార్ ధర్మాసనం ఇటీవల విచారణ చేపట్టింది. మూడు నెలలు గడిచినా బాలిక ఆచూకీ కనిపెట్టలేకపోవడం పోలీసుల వైఫల్యమేనని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. "ఇలాంటి పోలీసులు ఉండటం ప్రభుత్వానికి సిగ్గుచేటు" అంటూ ఘాటైన వ్యాఖ్యలు చేసింది. రాష్ట్ర సమాచార హక్కు కమిషనర్‌ను పోలీస్ స్టేషన్‌లోకి రాకుండా అడ్డుకోవడంలో చూపిన శ్రద్ధ, బాలికను రక్షించడంలో ఎందుకు చూపలేకపోయారని న్యాయస్థానం పోలీసుల తీరును తప్పుబట్టింది. ఈ కేసు దర్యాప్తులో స్థానిక పోలీసులపై తమకు నమ్మకం లేదని స్పష్టం చేసిన ధర్మాసనం, బాలికను గురువారం కోర్టులో హాజరుపరచాలని నేరుగా ఏపీ డీజీపీకి ఆదేశాలు జారీ చేసింది. హైకోర్టు ఇంత తీవ్రంగా స్పందించడంతో, డీజీపీ సిట్ నియామకం జరిపారు. ఉన్నతాధికారుల పర్యవేక్షణలో ప్రత్యేక బృందాలు గాలింపు చర్యలు ముమ్మరం చేశాయి. ఈ క్రమంలోనే, సాంకేతిక ఆధారాలతో నిందితుడు జాన్ సైదా హర్యానాలో ఉన్నట్లు గుర్తించి, అక్కడికి వెళ్లి అతడిని అదుపులోకి తీసుకున్నారు. నిందితుడిని, బాలికను గుంటూరుకు తరలించే ప్రక్రియను పోలీసులు ప్రారంభించారు.

# కేరళలో పర్యటించిన మంత్రి నారా లోకేశ్

**అమరావతి, సెప్టెంబర్ 4 :** ఆంధ్రప్రదేశ్ ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ శుక్రవారం కేరళలో పర్యటించారు. కొల్లం జిల్లాలోని ప్రఖ్యాత ఆధ్యాత్మిక కేంద్రమైన మాతా అమృతానందమయి (అమ్మ) ఆశ్రమాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా అమ్మను దర్శించుకుని ఆమె ఆశీస్సులు అందుకున్నారు. ఇది పూర్తిగా లోకేశ్ వ్యక్తిగత పర్యటన అని, అధికారిక కార్యక్రమం కాదని తెలుస్తోంది. అమృతపురిగా ప్రసిద్ధి చెందిన ఈ ఆశ్రమంలో లోకేశ్ దాదాపు మూడు గంటల పాటు గడిపారు. ఆశ్రమ ప్రాంగణంలో ఉన్న కాళీమాత ఆలయాన్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మను కలుసుకుని ఆశీర్వాదం పొందారు. ఆశ్రమంలోని గజరాజులకు పండ్లు అందించారు. ఈ పర్యటన తనకు ఎంతో ఆధ్యాత్మిక సంతృప్తినిచ్చిందని లోకేశ్ పేర్కొన్నారు. తన పర్యటనకు సంబంధించిన వివరాలను ఆయన తన ఎక్స్ ఖాతాలో పంచుకున్నారు. ఈ ఆధ్యాత్మిక పర్యటనలో భాగంగా లోకేశ్ అక్కడి విద్యాసంస్థలను కూడా పరిశీలించారు. ఆశ్రమం ఆధ్వర్యంలో నడుస్తున్న అమృత విశ్వ విద్యాపీఠంతో పాటు, అమృత ఆయుర్వేద కళాశాలను ఆయన సందర్శించారు. అక్కడి విద్యాబోధన, మౌలిక సదుపాయాల గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఏపీ విద్యాశాఖ మంత్రిగా ఆయన విద్యాపీఠాన్ని సందర్శించడం ప్రాధాన్యత సంతరించుకుంది.

# భారత్ మమ్మల్ని ముందే హెచ్చరించింది

- రాజకీయ ఒత్తిడికీ గురయ్యే పరిస్థితి వచ్చింది
- బెల్జియం ప్రధాని బార్ట్ డి వెవర్ వ్యాఖ్యలు

**న్యూఢిల్లీ, సెప్టెంబర్4 :** చైనాపై ఎక్కువగా ఆధారపడిన యూరప్.. ఇప్పుడు దాని ప్రభావాలను ఎదుర్కొంటోందని బెల్జియం ప్రధాని బార్ట్ డి వెవర్ అన్నారు. ఈ విషయంలో భారత్ మమ్మల్ని ఎప్పుడో హెచ్చరించిందని, అప్పట్లో తాము పట్టించుకోలేదని ఆయన అంగీకరించారు. రెండు రోజుల పర్యటనలో భాగంగా భారత్‌కి వచ్చిన బార్ట్ డి వెవర్.. ఢిల్లీలో జరిగిన కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ (సీఐఐ) కార్యక్రమంలో పాల్గొని, మాట్లాడారు. తక్కువ ధరలకే విదేశీ వస్తువులు యూరప్ మార్కెట్‌లోకి భారీగా రావడం వల్లే అక్కడి స్థానిక పరిశ్రమంలు తీవ్రంగా దెబ్బతిన్నాయని తెలిపారు. గడిచిన కాలం యూరప్‌కు ఒక మేలుకొలుపు. చాలా కాలంగా తక్కువ ధరలకు భారీగా వస్తువులు మా మార్కెట్‌లోకి వచ్చాయి. దాంతో మా పరిశ్రమలు దెబ్బతిన్నాయి. ఇతర దేశాలపై ఆధారపడే పరిస్థితి పెరిగింది. చివరికి ఆ ఆధారపడటాన్నే రాజకీయ ఒత్తిడికి ఉపయోగించే పరిస్థితి వచ్చింది" అని డివెవర్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన నేరుగా చైనా పేరును ప్రస్తావించలేదు, కానీ చైనా నుంచే యూరప్ మార్కెట్‌లోకి చౌకధరల వస్తువులు రావడంతో.. ఆయన చైనాను ఉద్దేశించే ఈ వ్యాఖ్యలు చేసినట్లు అందరికీ అర్థమవుతోంది. "మే గుర్తించకముందే భారత్ ఈ ప్రమాదాన్ని చూసింది. మమ్మల్ని హెచ్చరించింది. కానీ మేమే వినలేదు" అని డి వెవర్ ఒప్పుకొన్నారు. ఒక దేశంపై ఆర్థికంగా ఎక్కువగా ఆధారపడటం భవిష్యత్‌లో రాజకీయ ఒత్తిడికి కారణమయ్యే అవకాశం ఉందని ఇప్పుడు యూరప్ గుర్తించిందని ఆయన పేర్కొన్నారు. ఈ విషయంలో ప్రధాని నరేంద్ర మోదీ కూడా యూరప్‌ను చాలా కాలం కిందటే హెచ్చరించారని గుర్తు చేశారు. మీ ప్రధాని చాలా కాలం కిందటే యూరప్‌ను హెచ్చరించారు. కానీ అప్పట్లో ఎవరూ ఆయన మాట వినలేదు. ఇప్పుడు మేం వింటున్నాం" అని బెల్జియం ప్రధాని అన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో భారత్‌ను అత్యంత ముఖ్యమైన, నమ్మకమైన భాగస్వామిగా బెల్జియం చూస్తోందన్నారు. అదేవిధంగా పాకిస్థాన్‌కు కీలకమైన సైనిక సామగ్రి ఇవ్వబోమంటూ ఆయన స్పష్టం చేశారు. ప్రధాని మోదీ - బార్ట్ డి వెవర్ సమావేశాల సందర్భంగా భారత్ - బెల్జియం రక్షణ రంగ సంస్థల మధ్య పది ఒప్పందాలు కుదిరాయి.

# నాలుగు రోజుల వరుస నష్టాలకు విరామం

**ముంబయి:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు శుక్రవారం లాభాల్లో ముగిశాయి. అమెరికాలో వడ్డీ రేట్ల భయాలు సన్నగిల్లడంతో అంతర్జాతీయ మార్కెట్లు సహా దేశీయ మార్కెట్ సూచీలు లాభపడ్డాయి. దీంతో నాలుగు రోజుల వరుస నష్టాలకు బ్రేక్ పడింది. సెన్సెక్స్ ఉదయం 76,657.02 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 76,152.86) లాభాల్లో ప్రారంభమైంది. రోజంతా లాభాల్లోనే కదలాడింది. ఇంట్రాడేలో 76,883.14 పాయింట్ల వద్ద గరిష్ఠాన్ని తాకిన సూచీ.. చివరికి 362.57 పాయింట్ల లాభంతో 76,515.43 వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం 24.25 పాయింట్ల లాభంతో 23,897.70 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 94.49గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో టాటా స్టీల్, రిలయన్స్, బజాజ్ ఫైనాన్స్, ట్రెంట్, అదానీ పోర్ట్స్ షేర్లు లాభపడ్డాయి. భారతీ ఎయిర్‌టెల్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, ఎటర్నల్, ఏషియన్ పెయింట్స్, టీసీఎస్ షేర్లు నష్టాలను చవిచూశాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 95.22 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు 4,472 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.









## ఎన్ఎస్ఈ రూ.30వేల కోట్ల ఐపీఓకు సెబీ గ్రీన్ సిగ్నల్

ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజీ పబ్లిక్ ఇష్యూకు మార్కెట్ నియంత్రణ సంస్థ సెబీ ఆమోదం తెలిపింది. దీంతో సుమారు రూ.30వేల కోట్లు మార్కెట్ నుంచి సమీకరించేందుకు ఎన్ఎస్ఈకి మార్గం సుగమమైంది. జూన్‌లో సెబీకి ముసాయిదా పత్రాలు సమర్పించగా.. శుక్రవారం సెబీ ఆమోద ముద్ర వేసింది. సెప్టెంబర్ 18న ఐపీఓ ప్రారంభం కావొచ్చని సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. ధరల శ్రేణి, ఇతర వివరాలు సెప్టెంబర్ 15న వెల్లడయ్యే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఎన్ఎస్ఈ ఐపీఓ దాదాపు దశాబ్దం క్రితమే రావాల్సింది. కో-లొకేషన్ వివాదం కారణంగా దాదాపు దశాబ్ద కాలంగా పబ్లిక్ ఇష్యూ కోసం వేచి చూడాల్సి వచ్చింది. అన్ని అడ్డంకులూ దాటి సెబీ ఆమోదం కూడా పొందిన నేపథ్యంలో నిధుల సమీకరణకు ఎన్ఎస్ఈ సన్నాహాలు మొదలు పెట్టనుంది. ఈ ఇష్యూ పూర్తి ఆఫర్ ఫర్ సేల్ రూపంలో జరగనుంది. మొత్తం 14.89 కోట్ల షేర్లను ప్రస్తుత వాటాదారులు 6 శాతం వాటాలను విక్రయించనున్నారు. ఇందులో ఒక్క ఎస్‌బీఐనే 2.48 కోట్ల షేర్లను విక్రయించనుంది. సుమారు రూ.5 లక్షల కోట్ల మార్కెట్ విలువతో రూ.30వేల కోట్లు ఐపీఓ ద్వారా సమీకరించొచ్చని భావిస్తున్నారు. తద్వారా హ్యుందాయ్ రూ.27,870 కోట్ల రికార్డును అధిగమించనుంది. మరోవైపు, టెలికాం కంపెనీ జియో కూడా ఐపీఓకు వస్తోంది. సుమారు రూ.37 వేల కోట్ల వేట చేపట్టనుంది.



## మంధానకు ఇంకెప్పుడు కెప్టెన్సీ ఇస్తారు?

### మాజీ కెప్టెన్ డయానా ఎడుల్జీ డిమాండ్

మహిళల ఆసియా కప్‌లో హాంకాంగ్‌పై 124 పరుగులతో చెలరేగి అంతర్జాతీయ క్రికెట్‌లో అత్యధిక పరుగులు చేసిన బ్యాటర్‌గా స్మృతి మంధాన నిలిచింది. ఈ రికార్డుల పర్వం వేళ భారత మహిళల క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్ డయానా ఎడుల్జీ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. వైస్ కెప్టెన్‌గా ఉన్న 30 ఏళ్ల స్మృతి మంధానను తక్షణమే టెస్టులు, వన్డేలు, టీ20లు అనే తేడా లేకుండా మూడు ఫార్మాట్లలోనూ భారత జట్టుకు పూర్తిస్థాయి కెప్టెన్‌గా ప్రకటించాలని అమితా శర్మ నేతృత్వంలోని జాతీయ ఎంపిక కమిటీని కోరారు. ప్రస్తుత సారథి హర్మన్‌ప్రీత్ కౌర్‌ను జట్టు నుంచి తొలగించాలని తాను అనడం లేదని, కానీ ఆమె వయసు ఇప్పటికే 37 ఏళ్లకు చేరిందని డయానా గుర్తు చేశారు. హర్మన్ నుంచి కెప్టెన్సీ ఒత్తిడిని తొలగిస్తే ఆమె స్వేచ్ఛగా బ్యాటింగ్ చేసి మిడిల్ ఆర్డర్‌లో పరుగులు సాధించగలదని అభిప్రా యపడ్డారు. "మనం ప్రతిసారీ ఓపెనర్లపైనే ఆధారపడలేం కదా. మిడిల్ ఆర్డర్‌లో హర్మన్ ఫామ్ జట్టు విజయాలకు ఎంతో ముఖ్యం. అందుకే స్మృతికి కెప్టెన్సీ ఇచ్చి, హర్మన్‌ను సీనియర్ ప్లేయర్‌గా కొనసాగించాలి" అని డయానా విశ్లేషించారు. ప్రస్తుతం స్మృతి మంధాన మంచి ఫామ్‌తో పాటు పూర్తి ఆత్మవిశ్వాసంతో ఉందని, నాయకత్వ బాధ్యతలు చేపట్టడానికి ఇది సరైన సమయమని డయానా పేర్కొన్నారు. స్మృతి సుదీర్ఘకాలం కెప్టెన్‌గా ఉండే అవకాశం ఉంటుందని, ఆమెకు డిప్యూటీగా జెమీమా రోడ్రిగ్స్ లేదా షఫాలీ వర్మలను వైస్ కెప్టెన్లుగా నియమించి భవిష్యత్ సారథులుగా తీర్చిదిద్దవచ్చని సూచించారు. కనీసం పరిమిత ఓవర్ల క్రికెట్‌లోనైనా స్మృతికి కెప్టెన్సీ ఇచ్చి, టెస్టుల్లో హర్మన్‌ను కొనసాగించినా పర్లేదని ఆమె అభిప్రాయపడ్డారు. కాగా, కెప్టెన్సీకి తాను సిద్ధంగానే ఉన్నానని స్మృతి ఇప్పటికే ప్రకటించడం గమనార్హం. మరోవైపు మిథాలీ రాజ్ ఆల్‌టైమ్ పరుగుల రికార్డును మంధాన అధిగమించడంపై మిథాలీ కూడా సోషల్ మీడియా వేదికగా స్పందించారు. "ఒక సాధారణ క్రీడాకారిణిగా కెరీర్ ప్రారంభించి అత్యుత్తమ బ్యాటర్లలో ఒకరిగా స్మృతి ఎదిగిన తీరును చూశా. నా రికార్డును దాటి అంతర్జాతీయ క్రికెట్‌లో అత్యధిక పరుగులు సాధించిన మహిళా క్రికెటర్‌గా ఆమె నిలవడం సంతోషంగా ఉంది" అని మిథాలీ పోస్ట్ చేశారు.

## అంతర్జాతీయ క్రికెట్‌లో స్మృతి మంధాన రికార్డులు

భారత మహిళల క్రికెట్ స్టార్ ఓపెనర్ స్మృతి మంధాన .. ఆసియాకప్ 2026లో సెంచరీతో అంతర్జాతీయ క్రికెట్‌లో రికార్డుల బూజు దులిపేసింది. ఎన్నో ఏళ్లుగా చెక్కుచెదరకుండా ఉన్న రికార్డులను ఆమె తన ఒక్క ఇన్నింగ్స్‌తో బ్రేక్ చేసింది. దుబాయ్ వేదికగా హాంకాంగ్‌తో జరిగిన మహిళల ఆసియా కప్ 2026 మ్యాచ్‌లో 124 పరుగులు చేసింది మంధాన. దీంతో భారత మాజీ సారథి మిథాలీ రాజ్ పేరిట ఉన్న అత్యధిక పరుగుల రికార్డును అధిగమించింది. మిథాలీ అంతర్జాతీయ క్రికెట్‌లో సాధించిన 10,868 పరుగుల మైలురాయిని దాటి, ప్రస్తుతం 10,880 పరుగులతో ప్రపంచంలోనే అత్యధిక పరుగులు చేసిన మహిళా క్రికెటర్‌గా అగ్రస్థానంలో నిలిచింది.కేవలం పరుగుల రికార్డే కాకుండా, అంతర్జాతీయ మహిళల క్రికెట్‌లో అత్యధిక సెంచరీల రికార్డును కూడా స్మృతి మంధాన తన ఖాతాలో వేసుకుంది. హాంకాంగ్‌తో సెంచరీతో తన శతకాల సంఖ్యను మంధాన 18కి పెంచుకుంది. ఈ క్రమంలోనే ఆస్ట్రేలియా మాజీ కెప్టెన్ మెగ్ లానింగ్ (17 సెంచరీలు)ను అధిగమించి అగ్రస్థానంలో నిలిచింది. మహిళల క్రికెట్‌లో పదివేల పరుగుల క్లబ్‌లో ఉన్న సూజీ బేట్స్, చార్లెట్ ఎడ్వర్డ్స్, స్టెఫానీ టైలర్ వంటి క్రికెటర్ల సరసన నిలిచిన మంధాన, అత్యంత వేగంగా ఈ ఘనత సాధించి భారత్ గర్వపడేలా చేసింది. అంతేకాకుండా మహిళల టీ20 అంతర్జాతీయ క్రికెట్‌లో 4 వేర్వేరు క్యాలెండర్ సంవత్సరాలలో 500కు పైగా పరుగులు సాధించిన తొలి క్రికెటర్‌గా మంధాన నిలిచింది. 2026కు ముందు, ఆమె 2018, 2022, 2024 సంవత్సరాలలో ఈ మైలురాయిని అధిగమించింది.

## మహిళల ఆసియాకప్‌లో

# భారత్ జోరు

### హాంకాంగ్‌పై 137 పరుగుల తేడాతో విక్టరీ

మహిళల ఆసియాకప్ 2026లో భారత్ వరుసగా రెండో విజయం సాధించింది. గురువారం దుబాయ్ ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియంలో జరిగిన మ్యాచులో హాంకాంగ్‌ను 137 పరుగుల తేడాతో చిత్తు చేసింది. భారత ఓపెనర్ స్మృతి మంధాన రికార్డు సెంచరీతో టీమిండియా ఘన విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన భారత్ 193/5 రన్స్ చేసింది. అనంతరం హాంకాంగ్‌ను 56 పరుగులకు ఆలౌట్ చేసింది. దీంతో గ్రూప్-ఏలో అగ్రస్థానంలో నిలిచింది. తొలుత టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన టీమిండియాకు ఓపెనర్లు మంధాన, షఫాలీ వర్మ (28) శుభారంభం అందించారు. వీరిద్దరూ తొలి వికెట్‌కు వేగంగా పరుగులు జోడించి జట్టుకు బలమైన పునాది వేశారు. 8 ఓవర్లలో 74 పరుగులు జోడించారు. షఫాలీ అవుటైన తర్వాత కూడా మంధాన తన దాడిని కొనసాగించింది. ఎడాపెడా ఫోర్లు, సిక్సర్లతో మంధాన స్కోరు బోర్డును పరుగులు పెట్టించింది. హాంకాంగ్ బౌలర్లను ఊచకోత కోస్తూ.. ఆమె కేవలం 64 బంతుల్లో 14 ఫోర్లు, 7 సిక్సర్లతో 124 పరుగులు చేసింది. ఆరంభంలో కాస్త నిలకడగా ఆడినా, కుదురుకున్నాక హ్యాట్రిక్ సిక్సర్లు బాది స్కోరు బోర్డును పరుగులు పెట్టించింది. మంధాన రాణించినా మిగతా బ్యాటర్లు పెద్ద స్కోర్లు చేయలేకపోయారు. ప్రతికా రావల్ (10), రిచా ఘోష్ (11), హర్మన్ ప్రీత్ కౌర్ (10) విఫలమయ్యారు. దీంతో భారత్ నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 193 పరుగుల భారీ స్కోరు సాధించింది. 194 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన హాంకాంగ్ జట్టుకు భారత బౌలర్లు చుక్కలు చూపించారు. నందిని శర్మ ఆరంభంలోనే వికెట్ తీసి హాంకాంగ్ పతనాన్ని ప్రారంభించింది. ఆ తర్వాత స్పిన్ ఆల్‌రౌండర్ దీప్తి శర్మ, ప్రేమా రావత్, శ్రీ చరణిలు వరుస వికెట్లతో విరుచుకుపడటంతో హాంకాంగ్ కోలుకోలేకపోయింది. కేవలం 36 పరుగులకే 4 వికెట్లు కోల్పోయిన ఆ జట్టు, చివరి ఆరు వికెట్లను కేవలం 18 బంతుల వ్యవధిలోనే కోల్పోయి 16.2 ఓవరలలో 56 పరుగులకే ఆలౌటైంది. భారత్ 137 పరుగుల



తేడాతో విజయాన్ని నమోదు చేసింది. భారత బౌలర్లలో దీప్తి శర్మ అత్యుత్తమంగా రాణించి కేవలం 9 పరుగులిచ్చి 3 వికెట్లు పడగొట్టింది. ఆమెకు తోడుగా నందిని శర్మ (2/6), ప్రేమా రావత్ (2/12), శ్రీ చరణి (2/16) తలో రెండు వికెట్లు తీసి హాంకాంగ్ పతనాన్ని శాసించారు. ఈ విజయంతో భారత జట్టు గ్రూప్-ఏలో అగ్రస్థానాన్ని పదిలం చేసుకుంది. ఈ టోర్నీలో తమ తదుపరి మ్యాచులో భారత్.. సెప్టెంబర్ 5న పాకిస్థాన్‌తో తలపడనుంది.

## భారత్-జపాన్ మధ్య

# చారిత్రాత్మక పోరు..

భారత్-జపాన్ దేశాల మధ్య దౌత్య సంబంధాల 75వ వార్షికోత్సవాన్ని క్రికెట్ మైదానంలో ప్రత్యేక రీతిలో జరుపుకోనున్నారు. భారత పురుషుల క్రికెట్ జట్టు జపాన్‌తో ఓ టీ20 అంతర్జాతీయ మ్యాచ్ ఆడనుంది. ఇటువంటి అంతర్జాతీయ మ్యాచ్‌లో ఈ రెండు జట్లు తలపడటం ఇదే మొదటిసారి కావడం ఈ మ్యాచ్‌ను చారిత్రాత్మకంగా నిలుపుతోంది. సుజుకి కప్ సెప్టెంబర్ 22, 2026న టోచిగి ప్రిఫెక్చర్‌లోని సానో అంతర్జాతీయ క్రికెట్ మైదానంలో జరగనుంది. ఈ మ్యాచ్ భారత కాలమానం ప్రకారం ఉదయం 9:30 గంటలకు ప్రారంభమవుతుంది. జపాన్ క్రికెట్ అసోసియేషన్, భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) ఈ ప్రత్యేక మ్యాచ్‌ను ప్రకటించాయి. భారత పురుషుల క్రికెట్ జట్టు ఈ నెలలో ఆసియా క్రీడల కోసం జపాన్‌కు వెళ్లనుంది, కానీ దానికి ముందు జరిగే ఈ మ్యాచ్ చాలా ప్రత్యేకమైనది. టీమిండియా జపాన్‌తో తొలిసారిగా అంతర్జాతీయ మ్యాచ్ ఆడనుంది. ప్రపంచంలోని అత్యంత బలమైన క్రికెట్ జట్లలో ఒకటైన భారత్, జపాన్‌లో క్రికెట్‌కు కొత్త రూపునివ్వడంలో కీలక పాత్ర పోషించగలదు. జపాన్ క్రికెట్ అసోసియేషన్ ఆ దేశంలో క్రికెట్‌ను అభివృద్ధి చేయడానికి, దాని ప్రాచుర్యాన్ని పెంచడానికి చాలా కాలంగా కృషి చేస్తోంది. అందువల్ల భారత జట్టుతో జరిగే మ్యాచ్ స్థానిక ఆటగాళ్లకు, క్రికెట్ అభిమానులకు ఓ ప్రధాన ఆకర్షణగా నిలుస్తుంది. భారత్, జపాన్ మధ్య జరిగే ఈ మ్యాచ్ 'స్పోర్ట్ 75' చొరవలో భాగంగా జరిగే తొలి ఈవెంట్. క్రీడల ద్వారా ఇరు దేశాల మధ్య ప్రజల సంబంధాలను, సహకారాన్ని ప్రోత్సహించడమే ఈ చొరవ లక్ష్యం. 2036 ఒలింపిక్, పారాలింపిక్ క్రీడలకు ఆతిథ్యం ఇవ్వాలన్న భారత ఆకాంక్షను కూడా పరిగణనలోకి తీసుకుంటూ, క్రీడా రంగంలో పరస్పర సహకారాన్ని పెంపొందించేందుకు భారత్, జపాన్ అగ్ర నాయకత్వం మధ్య కుదిరిన ఒప్పందంలో ఈ చొరవ ఒక భాగం.ఈ మ్యాచ్ భారత క్రికెట్‌కు ఓ ముఖ్యమైన సందర్భమని బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా అభివర్ణించారు. జపాన్‌లో భారత జట్టు పాల్గొనడం కొత్త ప్రేక్షకులను చేరుకోవడానికి ఓ అవకాశమని ఆయన అన్నారు. భారత్, జపాన్‌ల మధ్య ఉన్న చిరకాల స్నేహ సంబంధాలను ప్రస్తావిస్తూ, ఇరు దేశాల మధ్య దౌత్య సంబంధాల 75వ వార్షికోత్సవ వేడుకల్లో క్రికెట్ పాల్గొనడం



ప్రత్యేక ప్రాముఖ్యతను సంతరించుకుందని సైకియా అన్నారు. క్రికెట్‌ను దాని సాంప్రదాయ ప్రాంతాలకు మించి తీసుకువెళ్లాల్సిన బాధ్యతను బీసీసీఐ అర్థం చేసుకుందని.. అక్కడ ఈ క్రీడను బలోపేతం చేయడానికి జపాన్ క్రికెట్ అసోసియేషన్‌తో కలిసి పనిచేస్తుందని కూడా ఆయన పేర్కొన్నారు.జపాన్ క్రికెట్ అసోసియేషన్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (సీఈఓ) నవోకి మియాజీ.. భారత జట్టుకు జపాన్ ఆహ్వానం అందడాన్ని తమ సంస్థకు ఓ చారిత్రాత్మక ఘట్టంగా అభివర్ణించారు. ఆయన బీసీసీఐకి దాని మద్దతుకు కృతజ్ఞతలు తెలుపుతూ, భారత క్రికెట్ అభిమానులు జపాన్‌కు తరలివస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. మియాజీ స్థానిక జపనీయులకు కూడా ఈ మ్యాచ్‌ను వీక్షించి, తమ జట్టుకు మద్దతు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. జపాన్ ఆటగాళ్లకు, భారత్ వంటి బలమైన జట్టుతో ఆడటం అంతర్జాతీయ స్థాయిలో తమను తాము పరీక్షించుకోవడానికి ఓ గొప్ప అవకాశం అవుతుంది. మరోవైపు ఆసియా గేమ్స్ 2026 టోర్నీకి టీమిండియా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ దూరంగా ఉండనున్నాడు. ఈ విషయాన్ని కేంద్ర క్రీడల మంత్రిత్వ శాఖ వెల్లడించింది. ఈ టోర్నీలో భారత పురుషుల క్రికెట్ జట్టుకు బీసీసీఐ సీఓఈ డైరెక్టర్ వీవీఎస్ లక్ష్మణ్ ప్రధాన కోచ్‌గా వ్యవహరిస్తాడని గురువారం ప్రకటించింది. జపాన్‌లోని ఐచి-నగోయా వేదికగా జరగనున్న ఆసియా గేమ్స్‌కు భారత బృందాన్ని కేంద్ర క్రీడల మంత్రిత్వ శాఖ గురువారం వెల్లడించింది.



## 76 శాతం ప్రీమియంతో లిస్టింగ్..

ఈఎస్‌డీఎస్ సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ స్టాక్ ఎక్స్ఛేంజీల్లో గ్రాండ్ ఎంట్రీ ఇచ్చింది. మదుపర్లకు మంచి లాభాలను అందించింది. ఇష్యూ ధర రూ.429 కాగా.. 76 శాతం ప్రీమియంతో కంపెనీ షేర్లు లిస్టయ్యాయి. అనంతరం షేర్లు అప్పర్ సర్క్యూట్‌ను తాకాయి. ఇష్యూ ధరతో పోలిస్తే ఈఎస్‌డీఎస్ షేర్లు ఎన్ఎస్ఈలో 76.46 శాతం ప్రీమియంతో రూ.757 వద్ద ప్రారంభమయ్యాయి. బీఎస్ఈలోనూ 73.96 శాతం ప్రీమియంతో రూ.746.30 వద్ద లిస్టయ్యాయి. లిస్టింగ్ తర్వాత కూడా షేర్లు రాణించాయి. ఇష్యూ ధరతో పోలిస్తే ఎన్ఎస్ఈలో 111.75 శాతం ప్రీమియంతో రూ.908.40 వద్ద, బీఎస్ఈలో 108.75 ప్రీమియంతో రూ.895.55 వద్ద షేర్లు అప్పర్ సర్క్యూట్‌ను తాకాయి. దీంతో కంపెనీ మార్కెట్ విలువ రూ.10,500 కోట్లు దాటింది. ఏఐ ఆధారిత క్లౌడ్, డేటా సెంటర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ ప్రొవైడర్ అయిన ఈఎస్‌డీఎస్ సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ రూ.720 కోట్లను పబ్లిక్ ఇష్యూ ద్వారా సమీకరించింది. ధరల శ్రేణిని రూ408-429గా నిర్ణయించింది. సబ్‌స్క్రిప్షన్ సమయంలోనూ ఇన్వెస్టర్ల నుంచి మంచి డిమాండ్ రావడంతో 142 రెట్లు ఓవర్ సబ్‌స్క్రైబ్ అయ్యింది. పబ్లిక్ ఇష్యూ ద్వారా సమీకరించిన నిధులను క్లౌడ్ కంప్యూటింగ్, డేటా సెంటర్ ఎక్విప్‌మెంట్, సాధారణ కార్పొరేట్ అవసరాల కోసం వినియోగించనుంది.




## ఒరాకిల్‌లో 'సైలెంట్' లేఆఫ్‌లు..

భారీగా లేఆఫ్‌లకు సిద్ధమైన టెక్ దిగ్గజం ఒరాకిల్.. ఈసారి సైలెంట్‌గా ఉద్యోగులను తొలగిస్తోందని తెలుస్తోంది. గతంలో మాదిరిగా ఉదయం ఆరుగంటల సమయంలో ఉద్యోగులకు ఎలాంటి ఈ మెయిల్స్ రాలేదు. కానీ సిబ్బంది 'స్లాక్' ఖాతాలు మాత్రం మాయమవుతున్నాయట. ఈ మేరకు రెడిట్ ఖాతాలో 'లేఆఫ్స్ స్టార్టెడ్ ఇన్ యూఎస్' అనే ఒక థ్రెడ్ తాజాగా వైరల్ అవుతోంది. కంపెనీ అంతర్గత కమ్యూనికేషన్ యాప్ 'స్లాక్'లో లేఆఫ్‌లకు గురైన వారి ఖాతాలు క్రమక్రమంగా కనిపించకుండా పోతున్నాయనే ప్రచారం జరుగుతోంది. వీరందరికీ ఒకేసారి సందేశాలు పంపకపోయినా.. తొలగింపులు జరుగుతున్నట్లు వార్తలు వస్తున్నాయి. లేఆఫ్ తర్వాత ఎలాంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండానే.. సదరు ఉద్యోగుల స్లాక్ ఖాతాలు, కంపెనీ ఈ మెయిల్ యాక్సెస్‌ను నిలిపివేస్తున్నట్లు తెలుస్తోంది. దీంతో కంపెనీ నుంచి ఎవరెవరిని తీసేస్తున్నారో అధికారికంగా తెలియకపోవడంతో, మిగిలిన ఉద్యోగులు స్లాక్ గ్రూప్‌లలోని సభ్యుల సంఖ్యను గమనిస్తున్నారట. ఎంతమంది తగ్గిపోయారో ట్రాక్ చేస్తున్నారు. ఒరాకిల్‌కు చెందిన అప్లికేషన్ ల్యాబ్స్ బృందంలోని వైస్ ప్రెసిడెంట్స్, గ్రూప్ వైస్ ప్రెసిడెంట్స్ పదవులు పోయినట్లు సమాచారం. ఈ బృందాన్ని ఇటీవల ఒరాకిల్ క్లౌడ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌లో విలీనం చేశారు. తాజా కోతలతో ప్రపంచవ్యాప్తంగా దాదాపు 7,000 నుంచి 10,000 మంది ఉద్యోగులపై ప్రభావం పడే అవకాశం ఉందని అంచనా. భారత్‌లో వివిధ విభాగాల మేనేజర్లు ఈ జాబితాలో ఉన్నట్లు తెలుస్తోంది. ఈ ఏడాది మార్చి నెలలో ఒరాకిల్ 10వేల మంది సిబ్బందిని తగ్గించుకుంది. అప్పుడు ఒకటో తేదీ ఉదయం ఆరుగంటల సమయంలో యూఎస్, ఇండియా, కెనడాలోని సిబ్బందికి తొలగింపు మెయిల్స్ పంపింది. ఇప్పుడు సెప్టెంబర్ ఒకటిన అలాంటి మెయిల్స్ వస్తాయని భావించినా.. కంపెనీ భిన్నంగా వ్యవహరిస్తున్నట్లు తెలుస్తోంది. మీడియా దృష్టిలో పడకుండా, విమర్శలకు దూరంగా ఉండేందుకు ఇలా చేస్తోందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

జనం వార్త
ప్రతి అక్షరం.. జనం కోసం..



# పనిపాటా లేనివాళ్లకే ఓటీటీలు..



సీనియర్ నటుడు శివాజీ పేరు ఇటీవలి కాలంలో వివాదాల్లో ఎక్కువగా వినిపిస్తోంది. మనసులో ఉన్నది ఉన్నట్లు ముఖం మీద కొట్టినట్లు మాట్లాడటం శివాజీ స్టైల్. ఈ విషయంలో ఎవరు ఏమనుకున్నా ఆయన వెనక్కి తగ్గరు. ఆ ముక్కుసూటితనమే వివాదాలకు కారణమవుతోంది. గతేడాది చివరిలో దండోరా సినిమా ఈవెంట్‌లో మహిళల వస్త్రధారణ గురించి శివాజీ చేసిన వ్యాఖ్యలు పెను దుమారం రేపాయి. సోషల్ మీడియాలో ట్రోలింగ్‌కు తోడు ఏకంగా మహిళా కమీషన్ వరకు విషయం వెళ్లింది. ఆ తర్వాత ఈ వివాదం నెమ్మదిగా సద్దుమణిగింది. తాజాగా ఓటీటీలపై శివాజీ షాకింగ్ కామెంట్స్ చేశారు. ఈ వివరాల్లోకి వెళితే.. భారతదేశాన్ని కరోనా మహమ్మారి కమ్మేసినప్పుడు అందుబాటులోకి వచ్చిన ఓటీటీలు దేశంలోని వినోద రంగంపై పెను ప్రభావాన్ని చూపించాయి. అప్పట్లో థియేటర్‌కు వెళ్లే పరిస్థితి లేకపోవడంతో ప్రజలు వినోదం కోసం ఓటీటీపైనే ఆధారపడ్డారు. ఆ తర్వాత లాక్‌డౌన్ ఎత్తివేసి థియేటర్లు తెరిచినా అటు వైపు వెళ్లడానికి ప్రేక్షకుడు అంతగా ఆసక్తి చూపించలేదు. పెరిగిన టికెట్ ధరలు, తినుబండారాల ధరలు సామాన్యుడికి వణుకు పుట్టించాయి. అంత ఖర్చుపెట్టి సినిమా థియేటర్‌కు వెళ్తే చెత్త కంటెంట్‌తో మేకర్స్ విసుగు తెప్పిస్తున్నారు. వేలకు వేలు ఖర్చు పెట్టే కంటే అతి తక్కువ ఖర్చుతో ఇంట్లోనే కుటుంబ సభ్యులంతా కలిసి చూసేలా ఓటీటీలు వినోదాన్ని అందిస్తుండటంతో ప్రేక్షకుడు ఇటువైపు మొగ్గుచూపుతున్నారు. ఒక్క భాషకు పరిమితం కాకుండా ప్రపంచం నలుమూలలకు చెందిన ఒరిజినల్ కంటెంట్‌ను ఆస్వాదించే అవకాశం కలిగింది. భారతదేశంలో ఓటీటీ మార్కెట్ గిరాకిని గుర్తించిన అనేక బడా కంపెనీలు ఇక్కడి సినిమాలు, వెబ్ సిరీస్‌లు, ఇతర ఒరిజినల్ కంటెంట్‌ను దక్కించుకుని ప్రేక్షకుడిని ఆకట్టుకుంటున్నాయి. నిర్మాతలకు ఓటీటీ రైట్స్ రూపంలో అదనపు లాభాలు రావడంతో వారు కూడా వీటిని ప్రోత్సహించారు. అయితే ఆ తర్వాత ఓటీటీ కంపెనీలు.. సినిమాలు ఎప్పుడు విడుదల చేయాలో డిసైడ్ చేసే స్థాయికి చేరుకున్నాయనే ఆరోపణలు వెల్లువెత్తాయి. మంచి సినిమాలు వస్తుండటంతో ఇప్పుడిప్పుడే ప్రేక్షకులు తిరిగి థియేటర్ బాట పడుతున్నారు. కాగా.. ఆనంద్ దేవరకొండ- వైష్ణవి చైతన్య జంటగా తెరకెక్కిన మూవీ ఎపిక్- ఫస్ట్ సెమిస్టర్. ఆదిత్య హాసన్ దర్శకత్వం వహించిన ఈ సినిమాను శ్రీకర స్టూడియోస్ బ్యానర్‌పై సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ బ్యానర్‌పై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్యలు నిర్మిస్తున్నారు. హేషమ్ అబ్దుల్ వహబ్ సంగీతం అందిస్తుండగా.. అజీమ్ మొహమ్మద్ సినిమాటోగ్రాఫర్‌గా, నవీన్ నూలి ఎడిటర్‌గా వ్యవహరిస్తున్నారు. సెప్టెంబర్ 11న ఎపిక్ మూవీ ప్రేక్షకుల ముందుకు రానుంది.

# రంభ ఊర్వశి మేనక

## వినోదం పంచలేకపోయారు

రివ్యూ




ఇటీవల పలువురు హీరోలు హిట్ కొడుతూ ఫామ్‌లోకి వచ్చేస్తున్నారు. అల్లరి నరేశ్ కూడా ఆ జాబితాలోకి చేరొచ్చే మో అనే ఆశలు, అంచనాల మధ్య 'రంభ ఊర్వశి మేనక' ప్రేక్షకుల ముందుకొచ్చింది. మంతెన సూర్యనారాయణ అలియాస్ సూరి (అల్లరి నరేశ్) కుటుంబం తరాలుగా రంభ ఊర్వశి మేనక డ్రామా కంపెనీని నిర్వహిస్తుంటుంది. ఆ కుటుంబం దగ్గర ఓ మేజిక్ బుక్ ఉంటుంది. ఆ బుక్‌పై సరిగ్గా ముగ్గు వేస్తే పైనుంచి రంభ ఊర్వశి మేనక దిగి వచ్చి కోరికలన్నీ తీర్చేస్తారని ఓ నమ్మకం. ఆ బుక్‌నే నమ్ముకున్న కుటుంబం అప్పుల ఊబిలోకి వెళ్లిపోతుంది తప్ప రంభ ఊర్వశి మేనక మాత్రం దిగిరారు. సూరి కూడా అంతే. చిన్నప్పట్నుంచీ హీరో కావాలనేది అతని కల. కానీ, అందుకు తగ్గ ప్రయత్నాలేవీ చేయకుండా, మేజిక్ బుక్ పేరు చెప్పి అందరి దగ్గరా అప్పులు చేస్తుంటాడు. అలా ఊరి నిండా అప్పులు పెరిగిపోయి కష్టాలు చుట్టు ముడతాయి తప్ప ఆ మేజిక్ బుక్ తెరుచుకోదు, ఇంతలో సూరి తల్లి మంచం పడుతుంది. ఆమె ప్రాణాలు దక్కాలంటే రూ.లక్షలు అవసరం అంటారు వైద్యులు. ఏం చేయాలో దిక్కు తోచని స్థితిలో ఉన్న సూరి మరోసారి మేజిక్ బుక్‌పై ముగ్గు వేస్తాడు. అనూహ్యంగా ఆ బుక్ తెరుచుకుని పైనుంచి రంభ ఊర్వశి మేనక దిగొస్తారు. మరి వాళ్లు సూరి కోరికల్ని తీర్చారా? లేక కొత్త కష్టాల్ని తీసుకొచ్చారా? హీరో కావాలన్న సూరి కల నెరవేరిందా? తదితర విషయాల్ని తెరపై చూసి తెలుసుకోవాల్సిందే.

### ఎలా ఉందంటే..

ఏమాత్రం కొత్తదనం లేని రెగ్యులర్ ఫాంటసీ కామెడీ చిత్రమిది. ఒడిస్సీ, భోగాపురం ఎయిర్‌పోర్ట్, అమరావతి, ఓజీ... ఇలా ఇటీవల ట్రెండ్ అయిన ప్రతి మాట, అంశం సినిమాలో వినిపిస్తుంటాయి. కొత్త సినిమాలు, వ్యక్తుల్ని గుర్తు చేసే స్ఫూఫ్‌లు తెరపై దర్శనమిస్తుంటాయి. కానీ, ఆ సన్నివేశాలేవీ ఆశించినంత వినోదాత్మకంగా ఉండవు. ప్రేక్షకులు ఆస్వాదించే వినోదం ఎప్పటికప్పుడు మారుతూ ఉంటుంది. ఆ విషయాన్ని గుర్తించి, అందుకు తగ్గట్టుగా సన్నివేశాల్ని మలిస్తేనే ప్రయోజనం. ఈ సినిమాలోని కథ, కథనం, హాస్య సన్నివేశాల్ని మలిచిన తీరు అంతా పాత పద్ధతుల్లోనే ఉంది. అక్కడక్కడా కొన్ని నవ్వులు పండాయంటే... కథానాయకుడితో పాటు, అనుభవం ఉన్న వీకే నరేశ్, వెన్నెల కిశోర్, శ్రీనివాసరెడ్డి తదితర నటులే కారణం. బలమైన కథ, సంఘర్షణ లేకుండా ఒట్టి మాటలతో ఎన్ని గారడీలు చేసినా ఫలితం పెద్దగా కనిపించదు. మోనోలాగ్‌ల తోనూ, పంచ్‌లతోనూ పాత్రలు పేజీలకొద్దీ సంభాషణలు చెబుతుంటాయి. కానీ, వాటి ప్రభావం సన్నివేశంలో ప్రతిబింబించదు. పోనీ సన్నివేశాలైనా కొత్తగా మలిచి, వాటి నుంచి హాస్యం రాబట్టారా? అంటే అదీ లేదు. ప్రథమార్ధంతో పోలిస్తే ద్వితీయార్ధం కాస్త పర్వాలేదు. రంభ ఊర్వశి మేనకల దగ్గరకు అల్లరి నరేశ్, వీకే నరేశ్, శ్రీనివాస్‌రెడ్డి భయపడుతూ వెళ్లే సన్నివేశాలు కాస్త నవ్విస్తాయి. నిజమైన హీరోకి అర్థం చెప్పే పతాక సన్నివేశాల్లో సందేశం ఆకట్టుకుంటుంది.

### ఎవరెలా చేశారంటే..

అల్లరి నరేశ్ తన శైలి కామెడీతో సందడి చేశాడు. ఆయనకి సూరిలాంటి పాత్రలు కొత్త కాదు, ఇలాంటి హాస్యం కూడా కొత్త కాదు. రంభ ఊర్వశి మేనక డ్రామా కంపెనీ (రమ్) సీఈఓగా వీకే నరేశ్ పాత్ర ఈ సినిమాకి ప్రధాన ఆకర్షణ. రంభ ప్రేమలో ఉండే బ్యాచిలర్ అయిన ఆయన ద్వితీయార్ధంలో చేసిన సందడి ఆకట్టుకుంటుంది. పరిమళ పాత్రలో శ్రీనివాసరెడ్డి చేసిన సందడీ నవ్విస్తుంది. ఇంద్రుడుగా వెన్నెల కిశోర్, యమధర్మరాజుగా అజయ్, సూరి ఫ్యాన్‌గా కనిపించే రచ్చ రవి పాత్రలు పర్వాలేదనిపిస్తాయి. కథానాయిక సురభి పాత్రకి పెద్దగా ప్రాధాన్యం లేదు. రంభ ఊర్వశి మేనక పాత్రల్లో రాశిసింగ్, విష్ణుప్రియ, ప్రిషాసింగ్ అందంగా కనిపించారు. సాంకేతిక విభాగాల విషయానికొస్తే పాటలు, నేపథ్య సంగీతంతో పాటు, కెమెరా పనితనం మెప్పిస్తుంది. నందు సంభాషణలు అక్కడక్కడా ప్రభావం చూపించాయి. దర్శకుడు సినిమాని స్పష్టతతోనే తెరకెక్కించారు కానీ, ఆయన రాసుకున్న కథ, కథనాల్లోనే కొత్తదనం లేదు.

# ఇండస్ట్రీలో నా ఫేవరెట్ హీరోయిన్లు వారే..

## మాళవిక మోహనన్ ఆసక్తికర కామెంట్స్

గ్లామరస్ బ్యూటీ మాళవిక మోహనన్ 'సర్దార్-2' చిత్రంతో ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమయ్యారు. కార్తి హీరోగా నటిస్తుండగా.. మిత్రన్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న భారీ ప్రాజెక్ట్‌లో ఎస్.జె. సూర్య, ఆషికా రంగనాథ్, రజిషా విజయన్, యోగి బాబు కీలక పాత్రలో నటిస్తున్నారు. ప్రిన్స్ పిక్చర్స్ మరియు ఐవీ ఎంటర్‌టైన్మెంట్ నిర్మిస్తున్న ఈ సినిమా సెప్టెంబర్ 10న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి రానుంది. ఈక్రమంలో.. తాజాగా ఇన్స్టాగ్రామ్‌లో అభిమానులతో నిర్వహించిన క్వశ్చన్ అండ్ ఆన్సర్ సెషన్‌లో మాళవిక పలు ఆసక్తికర విషయాలను వెల్లడించారు. తన రాబోయే చిత్రం 'సర్దార్ 2' ప్రమోషన్లలో భాగంగా పాల్గొన్న ఆమె, తమిళ సినిమాలో తనకెంతో నచ్చిన ముగ్గురు హీరోయిన్ల నటన గురించి ప్రత్యేకంగా మాట్లాడారు. ఫ్యాన్స్ అడిగిన ప్రశ్నకు స్పందిస్తూ సాయి పల్లవి, త్రిష , నిత్యా మీనన్ల నటనపై ప్రశంసలు కురిపించారు. 'అమరన్' సినిమాలో సాయి పల్లవి ప్రదర్శించిన నటన ఎంతో ముచ్చటగా ఉందని, ఆ చిత్రానికి ఆమె ఆత్మలా నిలిచారని మాళవిక కొనియాడారు. అలాగే 'పొన్నియిన్ సెల్వన్'లో త్రిష ఎంతో రాజసంగా, ఎలిగెంట్‌గా కనిపిస్తూ ఆ పాత్రను ఎంతో సౌమ్యంగా పోషించారని ప్రశంసించారు. ఇక నిత్యా మీనన్ వర్క్ గురించి చెబుతూ.. ఆమె ఎంతో టాలెంటెడ్ అని, అన్ని భాషలు మాట్లాడుతుందని తెలిపారు. వివిధ ఇండస్ట్రీలలో సులువుగా రాణిస్తూ వైవిధ్యమైన పాత్రలు చేస్తుందని, ముఖ్యంగా 'తిరుచిత్రంబలం' మూవీలో నిత్య నటన చాలా క్యూట్‌గా, అద్భుతంగా ఉందని పేర్కొన్నారు. ఇక మాళవిక సినిమాల విషయానికొస్తే.. త్యాగరాజన్ కుమారరాజా దర్శకత్వంలో విజయ్ సేతుపతి, రాజ్ బి శెట్టిలతో కలసి 'పాకెట్ నావెల్' అనే చిత్రంలోనూ ఆమె ప్రధాన పాత్రలో కనిపించబోతున్నారు. వరుస సినిమాలతో దూసుకుపోతున్న మాళవిక సోషల్ మీడియాలోనూ యాక్టివ్‌గా ఉంటున్నారు.



# మీ ప్రేమను పొందటం నా అదృష్టం..

## దిశా పటాని ఎమోషనల్ పోస్ట్ వైరల్

ఇమ్రాన్ హష్మి, దిశా పటానీ జంటగా.. దర్శకుడు నితిన్ కక్కర్ తెరకెక్కించిన చిత్రం 'ఆవారాపన్ -2'. ఈ యాక్షన్ స్పై థ్రిల్లర్ చిత్రం ఆగస్టు 14న విడుదలై బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని అందుకుంది. అంతే కాకుండా ఇప్పటివరకూ ప్రపంచవ్యాప్తంగా రూ. 200 కోట్లు సాధించి రికార్డులు సృష్టించింది. ఈ సినిమా ఇంత సక్సెస్ కావడంతో హీరోయిన్ దిశా పటానీ తన ఆనందాన్ని సోషల్ మీడియా వేదికగా పంచుకుంది. ఈ మేరకు తన ఎక్స్ అకౌంట్ వేదికగా.. 'మనమందరం ఎప్పటికీ గుర్తుంచుకునే ఒక కథను చెప్పే ఈ ప్రయాణంలో.. ఇంత అద్భుతమైన, మంచి మనసున్న వ్యక్తులతో కలిసి పనిచేయడం చాలా సంతోషంగా ఉంది. ఈ బృందంలో భాగం కావడం నిజంగా ఒక గౌరవంగా భావిస్తున్నా. 'ఆవారాపన్-2' సినిమాపై ప్రేక్షకులు చూపించిన ప్రేమకు ఎంతో కృతజ్ఞతతో ఉన్నాను. మీరు నాపై చూపిస్తున్న ఈ ప్రేమను పొందటం నా అదృష్టం. ఎంతో సంతోషంగా ఉంది' అంటూ చెప్పుకొచ్చింది దిశా. కాగా.. 2007లో ఇమ్రాన్ హష్మి, శ్రియా శరణ్ జంటగా, మోహిత్ సూరి దర్శకత్వంలో వచ్చిన చిత్రం 'ఆవారాపన్'. అప్పట్లో ఈ చిత్రం మంచి టాక్ సొంతం చేసుకున్నప్పటికీ రూ. 18 కోట్ల బడ్జెట్‌తో తెరకెక్కిస్తే.. కేవలం రూ. 12 కోట్లు మాత్రమే వసూలు చేసింది. అలా యావరేజ్‌గా నిలిచిన ఈ మూవీకి ఇప్పుడు సీక్వెల్‌గా 'ఆవారాపన్-2' రాగా.. బ్లాక్ బస్టర్ హిట్ సొంతం చేసుకోవడంతో పాటు బాక్సాఫీస్ వద్ద రూ. 200 కోట్లు వసూలు రాబట్టడంతో అద్భుతంగా భావిస్తున్నారు సినీ విశ్లేషకులు.



# అందుకే ఆ సినిమా ప్రమోషన్లకు వెళ్లలేదు..

## విమర్శలపై స్పందించిన నటి

ఇటీవల వరుస చిత్రాలతో అలరిస్తున్న కథానాయిక కయాదు లోహర్. ఆమె నటించిన తాజా చిత్రం 'ఇమ్మోర్టల్'. జీవీ ప్రకాశ్ కుమార్ హీరో. అయితే, ఈ సినిమా ప్రమోషన్లలో ఆమె కనిపించకపోవడంపై ఇటీవల నెట్టింట తీవ్ర విమర్శలు వచ్చాయి. దుల్కర్ సల్మాన్ చిత్రం 'ఐ యామ్ గేమ్' ప్రచారంలో పాల్గొని, 'ఇమ్మోర్టల్' ప్రమోషన్లకు రాలేదంటూ వచ్చిన ఆరోపణలపై ఆమె స్పందించారు. ఈ విమర్శలపై ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ అసలు విషయాన్ని వెల్లడించారు. "ఇలాంటి కాంట్రవర్సీలను నేను పెద్దగా పట్టించుకోను. 'ఐ యామ్ గేమ్' చిత్ర ప్రమోషన్లకు నాకు ఒక్కరోజు సమయం దొరికింది. దానికి హాజరయ్యాను. ఆ రోజు 'ఇమ్మోర్టల్' చిత్ర యూనిట్ ఏ ప్రచార కార్యక్రమాలూ పెట్టుకోలేదు. పైగా ఆ సమయంలో నేను మరో సినిమా షూటింగ్‌లో బిజీగా ఉన్నా. షూటింగ్స్ ఎలా ఉంటాయో అందరికీ తెలుసు. చాలా మందితో ముడిపడి ఉండే వ్యవహారమిది. అందుకే 'ఇమ్మోర్టల్' ప్రమోషన్లలో పాల్గొనలేదు. అంతేకానీ, కావాలని ఏ సినిమానూ నిర్లక్ష్యం చేయలేదు. నిజానికి 'ఐ యామ్ గేమ్'కు సంబంధించిన కొన్ని కార్యక్రమాలకు కూడా నేను వెళ్లలేదు" అని వివరించారు.

# తొలిసారి 'హారర్ కామెడీ' బాటలో మాస్ మహారాజా




బాక్సాఫీస్ వద్ద రికార్డుల వేట మొదలైతే ఎలా ఉంటుందో మాస్ మహారాజా రవితేజ మరోసారి నిరూపించారు. ఇటీవల విడుదలైన 'ఇరుముడి' చిత్రం ఘనవిజయం సాధించి థియేటర్లలో కలెక్షన్ల వర్షం కురిపిస్తోంది. పిల్లలు, పెద్దలు అనే తేడా లేకుండా అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకుంటూ ఈ చిత్రం తాజాగా రూ. 200 కోట్ల క్లబ్‌లోకి అడుగుపెట్టింది. ఈ బ్లాక్‌బస్టర్ విజయాన్ని పురస్కరించుకుని చిత్ర బృందం విడుదల చేసిన ప్రత్యేక పోస్టర్ సైతం అభిమానులను విశేషంగా ఆకర్షిస్తోంది. సినిమా ఆరంభంలో బేబీ నక్షత్ర, రవితేజ, ప్రియా భవానీ శంకర్‌లపై చిత్రీకరించిన అన్‌సీన్ స్టిల్‌ను చిత్ర దర్శకుడు శివ నిర్వాణ పంచుకుంటూ సక్సెస్ ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఈ చారిత్రాత్మక విజయంతో ఫుల్ జోష్‌లో ఉన్న రవితేజ, తన భవిష్యత్ ప్రాజెక్టుల విషయంలో వేగాన్ని పెంచడమే కాకుండా ప్రేక్షకులను ఆశ్చర్యపరిచే సరికొత్త పంథాను ఎంచుకుంటున్నారు. ఎప్పుడూ రొటీన్ మాస్, కమర్షియల్ ఫార్ములాకే పరిమితం కాకుండా, కెరీర్‌లోనే మునుపెన్నడూ చేయని వినూత్న ప్రయోగాలకు శ్రీకారం చుడుతున్నారు. ఈ సరికొత్త ప్రయాణంలో భాగంగా టాలీవుడ్‌లో వైవిధ్యమైన దర్శకుడిగా పేరు తెచ్చుకున్న వివేక్ ఆత్రేయతో రవితేజ చేతులు కలిపారు. 'సరిపోదా శనివారం' వంటి విజయవంతమైన చిత్రం తర్వాత వివేక్ ఆత్రేయ సిద్ధం చేసిన కథ రవితేజను అమితంగా ఆకట్టుకుంది. ఈ ప్రాజెక్ట్ ద్వారా రవితేజ తన సుదీర్ఘ సినీ ప్రస్థానంలో ఎన్నడూ టచ్ చేయని 'హారర్ కామెడీ' జోనర్‌లోకి తొలిసారిగా అడుగుపెడుతుండటం సినీ వర్గాల్లో తీవ్ర ఆసక్తిని రేకెత్తిస్తోంది. సాధారణంగా మాస్ యాక్షన్, ఫ్యామిలీ డ్రామా, క్రైమ్ థ్రిల్లర్లతో పాటు పక్కా ఎంటర్‌టైనర్లలో రవితేజ తన మార్క్ చూపించారు. అయితే ప్రేక్షకులను భయపెడుతూనే కడుపుబ్బా నవ్వించే హారర్ కామెడీ తరహా పాత్రను ఆయన ఇంతవరకు చేయలేదు. వివేక్ ఆత్రేయ మార్క్ విలక్షణమైన స్క్రీన్‌ప్లే, రవితేజ అసమానమైన ఎనర్జీ, టైమింగ్ తోడైతే వెండితెరపై నవ్వుల విందు గ్యారెంటీ అని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. లక్ష్మణ్, శ్రీని సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రం ప్రస్తుతం ప్రీ-ప్రొడక్షన్ పనుల్లో ఉంది. వివేక్ ఆత్రేయ చిత్రంతో పాటే మరో క్రేజీ ప్రాజెక్ట్‌ను కూడా రవితేజ ఖరారు చేశారు.

PUBLISHED AND OWNED BY DUSARI KASTURI, PRINTER B SANDHYA RANI PRINTED AT M/S.KAKATIYA PRINTERS 2-24-96/9, NEAR SRI KRISHNA PHARMA, LAXMINARAYANA NAGAR, IDA UPPAL, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500039, PUBLISHED AT H.NO. 9-875/104/3A, BAPUJI COLONY, NEAR VIJAYA HOSPITAL NAGARAM , MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500083.,EDITOR : DUSARI RAVINDER GOUD, PRGI REGISTRATION NUMBER TGTEL/25/A1132, CELL :8522055889 MAIL ID:dusari kasturi9@gmail.com